అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

ఆదివారం 4-3-2018 సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 4 సంచిక : 65 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar, Mahaboobnagar, Warangal | 12 + 16 పేజీలు | వెల 6.00


మేఘాలయ, నాగాలాండ్‌లో హంగ్

- త్రిపుర ఎన్నికల్లో బీజేపీ గెలుపు
- మూడు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు

వివరాలు 2లో



త్రిపురలోని సీపీఐ(ఎం) కార్యాలయంపై బీజేపీ కార్యకర్తలు దాడి చేసి తగులబెట్టారు..మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది



కాంగ్రెస్, బీజేపీలకు
ప్రత్యామ్నాయం

దేశ రాజకీయాల్లో గుణాత్మక మార్పు రావాలి

- ఏర్పడే ఫ్రంట్‌కు అవసరమైతే నాయకత్వం వహిస్తా
- ఇప్పటికే చర్చలు ప్రారంభమయ్యాయి
- అన్నిపార్టీలనూ కలుస్తా, దేశవ్యాప్తంగా పర్యటిస్తా : విలేకరుల సమావేశంలో సీఎం కేసీఆర్



నవతెలంగాణప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

'70 ఏండ్ల స్వతంత్ర భారతావనిలో ఐదారేండ్లు మినహా 64 ఏండ్ల పాటు దేశాన్ని కాంగ్రెస్‌పార్టీ, బీజేపీలు పాలించాయి. కాంగ్రెస్‌పార్టీ పోయి బీజేపీ వచ్చింది. ప్రజలకు ఏమి ఒరిగింది. రేపు అధికారంలోకి కాంగ్రెస్‌పార్టీ వస్తే ఏమి జరుగుతుంది. క్షేత్రస్థాయిలో ఎలాంటి మార్పులూ రాలేదు. పథకాలు పేరు మార్చడం, బడ్జెట్లో అంకెలు మార్చడం మినహా ఆ రెండు పార్టీలు దేశప్రజలకు చేసిందేమీ లేదు. కాంగ్రెస్, బీజేపీలు దొందూ దొందే. ప్రస్తుత రాజకీయ వ్యవస్థ దారుణంగా విఫలమైంది. దేశ రాజకీయాల్లో ప్రబలమైన మార్పు రావల్సిన అవసరం ఉంది. దీనికి త్వరలో బీజం పడనుంది. ఏ ప్రభుత్వం వస్తుందో తెలియదు. కానీ మార్పునకు శ్రీకారం చుట్టడం ఖాయం' అని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ తెలిపారు. హైదరాబాద్‌లోని ప్రగతిభవన్‌లో శనివారం సీఎం కేసీఆర్ అధ్యక్షతన టీఆర్ఎస్‌పార్టీ పార్లమెంటరీ సమావేశం జరిగింది. అనంతరం ముఖ్యమంత్రి విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన పార్లమెంటు సమావేశాలు, టీఆర్ఎస్‌పార్టీ ఎంపీలు అనుసరించాల్సిన వ్యూహం. దేశ రాజకీయాలు తదితర అంశాలపై మాట్లాడారు. నాడు, నేడు కేంద్రంలో ఉన్న ప్రభుత్వాలు రాష్ట్రాలకు సాయం చేయడం లేదని, ప్రజలకు కావల్సిన చట్టాలను మార్చడం లేదని, అవసరమైన మార్పులు చేయడానికి కూడా కేంద్రాన్ని అడుక్కోవాల్సి వస్తున్నదని మండిపడ్డారు. మన దేశం కంటే.. పెద్దదైన చైనా అభివృద్ధిలో ముందుకు దూసుకెళ్తుంటే.. మనం మాత్రం ఇంకా ముందుకు పోవ డం లేదన్నారు. పంటలకు కనీస మద్దతు ధర కూడా ప్రకటించలేక ...9లో

నేను అలా అన్లేదు

- పీఎంను విమర్శించొద్దని రాజ్యాంగంలో ఎక్కడైనా ఉందా?
- మా ఆస్తులు బహిరంగమే : ముఖ్యమంత్రి

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి- హైదరాబాద్

తాను వ్యక్తిగతంగా ప్రధానమంత్రి నరేంద్రమోడీపై ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదని ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. శనివారం ఎంపీలతో భేటీ అనంతరం ప్రగతిభవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ...9లో

మళ్లీ 'నిమిషం' నిబంధన

- టెన్త్ పరీక్షల్లో కీలక మార్పులు
- 15 నుంచి వార్షిక పరీక్షలు

వివరాలు 9లో

మోడీతోనే కేసీఆర్

- సీఎం రేసులో లేను
- మహబూబ్‌నగర్ ఎంపీగానే పోటీ చేస్తా : కేంద్ర మాజీ మంత్రి జైపాల్‌రెడ్డి వ్యాఖ్యలు

వివరాలు 9లో

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ముఖ్యమంత్రి కె చంద్రశేఖరరావు నమ్మదగిన వ్యక్తి కాదని, ఆయన మోడీతోనే ఉంటారని కేంద్ర మాజీ మంత్రి ఎస్ జైపాల్‌రెడ్డి చెప్పారు. మేధావులను, ప్రజాస్వామ్యవాదులను, ప్రజాసంఘాలను మోసం చేయడానికే ఆయన మోడీపై పరుష పదజాలం ఉపయోగించారని చెప్పారు. ప్రజలను మోసం చేయడానికే కేసీఆర్ మోడీకి వ్యతిరేకంగా మాట్లాడుతున్నారని, ఇది లాలుచీ కుస్తీ అని ...9లో

యువతి దారుణ హత్య

- కిరోసిన్ పోసి నిప్పంటించిన దుండగులు
- ఘటనా స్థలాన్ని పరిశీలించిన డీసీపీ, ఏసీపీ
- తండ్రి వద్ద ఆగిన డాగ్ స్క్వాడ్

వివరాలు 9లో



సుహాసిని ఫైల్ ఫొటో

నేటినుంచి
ఎంసెట్ దరఖాస్తుల స్వీకరణ

- ఏప్రిల్ 4 వరకు ఆన్‌లైన్‌లో సమర్పణకు తుదిగడువు
- అభ్యర్థులకు మెయిల్ తప్పనిసరి
- మే 2 నుంచి 7వరకు రాతపరీక్షలు
- భారీగా పెరిగిన పరీక్షా ఫీజు

వివరాలు 9లో

విషపూరిత నీరు తాగి
8 నెమళ్లు మృత్యువాత



కరీంనగర్ జిల్లా ఇల్లంతకుంటలోని ఎర్రగుట్ట ప్రాంతం వద్ద చనిపోయిన నెమళ్లు

నవతెలంగాణ-ఇల్లందకుంట

పొలంలో విషపూరిత నీరుతాగి ఎనిమిది నెమళ్లు మృత్యువాత పడ్డాయి. ఈ ఘటన కరీంనగర్ జిల్లా ఇల్లంతకుంట మండల కేంద్ర శివారులో ఎర్రగుట్ట ప్రాంతం వద్ద జరిగింది. ఇల్లందకుంటకు చెందిన కౌలురైతు పెద్దిశంకర్ ఉదయం మొక్కజొన్న చేనుకు నీళ్లుపెట్టేందుకు వెళ్లాడు. పక్కనే ఉన్న చింతరెడ్డి రాజిరెడ్డి రైతు పొలంలో ఎనిమిది నెమళ్లు మృతిచెంది ఉండటాన్ని గమనించి సర్పంచ్ పెద్ది స్వరూప, అటవీ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఘటనాస్థలాన్ని అధికారులు పరిశీలించారు. పొలంలో క్రిమిసంహారక మందు కలిసిన నీటిని తాగి నెమళ్లు మృతిచెందినట్టు పశు వైద్యాధికారి భగవాన్‌రెడ్డి, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ చంద్రమౌళి తెలిపారు.

అందని నీరు..
ఎండుతున్న పైరు



వివరాలు 10లో



వైద్య పరీక్షల నిమిత్తం శుక్రవారం రాత్రి చెన్నైలోని అపోలో ఆస్పత్రిలో చేరిన కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్‌ను ప్రముఖ నటుడు కమల్ హాసన్ శనివారం ఉదయం ఆస్పత్రికి వెళ్ళి పరామర్శించారు.



మూడు ఎంఓయులపై భారత్-వియత్నాం సంతకాలు

న్యూఢిల్లీ : భారత్, వియత్నాంలు శనివారం మూడు అవగాహన ఒప్పంద పత్రాల (ఎంఓయూ)పై సంతకాలు చేశాయి. ప్రధానంగా భారత్‌కు చెందిన గ్లోబల్ సెంటర్ ఫర్ న్యూక్లియర్ ఎనర్జీ పార్టనర్‌షిప్ (జీసీఎన్ఈపీ), వియత్నాంకు చెందిన వియత్నాం అటోమిక్ ఎనర్జీ ఇన్‌స్టిట్యూట్ (వీఐఎస్ఏటీఓఎమ్) మధ్య సహకారంతో సహా మూడు ఎంఓయూలపై రెండు దేశాలు సంతకాలు చేశాయి. శాంతియుత కార్యక్రమాలే లక్ష్యంగా అణు ఇంధన రంగంలో సాంకేతిక సహకారాన్ని బలోపేతం చేసుకునే లక్ష్యంతో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, వియత్నాం అధ్యక్షుడు ట్రాన్ డయ్ క్వాంగ్ మధ్య చర్చలు జరిగిన అనంతరం ఓఎంఓయూలపై సంతకాలు జరిగాయి. దీంతో పాటు ఆర్థిక, వాణిజ్య సహకారమే లక్ష్యంగా పురోభివృద్ధి దిశగా తగిన కార్యాచరణను రూపొందించడానికి సంబంధించిన ఎంఓయూపై కూడా సంతకాలు జరిగాయి.

సొంత బాబాయే... చిదిమేశాడు

- చావుబతుకుల మధ్య పసిబిడ్డ

లక్నో : ఉత్తర ప్రదేశ్ లో దారుణం చోటు చేసుకున్నది. సభ్యసమాజం సిగ్గుపడేలా.. సొంత బాబాయే ఓ పసిపాపపై ఘాతుకానికి పాల్పడ్డాడు. పాపం ఆ పసిబిడ్డ ఇప్పుడు లక్నో ఆస్పత్రిలో చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నది. లక్నో నగర్ నిగమ్ ప్రాంతానికి చెందిన చిన్నారి తండ్రి లక్నో మున్సిపల్ కార్పొరేషన్‌లో రోజు కూలీ చేసుకుంటున్నాడు. హోలీ సందర్భంగా అతని సోదరుడు(20) వాళ్ల ఇంటికి వచ్చాడు. శుక్రవారం మధ్యాహ్నం ఇంటి బయట ఆడుకుంటున్న మూడేండ్ల చిన్నారిని అక్కడకు సమీపంలోని నిర్మాణంలో ఉన్న భవనంలోకి తీసుకెళ్ళి అఘాయిత్యానికి పాల్పడ్డాడు. శుక్రవారం హోలీ కావడంతో అక్కడ పని జరడంలేదు. ఆ తర్వాత ఆమెను అక్కడే వదిలేసి.. ఏమీ తెలియనట్టు ఇంటికొచ్చాడు. అపస్మారక స్థితిలో పడివున్న పాపను చూసిన స్థానికులు తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. వెంటనే పాపను ఆస్పత్రికి తరలించారు. వెంటనే ఆమెకు శస్త్రచికిత్స చేశారు. అయినప్పటికీ ఆ చిన్నారి పరిస్థితి విషమంగానే ఉన్నట్టు వైద్యులు తెలిపారు. ఆ యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆమెకు తినుబండారాలు ఆశ చూపి పాపను బాబాయే ఎత్తుకెళ్ళాడనీ, అఘాయిత్యానికి పాల్పడ్డాడని ఠాకూర్‌గంజ్ పోలీసు స్టేషన్ ఇన్‌స్పెక్టర్ రమేష్ చంద్ర యాదవ్ చెప్పారు.

కథువాలో బంద్ సంపూర్ణం

- లైంగికదాడి కేసును సీబీఐకి అప్పగించాలని డిమాండ్

జమ్మూ: జమ్మూ కాశ్మీర్‌లోని కథువాలో ఓ మైనర్ పై లైంగికదాడి చేసి హత్య చేసిన కేసు విచారణను సీబీఐకి అప్పగించాలని డిమాండ్ చేస్తూ శనివారం బంద్ నిర్వహించారు. బంద్‌కు యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు రాకేశ్ ఠాకూర్ పిలుపునివ్వగా హిందూ ఏక్తా మంచ్, కథువా బార్ అసోసియేషన్, స్థానిక ప్రజలు, ఇతర ప్రజాసంఘాలు మద్దతునిచ్చాయి. బంద్‌తో కథువాలో వ్యాపార సంస్థలు మూతపడ్డాయి. ప్రయాణ సేవలకూ ఆటంకం ఏర్పడింది. దీంతో కథువా పట్టణం, దాని శివారు ప్రాంతమంతా నిర్మానుశ్యంగా మారింది. ఈ ఏడాది జనవరిలో ఓ బాలిక పై కొందరు దుండగులు లైంగిక దాడి జరిపి హత్య చేసిన ఘటన కథువాలో చోటుచేసుకున్న విషయం తెలిసిందే. తర్వాత ఈ కేసు విచారణను రాష్ట్ర క్రైం బ్రాంచ్‌పోలీసులకు ముఫ్తీ ప్రభుత్వం అప్పగించింది. విచారణలో భాగంగా పోలీసులు.. ఓ బాలుడిని, ఇద్దరు పోలీసు అధికారులను అరెస్ట్ చేశారు. విచారణ పట్ల హిందూ ఏక్తా మంచ్ అనేక అనుమానాలు వ్యక్తం చేసింది. కొన్ని పార్టీల ఒత్తిడితోనే ఈ కేసులో స్థానిక యువతను అరెస్టు చేస్తున్నారని గ్రామస్తులు మండిపడ్డారు.

శత్రఘ్నకు లైఫ్‌టైం అచీవ్‌మెంట్ అవార్డు

లండన్: బ్రిటన్‌కు చెందిన ఆసియాన్ వాయిస్ వారపత్రిక శత్రుఘ్నసిన్హాను లైఫ్‌టైం అచీవ్‌మెంట్ అవార్డుతో గౌరవించింది. ప్రతి ఏడాదీ అవార్డులు ప్రకటించే వార పత్రిక 12 వార్షికోత్సవంలో భాగంగా.. సమాజం పై ప్రభావం చూపిన ప్రముఖ వ్యక్తులను అవార్డులతో సన్మానించింది. గురువారం సాయంత్రం లండన్‌లోని హౌస్ ఆఫ్ కామన్స్ భవనంలో ఈ వేడుక జరిగింది. ఈ వేడుకలో పార్లమెంటేరియన్లు, వ్యాపారవేత్తలు, ఇతర నాయకులు పాల్గొన్నారు.


కలుషిత ఆహారం తిని

125 మంది విద్యార్థులకు అస్వస్థత

- ఛత్తీస్‌గఢ్..సూరజ్‌పూర్ జిల్లాలో ఘటన

రాయ్‌పూర్: కలుషిత ఆహారం తిన్న 125 మంది స్కూలు విద్యార్థులు ఆస్పత్రి పాలయ్యారు. చత్తీగఢ్, సూరజ్‌పూర్ జిల్లాలోని జవహర్ నవోదయ విద్యాలయలో శనివారం ఈ ఘటన చోటుచేసుకుంది. అస్వస్థతకు గురైన విద్యార్థుల్లో ఎక్కువమంది 9, 11 తరగతులవారే. విద్యార్థులు 'దహీ వడ' (పెరుగు ఆవడ)తిన్నాక ఒక్కసారిగా అస్వస్థతకు గురయ్యారు. వాంతులు, విరేచనాలు, తలనొప్పి, జ్వరంతో బాధపడుతుండడంతో వెంటనే వారిని ఆస్పత్రికి తరలించినట్టు సూరజ్‌పూర్ కలెక్టర్ కేసీ దేవ్‌సేనాపతి తెలిపారు.

ఈ ఘటనపై దర్యాప్తు చేపట్టినట్టు కలెక్టర్ తెలిపారు.









త్రిపురలో ఎన్నికల ఫలితాలు వెలువడినప్పటి నుండి బీజేపీ, ఆర్ఎస్ఎస్ శ్రేణులు రెచ్చిపోయి అగర్తలాలో విధ్వంసాన్ని సృష్టిస్తున్నారు. పలు పట్టణ ప్రాంతాల్లో వామపక్ష కార్యకర్తలపై దాడులకు దిగుతున్నారు. రాత్రికి ఇళ్ళలో వుంటే తీవ్ర పర్యవసానాలు ఎదుర్కొంటారని బెదిరిస్తున్నారు. ఈ మేరకు ధన్‌పూర్ (ముఖ్యమంత్రి మాణిక్ సర్కార్ నియోజకవర్గం), ఖోవాయి, అగర్తలా, ప్రతాప్‌నగర్, ఇంకా అనేక పట్టణ ప్రాంతాల నుండి వార్తలు అందుతున్నాయి.

నాగాలాండ్,మేఘాలయలో హంగ్

- ఈరెండు చోట్లా గోవా తరహా లాబీయింగ్ • త్రిపురలో బీజేపీ విజయం

ఈశాన్య రాష్ట్రాల్లో జరిగిన ఎన్నికల్లో మూడు చోట్ల ఫలితాలను ప్రకటించారు. త్రిపురను బీజేపీ,మిత్రపక్షాలు కైవసం చేసుకోగా,మరో రెండు రాష్ట్రాల్లోని ఓటర్లు స్పష్టమైన తీర్పు ఇవ్వలేదు. సర్వశక్తులు ఒడ్డి బీజేపీ త్రిపురలో అడుగుపెట్టింది.అక్కడ కాంగ్రెస్‌ను ఖాళీ చేసి.. త్రిపుర టెర్రరిస్టు గ్రూపులతో బీజేపీ చేతులుకలిపి తమ లక్ష్యాన్ని సాధించిందని పరిశీలకుల అంచనా. త్రిపురలో ఉగ్రవాద,హింసాత్మకచర్యలకు పాల్పడుతున్న ఐపీఎఫ్‌టీతో బీజేపీ బహిరంగంగా పొత్తులు పెట్టుకున్న విషయం విదితమే. గత ఎన్నికల్లో కాంగ్రెస్‌కు పోలైన ఓట్లు ఈసారి మొత్తం బీజేపీకి షిఫ్ట్ అయ్యాయి. దీనివల్ల సీపీఐ(ఎం) పునాది చెదరకపోయినా..బీజేపీ గెలుపు సాధ్యమైంది.ఇక నాగాలాండ్,మేఘాలయ కూడా తమ వశమవుతాయనుకున్న బీజేపీ అధిష్టానానికి చుక్కెదురైనట్టయింది. మేఘాలయలో హంగ్ వైపు ఫలితాలు మారితే..నాగాలాండ్‌లో ఎటూ తేలని ఫలితాలు పార్టీ హైకమాండ్‌కు మింగుడుపడటంలేదు. దీంతో గోవా తరహా లాబీయింగ్‌కు బీజేపీ పెద్దలు తెరలేపుతున్నారని రాజకీయపరిశీలకులు అంటున్నారు.



నవతెలంగాణ, జనరల్‌డెస్క్

త్రిపురలో 59స్థానాలకు ఎన్నికలు నిర్వహించగా బీజేపీ-ఐపీఎఫ్‌టీ కూటమికి 44 స్థానాలు, సీపీఐ(ఎం) నేతృత్వంలోని వామపక్ష కూటమికి 15 స్థానాలు లభించాయి. ఎన్నికల పొత్తులో భాగంగా ఇండిజినస్ పీపుల్స్ ఫ్రంట్ ఆఫ్ త్రిపుర(ఐపీఎఫ్‌టీ)కు 9 స్థానాలు కేటాయించిన బీజేపీ 51 స్థానాల్లో పోటీకి దిగింది. అయితే, ఓ స్థానంలో ఎన్నిక వాయిదా పడింది. దీంతో బీజేపీ..ఐపీఎఫ్‌టీ కూటమి ప్రభుత్వ ఏర్పాటుకు కావాల్సిన మెజార్టీ లభించింది.

మేఘాలయలో హంగ్

మేఘాలయలో హంగ్ అసెంబ్లీ వైపు అడుగులు పడనున్నాయి. అధికార కాంగ్రెస్‌కు ప్రతిపక్ష కూటమితో సమానంగా 21 సీట్లు రావటంతో..గేమ్ ఛేంజ్ కానున్నదని రాజకీయపరిశీలకులు అంటున్నారు. ప్రభుత్వ ఏర్పాటుకు చిన్న పార్టీలు, ఇతరులు కీలకంగా మారారు. 60 స్థానాలు ఉన్న మేఘాలయ అసెంబ్లీలో 59 స్థానాలకు ఎన్నికలు జరిగాయి. దీంతో ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన మెజార్టీని ఏ ఒక్క పార్టీ సాధించలేకపోయాయి. కాంగ్రెస్‌కు 21, ప్రత్యర్థి ఎన్పీపీ - బీజేపీ కూటమికి కూడా 21 సీట్లే వచ్చాయి. నేషనల్ పీపుల్స్ పార్టీకి 19 సీట్లు రాగా, బీజేపీకి రెండు సీట్లు వచ్చాయి. ఎన్పీపీకి ఒక్కస్థానం రాగా, యూడీపీకి ఆరు, హెచ్ఎస్‌పీడీపీకి 2 సీట్లు దక్కాయి. దీంతో చిన్న పార్టీల మద్దతే కీలకంగా మారింది. దీంతో బీజేపీకూటమి ప్రభుత్వ ఏర్పాటుకు లాబీయింగ్ షురూ చేసింది.

నాగాలాండ్‌లోనూ ఎటూ తేలని ఫలితం

నాగాలాండ్‌లోనూ హంగ్ ఏర్పడింది. అధికార ఎన్పీఎఫ్, విపక్ష ఎన్డీపీపీ - బీజేపీకి చెరో 29స్థానాలు దక్కించుకున్నాయి. జేడీయూ అభ్యర్థి, స్వతంత్రుడి మద్దతు కోసం విస్తృత ప్రయత్నం జరుగుతోంది. బీజేపీ కూటమి ప్రభుత్వ ఏర్పాటుకు తీవ్రంగా ప్రయత్నిస్తోంది. మొత్తం 60 స్థానాలు కల్గిన అసెంబ్లీలో 40 స్థానాల్లో ఎన్డీపీపీ పోటీ చేయగా, 20 చోట్ల బీజేపీ పోటీచేసింది. అధికార ఎన్పీఎఫ్‌కు 29సీట్లు, ఎన్డీపీపీ-బీజేపీ కూటమికి 29సీట్లు వచ్చాయి. మిగిలిన రెండు స్థానాల్లో ఒకచోట జేడీయూ అభ్యర్థి, స్వతంత్రుడు గెలుపొందారు. జేడీయూ అభ్యర్థి బీజేపీ కూటమికి మద్దతు ఇచ్చే అవకాశం కోసం మూటలు తీసి.. గోవా గేమ్‌కు బీజేపీ రెడీ అయ్యిందని రాజకీయపరిశీలకులు అభిప్రాయ పడుతున్నారు.

మాణిక్.. రాష్ట్రం విడిచి వెళ్ళిపో..



బెంగాల్, కేరళ, బంగ్లాదేశ్ వెళ్ళి తలదాచుకో
బీజేపీ నేత వివాదాస్పద వ్యాఖ్యలు

అగర్తల : త్రిపురలో బీజేపీ కూటమి విజయం సాధించడంతో ఆ పార్టీ శ్రేణులు రెచ్చిపోతున్నాయి. 20 ఏండ్లు ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వర్తించిన మచ్చలేని ముఖ్యమంత్రి మాణిక్ సర్కార్‌ను రాష్ట్రం విడిచి వెళ్ళిపోవాలంటూ బీజేపీ నేత హిమంత బిస్వా శర్మ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. బిస్వా శనివారం ఇక్కడ మాట్లాడుతూ 'మాణిక్ సర్కార్ కావాలంటే సీపీఐ(ఎం) కొద్దో గొప్పో ఉనికి ఉన్న పశ్చిమ బెంగాల్ వెళ్లొచ్చు. లేదా మరో మూడేండ్లు సీపీఐ(ఎం) అధికారం ఉండే కేరళకు, చివరకు పొరుగున ఉన్న బంగ్లాదేశ్‌కైనా వెళ్లొచ్చు' అని అసోం మంత్రి అయిన బిస్వా అన్నారు. 'ప్రస్తుతం ఆయనకు ఆ మూడే ఆప్షన్లున్నాయి. ఎంచుకునే అవకాశం కూడా ఆయనకే ఇస్తున్నాం' అంటూ వ్యాఖ్యానించారు. మాణిక్‌సర్కార్ నియోజకవర్గంలోని ధన్‌పూర్‌లో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న శర్మ గత నెలలో ఇలాంటి వ్యాఖ్యలే చేశారు. ఎన్నికల తర్వాత మాణిక్‌ను బంగ్లాదేశ్‌కు సాగనంపుతామన్నారు.

ఓటమిలోనూ ధీటుగా..

నెల్లూరు నరసింహారావు

వామపక్షానికి తగ్గిన ఓట్లు 3.3 శాతమే
త్రిపుర ముఖచిత్రం

త్రిపుర శాసన సభకు జరిగిన ఎన్నికలలో సీపీఐ(ఎం) నాయకత్వంలోగల వామపక్ష కూటమి ఓటమిని చవిచూసింది. గత 25సంవత్సరాలుగా అత్యంత నిజాయితీపరుడైన మాణిక్ సర్కార్ నాయకత్వంలో ప్రజల పక్షాన పోరాడిన ప్రభుత్వం ఓటమి పాలైంది. బూర్జువా మీడియా, సగటు విశ్లేషకులు విషయంలోకి పోకుండా సీపీఐ(ఎం) మీద అవాకులు, చవాకులు పేలుతున్నారు. అయితే ఈ ఓటమిని అంగీకరిస్తూనే దానిని నిశితంగా విశ్లేషించుకోవలసిన అవసరం ఉన్నది.

త్రిపురలో అసలేమి జరిగిందో ఒక్కసారి చూద్దాం. 2013వ సంవత్సరంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో సీపీఐ(ఎం) 55స్థానాలలో పోటీచేసి 49స్థానాలు గెలుచుకుంది. ఆ ఎన్నికల్లో సీపీఐ(ఎం)కి వచ్చిన ఓట్లు 48శాతం. 2018వ సంవత్సరంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో గతంలో వచ్చిన 48శాతం ఓట్లు 44.7శాతానికి తగ్గాయి. అంటే ఈ ఎన్నికలో సీపీఐ(ఎం)కి తగ్గిన ఓట్లు కేవలం 3.3శాతం. అయితే గెలిచిన స్థానాలు కేవలం 16. అలాగే మిగిలిన పార్టీల పరిస్థితి ఏమిటో చూద్దా. గత అసెంబ్లీలో ప్రధాన ప్రతిపక్షంగావున్న కాంగ్రెసు పార్టీ 50 స్థానాలు పోటీచేసి 10 స్థానాలు గెలిచింది. ఈ పార్టీకి వచ్చిన ఓట్లు 36.7శాతం. అయితే ఆశ్చర్యకరంగా ఈ ఎన్నికల్లో ఆ పార్టీకి వచ్చిన ఓట్లు కేవలం 1.9శాతం! సీట్లు ఏమీ గెలవ లేదు. అదే సమయంలో గత ఎన్నికల్లో కేవలం 1.6శాతం ఓట్లతో ఒక్క సీటు కూడా గెలవని భారతీయ జనతా పార్టీ ఈసారి జరిగిన ఎన్నికల్లో 41శాతం ఓట్లు వచ్చాయి. ఈ పార్టీ గెలిచిన సీట్లు 43. అంటే కాంగ్రెసు పార్టీ ఏకంగా భారతీయ జనతా పార్టీలో కలిసిపోయిందన్నమాట. ఇక్కడ అర్థం కావాల్సిందేమంటే భారతీయ జనతా పార్టీ గంప గుత్తగా కాంగ్రెసు పార్టీని కొనేసింది. ఈ దుర్మార్గాన్ని అడ్డుకునే శక్తి కాంగ్రెసు పార్టీకి లేకపోయింది.

అలా కాంగ్రెసు పార్టీని గంప గుత్తగా కొనటంతోనే భారతీయ జనతా పార్టీ సంతృప్తి చెందలేదు. ప్రత్యేక త్రిపురాలాండ్ ను డిమాండ్ చేస్తున్న పీపుల్స్ ఫ్రంట్ ఆఫ్ త్రిపుర అనే టెర్రరిస్టు కార్యకలాపాలకు పాల్పడుతున్న సంస్థతో భారతీయ జనతా పార్టీ ప్రత్యేక సంబంధం ఏర్పరచుకున్నది. గత ఏడాది ప్రత్యేక త్రిపురాలాండ్ కోసం పీపుల్స్ ఫ్రంట్ భారతీయ జనతా పార్టీ వెన్నుదన్నుతో జాతీయ రహదారులను దిగ్భధం చేసిన విషయం దేశమంతా గమనించింది. పశ్చిమ బెంగాల్‌లో మతఘర్షణలు రెచ్చగొట్టటం, డార్జిలింగ్ గూర్ఖాలాండ్ సమస్యను తిరగదోడటం వంటి చర్యలు తూర్పు, ఈశాన్య భారతదేశ ప్రాంతాలలో బీజేపీ అనుసరిస్తు వ్యూహంలో త్రిపురలో ఏర్పరచుకున్న అనుబంధం కూడా ఒక భాగం అని మనం గమనించాలి. అలా దాదాపు 8శాతం ఓట్ల శాతంవున్న ఈ టెర్రరిస్టు సంస్థతో బీజేపీ ఎన్నికల పొత్తు పెట్టుకుంది.

నోట్ల రద్దు తరువాత దేశ ప్రజలందరికీ నోట్ల కొరత ఏర్పడితే ఒక్క బీజేపీకి మాత్రం వేలకువేల కోట్లు వచ్చిచేరాయి. ఆ డబ్బుతో దేశ వ్యాప్తంగా వివిధ పార్టీల నాయకులను బీజేపీ తనవైపు తిప్పుకుంటున్నది. త్రిపురలో ఏకంగా ప్రతిపక్ష కాంగ్రెసు పార్టీ నాయకుడితోపాటు పార్టీనే కొనేయటం జరిగింది. అలానే ఒక టెర్రరిస్టు సంస్థతో అక్రమ ఎన్నికల పొత్తు పెట్టుకుని గెలుపే ధ్యేయంగా బీజేపీ పనిచేసింది.

త్రిపుర ఎన్నికల ఫలితం దేశానికి ఒక ప్రమాదకర సంకేతాన్ని అందజేస్తున్నది. దేశంలో అంతంతమాత్రంగా కునారిల్లుతున్న ప్రజాస్వామ్యం రాబోయే రోజుల్లో మరింతగా పతనం కావటం అనివార్యమనే సందేశాన్ని త్రిపుర ఫలితాలు మనకు ఇస్తున్నాయి. అలాగే గెలుపు కోసం, తన రాజకీయ ఆధిపత్యం కోసం బీజేపీ ఎంతకైనా తెగిస్తుందనే వాస్తవాన్ని త్రిపురలో జరిగిన ఎన్నికలు మన కండ్లకు కడుతున్నాయి. విషయం ఇంత స్పష్టంగా కనపడుతున్నా ప్రధాన స్రవంతి మీడియా ఏమీ ఎరుగనట్టు ప్రజల దృష్టిని మరల్చే విశ్లేషణలు చేస్తున్నది.

'అనైతిక' విజయం

డబ్బు, అధికారం అండతోనే బీజేపీ గెలుపు

- విచ్ఛిన్నకర ఎజెండాను వ్యతిరేకిస్తాం : ఏచూరి



న్యూఢిల్లీ : బిజెపి-ఐపీటీఎఫ్ ప్రభుత్వ ఏర్పాటుకు అనుకూలంగా త్రిపుర ప్రజలు తీర్పు ఇచ్చారని సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో విజయం సాధించేందుకు బీజేపీ అనైతిక రాజకీయాలకు పాల్పడిందని సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి విమర్శించారు. డబ్బు, అధికారాన్ని ఉపయోగించి వామపక్షేతర శక్తులను ఒక తాటిపైకి తీసుకొచ్చిందని అన్నారు. 'డబ్బును భారీ స్థాయిలో పంచి లెఫ్ట్ వ్యతిరేకులందరినీ ఒక వేదిక మీదకు తీసుకురావడంలో విజయం సాధించింది. బీజేపీ అనైతిక రాజకీయాలను ప్రదర్శించింది. దాని పర్యవసానమే ఈ ఫలితం. ఎన్నికల్లో డబ్బు ఉపయోగించడంవల్ల ప్రజలకు అననుకూలమైన పరిస్థితులు ఎదురుకావచ్చు. అందువల్ల అప్రమత్తంగా ఉండాలి' అని త్రిపుర ప్రజలను ఏచూరి హెచ్చరించారు. 'గత 25ఏళ్ళ పాటు వారికి సేవ చేయడానికి అవకాశం ఇచ్చినందుకు ఆయన త్రిపుర ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. బీజేపీని, దాని విచ్ఛిన్నకర ఎజెండాను కేవలం త్రిపురలోనే కాదు, దేశవ్యాప్తంగా వ్యతిరేకిస్తామని ఆయన స్పష్టం చేశారు. బీజేపీ-ఆర్ఎస్ఎస్ నీచపుటెత్తుగడలను ఓడించేందుకు భారత రాజ్యాంగ విలువల పట్ల విశ్వాసమున్న వారికి ఇది అనివార్యం' అని ఏచూరి ట్వీట్ చేశారు. 'త్రిపుర ప్రజలిచ్చిన తీర్పును ఆమోదిస్తున్నాం. 25 ఏండ్లుగా తమకు అవకాశం ఇచ్చిన ప్రజలకు ధన్యవాదాలు. ప్రస్తుతం 45 శాతం మంది త్రిపుర ప్రజలు వామపక్ష కూటమికి ఓటువేశారు. త్రిపుర ప్రజల ప్రయోజనాలను కాపాడేందుకు, వారి సంక్షేమ కోసం, ముఖ్యంగా ఈశాన్య రాష్ట్రానికి అతి ముఖ్యమైన గిరిజన, గిరిజన వర్గాల ఐక్యత కోసంమా కృషి కొనసాగుతుంది' అని ఏచూరి పేర్కొన్నారు. ఎన్నికల ఫలితాలను అధ్యయనం చేసి, విశ్లేషించుకుంటామని, ఆ తర్వాత తీసుకోవాల్సిన చర్యలను నిర్ణయించుకుంటామని ఏచూరి తెలిపారు.

మహారాష్ట్రలో రైతు భేరీ

50 వేల మంది.. 200 కిలో మీటర్లు..

- 6 నుంచి ఉద్యమబాట
- 12న అసెంబ్లీ ముట్టడి



ముంబయి : మహారాష్ట్ర రైతులు ఉద్యమ భేరీ మోగిస్తున్నారు. దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న తమ సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 6 నుంచి పెద్ద ఎత్తున ఉద్యమానికి సిద్ధమవుతున్నారు. 50 వేల మంది రైతులు.. 200 కిలో మీటర్లు 'లాంగ్ మార్చ్' పాదయాత్ర నిర్వహించనున్నారు. రాజ్య కిసాన్ సభ (ఆల్ ఇండియా కిసాన్ సభ) నేతృత్వంలో మహిళలతో సహా ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొనేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. ఈ నెల 6న నాసిక్ నుంచి ప్రారంభమయ్యే ఈ యాత్ర 12న వాణిజ్య రాజధాని ముంబయిలో ముగియనున్నది. అనంతరం తమ సమస్యలకు పరిష్కారం లభించేవరకూ అసెంబ్లీని నిరవధికంగా ముట్టడించనున్నారు.

ఇవీ వారి డిమాండ్లు

వ్యవసాయ రుణమాఫీ, గిట్టుబాటు ధరలు, స్వామినాథన్ కమిషన్ సిఫారసులను అమలుచేయాలి. అటవీ హక్కుల చట్టం (ఎఫ్ఆర్ఏ) అమలు, ఆలయ భూములు, పచ్చిక భూముల్లో రైతులకు వాటా, ప్రజా పంపిణీ వ్యవస్థకు సంబంధించిన సమస్యలను పరిష్కరించాలి. ప్రకృతివైపరీత్యాల కారణంగా నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలి. బుల్లెట్ రైలు, సూపర్ హైవేల వంటి ఉన్నత ప్రాజెక్టుల పేరిట రైతుల భూములను స్వాధీనం చేసుకోవడాన్ని ఆపాలి. నాసిక్, థానే, పల్‌గఢ్ జిల్లాల్లో నదికి అనుసంధాన పథకాన్ని పూర్తి స్థాయిలో మార్చడంతోపాటు, గిరిజన గ్రామాలు మునిగిపోకుండా చూడాలి. మహారాష్ట్రలోని ఇతర కరువు జిల్లాలకు నీటిని అందుబాటులోకి తీసుకురావాలన్న తదితర డిమాండ్లతో రైతులు ఈ ఆందోళన బాట పట్టారు. రైతుల ఈ డిమాండ్ల పరిష్కారం కోరుతూ అఖిల కిసాన్ సభ గత రెండేండ్లుగా రాష్ట్రంలో నిరంతరంగా ఉద్యమాలను చేస్తున్నది.

2016 నుంచి కొనసాగుతున్న ఉద్యమం

ఈ ఆందోళన 2016 మార్చిలో మొదలైంది. నాసిక్‌లోని సెంట్రల్ సీబీఎస్ స్క్వేర్‌లో దాదాపు లక్షమంది రైతులు 2016 మార్చిలో రెండు రోజులపాటు బైటాయించి అపూర్వ ఉద్యమం చేపట్టింది. అసెంబ్లీ సెషన్స్ జరుగుతున్న ఆ సందర్భంలో బీజేపీ ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ ఏఐకేఎస్ ప్రతినిధి బృందాన్ని ఆహ్వానించి సమస్యల పరిష్కారానికి హామీ కూడా ఇచ్చారు.

ఇచ్చిన హామీలు నెరవేర్చాలని, రైతు ఆత్మహత్యలను నిలువరించే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ అదే ఏడాది మేలో థానే నగరంలో 'కాఫిన్ మార్చ్'ను చేపట్టారు. ఎఫ్ఆర్ఏ, పోషకాహార లోపంతో చనిపోతున్న ఆదివాసీ చిన్నారులకు సంబంధించి సమస్యలపై 2016 అక్టోబర్‌లో ఏఐకేఎస్, ఏఏఆర్ఎం, ఐద్వా, డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నేతృత్వంలో దాదాపు 50 వేల మంది ఆదివాసీ రైతులు, మహిళలు, యువత, విద్యార్థులు మరో భారీ ఉద్యమానికి దిగారు. పల్‌గఢ్‌లో ఆదివాసీ అభివృద్ధి మంత్రిత్వశాఖ కార్యాలయాన్ని రెండు రోజులపాటు ముట్టడించారు.

చారిత్రాత్మక సమ్మెతో హామీ .. మళ్ళీ మోసం

2017 జూన్ 1 నుంచి 11 వరకూ రైతులు చారిత్రాత్మక సమ్మెను చేట్టారు. సమ్మె తర్వాత కో-ఆర్డినేషన్ కమిటీని ఏర్పాటుచేసుకొని వరుస ఉద్యమాలకు దిగుతున్నారు. 2017 జూన్ 11న ఐదుగురు మంత్రులతో కూడిన బృందం కో-ఆర్డినేషన్ కమిటీ నేతలతో చర్చలు జరిపింది. రైతుల రుణాలన్నీ మాఫీ చేస్తామని ఆ మంత్రులు బహిరంగంగా హామీ కూడా ఇచ్చారు. ఆ తర్వాత.. రుణమాఫీకి రూ. 34 వేల కోట్ల ప్యాకేజీని మాత్రమే ప్రభుత్వం ప్రకటించి రైతులను మోసం చేసింది. రుణమాఫీ పరిధి నుంచి అనేకమంది రైతులను తొలగించింది. ఈ నేపథ్యంలో రైతులు అప్పటి నుంచి పలు రూపాల్లో తమ నిరసనను శాంతియుతంగా వ్యక్తం చేస్తూనే ఉన్నారు. ఇప్పుడు తమ సమస్యలను మరోసారి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు 'లాంగ్ మార్చ్' ఉద్యమానికి శ్రీకారం చుడుతున్నారు. ఈ నెల 6 నుంచి ఉద్యమ బాట పడుతున్నారు.

ఎస్ఎస్‌సీ కుంభకోణంపై సీబీఐ దర్యాప్తు

- ఎస్ఎఫ్ఐ డిమాండ్

న్యూఢిల్లీ : స్టాఫ్ సెలెక్షన్ కమిటీ (ఎస్-ఎస్‌సీ) నిర్వహించే కంబైన్డ్ గ్రాడ్యుయేట్ స్థాయి పరీక్షలో వెలుగు చూసిన కుంభకోణంపై సీబీఐ దర్యాప్తు నిర్వహించాలని ఎస్ఎఫ్ఐ కేంద్ర కార్యనిర్వహణ కమిటీ డిమాండ్ చేసింది. న్యూఢిల్లీలో లోధి రోడ్‌లోని ఎస్ఎస్‌సీ ప్రధాన కార్యాలయం ముందు ఫిబ్రవరి 27 నుంచి నిరసనలు చేస్తున్న విద్యార్థులకు సంఘీభావం ప్రకటించింది. సుమారు 9,372 ఖాళీల భర్తీ కోసం ఫిబ్రవరి 17 నుంచి 22 వరకూ 206 కేంద్రాల్లో నిర్వహించిన ఈ పరీక్షలో ఎంతో శ్రమించి పాల్గొన్న లక్షల మంది విద్యార్థులపై ఈ కుంభకోణం తీవ్ర ప్రభావం చూపిస్తుందని ఎస్ఎఫ్ఐ ఆందోళన వ్యక్తం చేసింది. పరీక్షల్లో మాస్ కాపీయింగ్ జరిగినట్టు వార్తలు రావడంతో పాటు, సమాధానాలతో సహ ప్రశ్నాపత్రాలు సోషల్ మీడియాలో దర్శనమిచ్చాయి. దీంతో ఫిబ్రవరి 21న జరిగిన పరీక్షను ఎస్ఎస్‌సి రద్దు చేసింది. ఈ నెల 9న ఈ పరీక్షను మరోసారి నిర్వహిస్తామని ఎస్ఎస్-సీ తెలిపింది. వివిధ విభాగాల్లో ఎస్ఎస్‌సీ పరీక్షలను నిర్వహిస్తుంది. కంబైన్డ్ గ్రాడ్యుయేట్ స్థాయి పరీక్షలో మాత్రమే ఈ కుంభకోణం వెలుగులోకి వచ్చింది. అయితే మల్టీ టాస్కింగ్ సర్వీస్ (ఎంటీఎస్)ల్లో ఇలాంటి వార్తలు వచ్చాయి. ఈ పరీక్షల నిర్వహణను ప్రైవేటు సంస్థ సిఫీకి ఎస్ఎస్‌సీ కాంట్రాక్టు ఇచ్చింది. సిఫీ నిర్వహించే ప్రైవేటు సైబర్ కేఫ్‌ల్లో ఈ పరీక్షలు నిర్వహించారు. ఈ కేంద్రాలు అందరికీ అందుబాటులో ఉంటాయని, హ్యాక్ చేయడానికి వీలుగా ఉంటాయని ఎస్ఎఫ్ఐ తెలిపింది. కాబట్టి సిఫీ కి ఇచ్చిన అనుమతిని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేసింది.

మహిళల భద్రతలో ముందున్నాం

హోం మంత్రి నాయిని నర్సింహారెడ్డి

ప్రతి పోలీస్‌స్టేషన్‌లో షీ బృందాల ఏర్పాటు : డీజీపీ

- ఫిర్యాదు చేసేందుకు జంకుతున్నారు : రాశీఖన్నా



'షీ టీమ్స్ ఎక్స్‌పో'ను ప్రారంభిస్తున్న హోం మంత్రి నాయిని



స్టాల్స్‌ను పరిశీలిస్తున్న హోం మంత్రి నాయిని

నవతెలంగాణ - సిటీబ్యూరో

మహిళలకు భద్రతను కల్పించడంలో దేశంలోనే తెలంగాణ ముందున్నదని, దేశంలో ఎక్కడికెళ్లినా మన పోలీసులను ప్రశంసిస్తున్నారని హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి చెప్పారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం నేపథ్యంలో షీ టీమ్స్ ఆధ్వర్యంలో పీపుల్స్ ప్లాజాలో రెండ్రోజుల పాటు జరిగే 'షీ టీమ్స్ ఎక్స్‌పో' స్టాళ్ల ప్రదర్శనను డీజీపీ మహేందర్ రెడ్డి, సినీనటి రాశీఖన్నాతో కలిసి మంత్రి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయిని మాట్లాడుతూ.. హైదరాబాద్ నగరంలో ఏర్పాటుచేసిన షీ బృందాలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నా యన్నారు. హైదరాబాద్‌లో షీ బృందాల పనితీరుతో మహిళల్లో ఒక భరోసా కల్పించామన్నారు. నేడు షీ టీమ్స్ అంటే పోకిరీల గుండెల్లో రైళ్ల పరుగెత్తుతు న్నాయన్నారు. గతంతో పోల్చితే హైదరాబాద్‌లో నేరాలు తగ్గుముఖం పట్టాయన్నారు. సీసీకెమెరాల ఏర్పాటుతో కరుడుగట్టిన నేరస్తులు సైతం నేరాలు చేయాలంటే జంకుతున్నారని చెప్పారు. నగరంలో ఏర్పాటు చేసిన భరోసా సెంటర్ సత్ఫలితాలిస్తోందన్నారు. చిన్నారులకు, బాధితులకు ఉచితంగా అన్ని సౌకర్యాలు ఈ సెంటర్‌లో అందిస్తున్నార న్నారు. రాబోయే రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా మరిన్ని భరోసా సెంటర్లను ఏర్పాటు చేస్తామన్నారు. పోలీస్ సిబ్బంది సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

ప్రతి పోలీస్‌స్టేషన్‌లో షీ బృందాలు : డీజీపీ

వచ్చే ఏడాదికల్లా రాష్ట్రంలోని అన్ని పోలీస్‌స్టేషన్ లలోనూ షీ బృందాలను ఏర్పాటు చేస్తామని డీజీపీ ఎం.మహేందర్‌రెడ్డి తెలిపారు. మహిళల భద్రత కోసం రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. షీ బృందాలను బలోపేతం చేయడంలో అదనపు సీపీ స్వాతీలక్రా కృషి ఎంతో ఉందని ప్రశంసిం చారు. ఇలాంటి ప్రదర్శనలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయన్నారు. నగరంలో 100 షీ బృందాలు పనిచేస్తున్నాయని, ఫిర్యాదుదారుల వివరాలు రహ స్యంగా ఉంచుతామని వివరించారు.

ఎక్స్‌పోలో 27 స్టాల్స్

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా రెండు కార్యక్రమాలను చేపట్టామని అదనపు సీపీ (క్రైమ్స్) స్వాతీలక్రా తెలిపారు. పీపుల్స్‌ప్లాజాలో రెండ్రోజులపాటు కొనసాగే ఎక్స్‌పోలో 27 స్టాళ్లను ఏర్పాటు చేశామన్నారు. ఎక్స్‌పోలో భరోసా సెంటర్, షీటీమ్స్, సైబర్‌క్రైం, క్లూస్ టీమ్స్ తదితర విభాగాలకు చెందిన స్టాల్స్‌ను అందు బాటులోకి తీసుకొచ్చా మన్నారు. మూడున్నరేండ్లలో 4000లకు పైగా ఫిర్యాదులు వచ్చాయని, రెండువేల మందిని సాక్ష్యా ధారాలతో అదుపులోకి తీసుకున్నామని వివరించారు. ఆదివారం నిర్వహించే 2కే, 5కే, 10కే రన్‌లను విజయవంతం చేయాలని కోరారు. ఇప్పటికీ మహిళలు, బాధితులు ఫిర్యాదు చేసేందుకు జంకుతున్నారని సినీనటి రాశీఖన్నా అన్నారు. ఇలాంటి స్టాల్స్ ద్వారా బాధితులు ఎవరికి ఫిర్యాదు చేయాలో ఒక అవగాహన వస్తుందన్నారు. నగరంలో ఏర్పాటు చేసిన షీ బృందాలను చూసి ఇతర ఆరు రాష్ట్రాల్లో షీ బృందాలను, భరోసా సెంటర్లను ఏర్పాటు చేశారని నగర పోలీస్ కమిషనర్ వివి శ్రీనివాస రావు తెలిపారు. కార్యక్రమంలో అదనపు డీజీపీలు, డీసీపీలు, సైబరాబాద్ సీపీ, ఏసీపీలతోపాటు పలువురు పెద్దఎత్తున పాల్గొన్నారు.

వైద్య, ఆరోగ్య రంగాల అభివృద్ధికి కృషి

- డయాబెటోమిక్ పరిశ్రమ ప్రారంభంలో మంత్రి కేటీఆర్



నవతెలంగాణ-మనోహరాబాద్

తెలంగాణలో వైద్య, ఆరోగ్య రంగాలను అభివృద్ధి చేసే దిశలో ముఖ్య మంత్రి కేసీఆర్ ఎనలేని కృషి చేస్తున్నారని ఐటీ శాఖమంత్రి కె.తారకరామ రావు అన్నారు. మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం ముప్పిరెడ్డిపల్లి గ్రామ శివారులో టీఎస్ఐపాస్ పార్కులో ఏర్పాటు చేసిన డయాబెటోమిక్ పరిశ్రమను శనివారం ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా సభలో మంత్రి మాట్లాడుతూ.. దేశంలోని జనాభాలో 7.2కోట్ల మంది షుగర్ వ్యాధితో బాధపడుతున్నారన్నారు. సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా, తక్కువ ఖర్చుతో షుగర్ వ్యాధిని గుర్తించే పరికరాలను డయాబెటోమిక్ పరిశ్రమ అందుబాటులోకి తేవడం అభినందనీయమ న్నారు. గతంలో షుగర్ వ్యాధిని గుర్తించేందుకు సూదితో రక్తాన్ని తీసేవా రన్నారు. ఇప్పుడు డయాబెటోమిక్ ద్వారా ఉమ్మితో షుగర్ వ్యాధిని గుర్తిం చొచ్చన్నారు. డయాబెటోమిక్ సంస్థ తయారు చేసిన పరికరం కేవలం రూ.67కే లభిస్తుందన్నారు.

ఈ కార్యక్రమంలో డయాబెటో మిక్ సంస్థ చైర్మెన్ వరప్రసాద్ రెడ్డి, డైరెక్టర్ వెంకటాద్రి బొప్పారెడ్డి, డాక్టర్ శ్రీనివాస్ నాగిళ్ల, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, బిందు డే, పరిశ్రమల శాఖ కమిషనర్ నర్సింహారెడ్డి, తెలంగాణ ఫుడ్ కార్పొ రేషన్ చైర్మెన్ ఎలక్షన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య ఉన్నచోటికే భగీరథ

- ఇంజినీర్ ఇన్ చీఫ్ సురేందర్‌రెడ్డి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తాగునీటి సమస్య తీవ్రంగా ఉన్న ఆవాసాలకు ముందుగా భగీరథ నీళ్ళ సరఫరా చేసేలా పనులు చేపట్టాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీర్ ఇన్ చీఫ్ బి.సురేందర్ రెడ్డి అన్నారు. ఇందుకు తగినట్లుగా మైక్రో లెవల్‌లో యాక్షన్ ప్లాన్ తయారుచేసుకోవాలని చెప్పారు. శనివారం అన్ని జిల్లాల ఎస్.ఈ, ఈఈలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిం చారు. రాబోయే ఎండాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని మిగిలి న చిన్న చిన్న పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. సమ యం తక్కువగా ఉన్నందున కూలీలను డబుల్ చేసేలా వర్క్ ఏజెన్సీలపై ఒత్తిడి తీసుకురావాలని ఆదేశించారు. దళ వారీగా గ్రామాలకు నీళ్లను అందిస్తూ ఈ నెల 20 నాటికి చివర ఆవాసానికి శుద్ధి చేసిన తాగునీటిని అందిం చేలా పనులు చేయాలన్నారు. మిషన్ భగీరథ ప్రధాన పనులు సంతృప్తికరంగానే సాగుతున్నాయన్నారు. ఇంట్రా విలేజ్ పనులు మాత్రం ఆశించినంత వేగంగా జరగడం లేదన్నారు. ఇంట్రా పనులు త్వరగా పూర్తి కావడానికి బిల్లుల చెల్లింపులో ప్రభుత్వం వెసులుబాటు కల్పించిందని, దీంతో పాటే కొత్త రేట్లను ఖరారు చేసిందని గుర్తుచేశారు. ఫలితం గా పనులు వేగంగా జరిగే అవకాశం ఉందని, అందుకు అవ సరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆక కరీంనగర్ క్వాలిటీ కంట్రోల్ ఈఈ పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆయనకు ఛార్జ్ మెమో ఇవ్వాలని సంబంధిత చీఫ్ ఇంజినీర్‌ను ఆదేశించారు. క్వాలిటీ విషయంలో ఎక్కడా రాజీపడరాదన్నారు. ఇంట్రా విలేజ్ పనులు త్వరగా పూర్తిచేసేన అధికారులను, వారు కోరుకున్న చోటుకు బదిలీ చేస్తామని ప్రకటించారు. ఈ నెలాఖరుకి ఏ ఒక్క గ్రామంలోనూ తాగునీటి కొరత రావొద్దని చెప్పారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రభుత్వ సలహాదారులు జ్ఞానేశ్వర్, చీఫ్‌ఇంజినీర్లు కపాకర్‌రెడ్డి, జగన్మోహన్‌రెడ్డి, విజయపాల్ రెడ్డి, విజయ్‌ప్రకాశ్, కన్సల్టెంట్లు నర్సింగరావు, మనోహర్ బాబు, జగన్, ఎస్.ఈలు విజయ్ కుమార్, శ్రీనివాస్‌రెడ్డి, ఈఈ విజయ్ కుమార్‌తో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

సోమశిలను పర్యాటకానికి అనువుగా మలచాలి

మంత్రి జూపల్లి కృష్ణారావు

- పేర్వారంతో కలిసి సమీక్ష



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కొల్లాపూర్ నియోజకవర్గంలోని సోమశిల ప్రాంతాన్ని అన్ని సౌకర్యాలతో పర్యాటకులకు అనువైన ప్రాంతంగా అభివృద్ధి చేయాలని పంచాయతి రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు కోరారు. శనివారం హైదరా బాద్‌లోని హిమాయత్‌నగర్‌లోని టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమశిల పర్యాటకాభివృద్ధిపై మంత్రి జూపల్లి కష్ణారావు సమీక్ష నిర్వహించారు. టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పేర్వారం రాములు, పర్యా టక శాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం ఇతర అధికారులతో సోమశిల, జెట్ ప్రోలు, సింగోటం లలో పర్యాటక అభివృద్ధికి ఉన్న అవకాశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఉమ్మడి మహ బూబ్ నగర్ జిల్లాలో స్వదేశీ దర్శనం భాగంగా చేపడుతున్న ప్రాజెక్ట్ పనులను మంత్రికి అధికారులు వివరించారు. సోమశిల, జెట్‌ప్రోలులో టూరిజం శాఖ ద్వారా బోటింగ్‌ను, హరిత హోటల్‌ను సమర్థవంతంగా నిర్వహించాలని మంత్రి జూపల్లి కోరారు. హెూటల్ నిర్వహణ సరిగ్గా లేదని, ధరలు కూడా ఎక్కువగా ఉండటం వల్ల పర్యాటకులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్న విషయాలను అధికారుల దష్టికి తెచ్చారు. అలాగే బోటింగ్ విషయంలోనూ పర్యాటకులను ఆకర్షిం చేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. హైదరాబాద్ నుండి సోమశిలకు టూరిజంశాఖ ద్వారా ప్రత్యేక ప్యాకేజీ ఏర్పాటుపై దష్టి పెట్టాలని సూచించారు. ఆగస్ట్ నాటికి సోమశిలలో 10 కాటేజీల భవన సముదాయాన్ని ఏర్పాటు చేయనున్నట్టు టూరిజంశాఖ అధికారులు తెలిపారు. ఒకట్రెండు నెలల్లోనే వీలైనన్ని కాటేజీలను అందుబాటులోకి తీవాలని మంత్రి కోరారు. సింగోటం చెరువును కూడా అభివృ ద్ధి చేయాలని మంత్రి జూపల్లి కోరగా, దానికి కూడా ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్టు అధికారులు వివరించారు. అవసరమైతే హెూటల్ నిర్వహణను ప్రైవేట్ కు అప్పగించే అవకాశాలను పరిశీలిస్తామని అధికారులు మంత్రికి తెలియజేశారు. టూరిజం ప్యాకేజీ కింద హైదరాబాద్ నుంచి సోమశిలకు బస్సులో, అక్కడి నుంచి శ్రీశైలం వరకు బోటింగ్ చేసేలా ఆలోచన చేయాలని అధికారులకు కార్పొరేషన్ చైర్మన్ పేర్వారం రాములు సూచించారు.

సబ్ కాంట్రాక్టర్ ఆత్మహత్య

రంగనాయకసాగర్ ప్రాజెక్టు పనుల వద్ద ఘటన

- కాంట్రాక్టర్ డబ్బులివ్వకపోగా బెదిరింపులు
- మనస్తాపంతోనే..



నవతెలంగాణ- చిన్నకోడూరు

రంగనాయకసాగర్ ప్రాజెక్టు పనుల్లో భాగంగా ఖర్చుపెట్టిన డబ్బులు కాంట్రాక్టర్ ఇవ్వడం లేదని సబ్ కాంట్రాక్టర్ పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసు కున్నాడు. ఈ ఘటన సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం రామంచ గ్రామ శివారులో శనివారం జరి గింది. పోలీసులు, మృతుడి బంధువులు తెలిపిన వివ రాల ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మల రామారం మండలం చౌదర్‌పల్లి గ్రామానికి చెందిన నర్సింహారెడ్డి(45) సబ్ కాంట్రాక్టర్. గతేడాది అక్టోబర్ లో సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలంలో రంగ నాయకసాగర్ ప్రాజెక్టులో పనులు చేపట్టాడు. మెయి న్ కాంట్రాక్టరైన మెగా కంపెనీ నుంచి సంతోష్ కన్‌స్ట్ర క్షన్(శరత్‌రావు), వారి నుంచి ఎంఎల్‌కే కన్‌స్ట్రక్షన్ (శేఖర్) వర్క్ తీసుకున్నారు. శేఖర్ వద్ద ఉప కాంట్రా క్టర్‌గా కొడిమాల నర్సింహారెడ్డి పని చేస్తున్నాడు. రూ.కోటి 80లక్షల వరకు పనులు పూర్తి చేశాడు. ఇప్పటి వరకు ఎంఎల్‌కే కన్‌స్ట్రక్షన్ లక్ష రూపాయలు మాత్రమే చెల్లించింది. మిగతా డబ్బులివ్వాలని పలుమార్లు అడిగినా పట్టించుకోవడం లేదు. ఈ క్రమంలో ఒకసారి నేరుగా శేఖర్‌ను కలిసేందుకు నర్సింహారెడ్డి ప్రయత్నించాడు. తనను ఎందుకు కలు స్తున్నావని, ఆ ప్రయత్నాలు మానుకోవాలని భయ భ్రాంతులకు గురి చేశాడు. చేసేదేమీ లేక డబ్బులిచ్చే వరకు పనులు చేపట్టబోమని 20 రోజుల కిందట నర్సింహారెడ్డి బంద్ చేశాడు. ఇటీవల శేఖర్ కుమా రుడు లవణ్ రూ.19 లక్షల చెక్కు ఇచ్చాడు. కానీ అకౌంట్‌లో డబ్బుల్లేకపోవడంతో ఆ చెక్కు బౌన్స్ అయింది. ఈ క్రమంలో నర్సింహారెడ్డికి అప్పగించిన పనులను ఎంఎల్‌కే కన్‌స్ట్రక్షన్ మరొకరితో చేయి స్తోంది. ఈ విషయాల్లో లవణ్‌ను నర్సింహారెడ్డి నిలదీ శాడు. 'అసలు డబ్బులే ఇయ్యం. ఏం చేసుకుంటావో చేసుకోపో' అని బెదిరించాడు. మరోవైపు పనులు చేసిన లారీల వారు, ఇతరులు డబ్బుల కోసం ఒత్తిడి చేస్తున్నారు. దీంతో మనస్తాపానికి గురైన నర్సింహా రెడ్డి శనివారం తెల్లవారుజామున ప్రాజెక్టు పనుల వద్దే ఆత్మహత్య చేసుకున్నాడు. ఉదయం స్థానికులు గమనించి పోలీసులకు సమాచారమిచ్చారు. అడిష నల్ డీసీపీ నర్సింహారెడ్డి, ఏసీపీ రామేశ్వర్‌రెడ్డి, సీఐ లు సైదులు, ఆంజనేయులు, చిన్నకోడూరు ఏఎస్ఐ నర్సింహా ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహా న్ని పోస్టుమార్టం నిమిత్తం సిద్దిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సబ్‌కాంట్రాక్టర్‌కు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

రైల్లో నుంచి దూకి తల్లీబిడ్డ ఆత్మహత్య

- బాసర బ్రిడ్జి సమీపంలో ఘటన



సునీత, శివశంభో మృతదేహాలు

నవతెలంగాణ-బాసర/నవీపేట్

రైల్లో నుంచి ఓ మహిళ ఐదునెలల బిడ్డతో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. ఈఘటన నిజామాబాద్ జిల్లా నవీపేట మండలం బాసరకు వెళ్లే బ్రిడ్జి సమీపంలో శనివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా ఉమ్రి గ్రామానికి చెందిన రాజు, సునీత(25) దంపతుల కుమారుడు శివశంభో (ఐదునెలలు)తో కలిసి మన్మాడ్ నుంచి సికింద్రాబాద్‌కు వెళ్తున్న ప్యాసింజర్ రైలులో ప్రయాణిస్తున్నారు. రైలు బాసర బ్రిడ్జిపైకి వచ్చిన తరువాత సునిత కొడుకుతోపాటు కిందకు దూకేసింది. ఇద్దరూ పెద్దరాయిపై పడటంతో అక్కడికక్కడే మతిచెందారు. గమనించిన తోటి ప్రయాణికులు భర్తకు సమాచారం ఇచ్చారు. నవీపేట్ ఎస్ఐ నరేష్ ఘటనా స్థలాన్ని పరిశీలించి రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. రైల్వే పోలీసులు పంచనామా నిర్వహించి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం నిజామాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఆదివారం కుటుంబీకులకు అప్పగించనున్నారు. కుటుంబ తగాదాలే ఆత్మహత్యకు కారణమై ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు రైల్వే పోలీసులు వెల్లడించారు.

10న మిలీనియం మార్చ్..



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర సాధనలో మిలీనియం మార్చ్ కార్యక్రమం ఒక మైలురా యిగా నిలిచిపోయిందని పలువురు నేతలు చెప్పారు. ఆ స్ఫూర్తిని ప్రజల్లో కొన సాగించేందుకు వీలుగా ఈనెల 10న ట్యాంక్‌బండ్‌పై మరోసారి మార్చ్ నిర్వహిస్తా మని వారు ప్రకటించారు. ఇందులో భాగంగా భారీ ర్యాలీ, బహిరంగ సభ, ఆట, పాట, మాట కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు. ఇందుకనుగుణంగా సీపీఐ, టీ జేఏసీ, సీపీఐ (ఎం-ఎల్) న్యూడెమోక్రసీ, తెలంగాణ ఇంటి పార్టీ, ఫార్వర్డ్ బ్లాక్, తెలంగాణ ప్రజాఫ్రంట్ (టీపీఎఫ్), ఆయా పార్టీల సంఘాలతో కలిపి 'మిలీనియం స్ఫూర్తి కమిటీ'ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శనివారం హైదరాబాద్‌లోని మఖ్దూం భవన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. మిలీ నియం మార్చ్ కార్యక్రమానికి వేలాదిగా తరలి రావాలని ప్రజానీకానికి ఆయా పార్టీల నేతలు పిలుపునిచ్చారు. 10వ తేదీ మధ్యాహ్నం 1 గంట నుంచి 4 గంటల వరకు ఈమార్చ్ కొనసాగుతుందని తెలిపారు. మార్చ్‌ను నిర్వహించేందుకు అను మతినివ్వాలని వారు పోలీసులను కోరారు. అనుమతినివ్వకపోయినా ర్యాలీని నిర్వహించి తీరతామని హెచ్చరించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ ఉద్యమ సమయంలో తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా మిలీనియం మార్చ్ జరిగిందన్నారు. అనేక మంది లాఠీ దెబ్బలను తిని, జైళ్లకు కూడా వెళ్లారని తెలిపారు. టీ జేఏసీకి మద్దతుగా సీపీఐ ప్రధాన భూమిక పోషిం చిందని చెప్పారు. ఉద్యమ ఆకాంక్షలను నెరవేర్చాలన్న సోయి టీఆర్ఎస్ సర్కారు కు లేకపోవటం శోచనీయమన్నారు. జేఏసీ చైర్మెన్ ప్రొఫెసర్ కోదండరామ్ మాట్లాడుతూ మిలీనియం మార్చ్ తెలంగాణ శక్తులన్నింటినీ సంఘటితం చేసిందని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ (ఎం-ఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు కె.గోవర్ధన్, ఫార్వర్డ్‌బ్లాక్ రాష్ట్ర కార్యదర్శి బండ సురేందర్‌రెడ్డి టీపీఎఫ్ నాయకులు రవిచంద్ర, తెలంగాణ ఇంటి పార్టీ అధ్యక్షులు చెరుకు సుధాకర్, ఐప్సో జాతీయ ప్రధాన కార్యదర్శి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఉన్నత చదువులు అందించేందుకే ఎన్టీఆర్ ట్రస్ట్

ఎన్నో సామాజిక సేవలు

- ఇక్కడికి వస్తే అప్పటి విషయాలు జ్ఞప్తికి : ట్రస్ట్ 20వ వార్షికోత్సవంలో ఏపీ సీఎం చంద్రబాబు



నవతెలంగాణ-మొయినాబాద్‌రూరల్

పేద విద్యార్థులకు ఉన్నత చదువులు అందించేందుకే ఎన్టీఆర్ ట్రస్టు ఏర్పాటు చేశామని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నో సేవలు అందించామన్నారు. నూతన టెక్నాలజీతో కొత్త కొత్త విషయాలను తెలుసుకొని యువత ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి తారక రామారావు పేరుతో 20ఏండ్ల కింద ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ ట్రస్ట్ 20వ వార్షికోత్సవం శనివారం నిర్వహించారు. రంగా రెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం హిమాయత్ నగర్ గండిపేట చెరువు సమీపంలో గల ఎన్టీఆర్ కుటీరంలో నిర్వహించిన వార్షికోత్సవానికి చంద్రబా బు నాయుడు, ఎన్టీఆర్ ట్రస్ట్ చైర్‌పర్సన్ భువనేశ్వరీ, ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ శాఖ మంత్రి నారా లోకేష్, హెరిటేజ్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ బ్రాహ్మణి హాజరయ్యారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాటా ్డుతూ.. 20ఏండ్ల కింద మహానేత ఎన్టీరామారావు ట్రస్ట్ ఏర్పాటు చేశామన్నారు. ఎన్టీ రామారావు సాధా రణ కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తి అని, ఇప్పుడు ఆయన ఒక శక్తి, వ్యవస్థ అన్నారు. రాష్ట్రంలో వివిధ కారణాల వల్ల ప్రజలు ఎదుర్కొన్న సమస్యలను పరిష్కరించేందుకు ట్రస్ట్ ఎంతగానో కృషి చేసిందని తెలిపారు. ఒకప్పుడు ఆడ పిల్లల వివాహాలు చేయా లంటే తల్లిదండ్రులు అనేక ఇబ్బందులు పడేవారని అన్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించేందుకు తన వంతు కృషి చేస్తున్నానని చెప్పారు. విద్యార్థులు ఒక లక్ష్యాన్ని ఎంచుకొని దానికి అనుగుణంగా ముందుకు సాగాలని సూచించారు. తాను ఎమ్మెల్యే కావాలని అనుకొని యూనివర్సిటీ నుంచే పోటీ చేసి గెలుపొందానని చెప్పారు.

అప్పటి నుంచి వెనుదిరగలేదన్నారు. ప్రమాదా ల్లో మృతిచెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తల పిల్లలకు ఇక్కడ విద్య అందిస్తున్నామని చెప్పారు. ఎన్టీ ఆర్ ట్రస్ట్‌లో చదివిన విద్యార్థులు మంచి స్థాయిలో స్థిరపడుతున్నారని అన్నారు. భవిష్యత్తులో కూడా మరిన్ని సేవలను అందిస్తుందని చెప్పారు. ఇక్కడికి వస్తే గతం గుర్తుకు వస్తుందన్నారు. ఒకప్పుడు రాజకీయ పాఠాలు నేర్చుకునే స్థలంలో ప్రస్తుతం నాణ్యమైన విద్యను అందిస్తున్నామని చెప్పారు. అప్పట్లో ఇక్కడ రేకుల షెడ్డులో పనిచేశామని గుర్తు చేసుకున్నారు. ఇప్పుడు అనేక సదుపాయాలు అందు తున్నాయని, వాటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ ట్రస్ట్ సభ్యులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, రంగారెడ్డి జిల్లా టీడీపీ సీనియర్ నాయకులు కొమ్మిడి వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంపాదకీయం

మహిళావరణం

ఆకాశంలో సగం. అనంతకోటి నక్షత్రాల్లో సగం. అవని అంతా పరివ్యాప్తమైన మహిళావరణం. త్యాగాల పరంపరలో ఆమె చరిత అనుపమానం. మార్పుకోసం జరిగే పోరాటాల్లో, ప్రపంచ గతిని మార్చే పెను విప్లవాల్లో ఆమె పాత్ర అనంతం. అయినా అధికారంలో ఆమె స్థానం నామమాత్రం. విధాన నిర్ణయాలకు ఆమె ఆమడదూరం. ఇంటా బయటా ఆమె లేనిదే రోజు గడవదు. ఆమె శ్రమ చేయనిదే ఒక్క పనీ జరగదు. ఆమె చెమట చిందించనిదే వ్యవసాయం సాగదు. పరిశ్రమల రథచక్రం ముందుకెళ్ళదు. అయినా వేతనాల్లో వ్యత్యాసం. జెండర్ కారణంగా చేసిన పనికి సరిపడా దక్కని ఫలితం. ఇది మానవచరితకే అవమానకరం. ఈ అవమానాల పరంపరనించి విముక్తి కోసం సాగే పోరాటంలో ఆమెతో చేయి కలిపిన పురుషుడే నిజమైన మానవుడు. ఆమెకు అవమానం, తనకు అగౌరవంగా భావించి ఉద్యమించడం మగ ప్రపంచపు కర్తవ్యం. ఈ చైతన్యశీలతతో వ్యవహరించాలన్న దృఢ సంకల్పం మహిళా దినోత్సవాలకు గొప్ప సంఘీభావం.

క్షణక్షణం తనని తాను, తన ఆలోచనల్ని తాను కూడదీసుకుంటూ బతకాల్సిరావడం కన్నా మించిన దుస్థితి మరొకటి లేదు. ఈ లోకాన ఏ ప్రాణికీ లేని ఈరకమైన భీతి మహిళకే ఉండటం మహావిషాదం. ఈ విషాద బీభత్సం నుంచి విముక్తి కోసం మరో అడుగు ముందుకెయ్యటం మహిళా దినోత్సవాలకు దీప్తీ.. స్ఫూర్తీ..!

ఓటు హక్కు కోసమే దశాబ్దాల తరబడి మహిళలు ఉద్యమించాల్సి వచ్చింది. అధికారంలో సగభాగం కోసం నిరంతర పోరాటం అనివార్యమైన స్థితి ఎల్లెడలా కనిపించే దృశ్యం. ఏ దేశ చరిత్ర చూసినా మహిళా ప్రాతినిధ్యం నామమాత్రం. మన దేశ పార్లమెంటు, అసెంబ్లీల్లో మహిళల ప్రాతినిధ్యం అతి స్వల్పం. కొత్తగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రంలో ఒక్క మహిళా మంత్రి కూడా లేరు. విధాన నిర్ణయాల్లో భాగస్వామ్యం కల్పించకుండా మహిళా దినోత్సవాలు జరపబోవడం వైచిత్రి. మహిళా సాధికారత, సమానతల గురించి మాట్లాడటం విడ్డూరం.



ఇరవయ్యొకటో శతాబ్దంలోనూ, కొత్త సహస్రాబ్దిలోనూ మహిళలపై అణచివేత ఆగలేదు. నిజానికి మరింత పెరిగింది. సాంకేతిక పురోగతి మహిళల జీవితాన్ని మెరుగుపరచకపోగా మరింత సంక్లిష్టం చేసింది. భూస్వామిక సమాజం మహిళని భోగవస్తువుగా చూసింది. శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానం విస్తరించిన ప్రపంచీకరణ క్రమంలోనూ మహిళని చూసే దృక్పథంలో మార్పు లేదు. సరళీకృత ఆర్థిక విధానాల నేపథ్యంలో మహిళ, ఆమె శరీరం అమ్మకపు సరుకులుగా పరిణమించాయి. మతం, మార్కెట్ కలగలసి స్త్రీని విలాసవస్తువు స్థితికి దిగజార్చాయి.

స్త్రీకి శరీరమే కాదు, మనసు ఉందని వందేండ్ల కిందట చలం చెప్పినా ఇప్పటికీ గుర్తించే పరిస్థితి లేదు. ఆమె ఇష్టానికీ, అభిప్రాయాలకీ కుటుంబంలోనూ, సామాజిక జీవనంలోనూ గుర్తింపు, గౌరవం, సమ్మతి లభించడం లేదు. ఆమె ఆలోచనల్ని సైతం కత్తిరించే అప్రకటిత సెన్సార్‌షిప్ దృశ్యాదృశ్యంగా చెలామణీలో ఉంది. ఆమె వస్త్రధారణ, వ్యవహారసరళిపై నిఘా కొనసాగుతోంది. స్త్రీని మనిషిగా పరిగణించే మానవీయదృష్టి సమాజాన నెలకొనలేదు.

అవని అంతటా ఆమె ఉంటుంది. ఆమె అవసరముంటుంది. కానీ అవమానాల్ని తట్టుకుంటూ నిలబడాల్సి రావడం, మనిషిగా తన ఉనికిని చాటుకోడం కోసం నిత్యమూ నిరంతరమూ కలబడాల్సి రావడం పితృస్వామిక సమాజ క్రౌర్యానికి నిదర్శనం. ఇంటికోసం, సమాజం కోసం అరవచాకిరీ చేస్తూ కూడా రెండో తరగతి పౌరురాలిగా బతకాల్సి రావడం స్త్రీ బతుకులోని అతి పెద్ద దైన్యం. ఈ వైనాన్ని గురించి శతాబ్దాలుగా రచయితలు, రచయిత్రులు రాస్తూనే వున్నారు. చరిత్ర పొడుగునా సాహిత్యం, కళల్లో స్త్రీలకు దక్కింది రెండో స్థానమే. తమని తాము నియంత్రించుకునే ఆలోచనల గాడికి స్త్రీల మనోభావాల్ని కట్టిపడేసే సాహిత్యమే శతాబ్దాలుగా రాజ్యమేలింది. ఈ నేపథ్యంలోనే తమ అంతర్లోకాల తండ్లాటని తమదైన స్వరంతో వ్యక్తం చేయాలన్న తపనలోంచే మహిళల సాహిత్యం వెల్లువెత్తింది. మహిళల కంఠస్వరాల్లోని సంవేదనల్ని వినే సందర్భం సమాజంలో నెలకొన్నది. ఈ కంఠస్వరాలు మహిళల కోసమే గాక మొత్తం పీడిత మానవాళి విముక్తి దిశగా పదునెక్కడం ద్వారానే తమ లక్ష్యాన్ని చేరుకుంటాయి. ఈ స్పృహ పెరుగుతున్న కొద్దీ సకల రంగాల్లో ప్రశ్నించే గొంతుల సంఖ్య ఇనుమడిస్తుంది. విభిన్న రంగాల మహిళలు గొంతు సవరించుకుంటూ సామాజికోద్యమాల్లో భాగస్వాములవుతారు. ఈ ఉద్యమాల వెల్లువనే మహిళల సాధికారతనీ, సమానత్వాన్నీ సాధించడానికి తోడ్పడుతుంది.

"సగం నీవు సగం నేను విప్లవాకాశంలో" అన్న మావో మాటలు వాస్తవ రూపం దాల్చడానికి పీడిత మహిళలు, పురుషులు సంఘటితం కావడం అనివార్యం. మహిళ బతుకుని బీభత్సం చేస్తున్న మతోన్మాద ధూర్తత్వాన్నీ, మార్కెట్ కౌటిల్యాన్ని ఎదుర్కోడానికి ఇది తప్పనిసరి. చదువులు, ఉద్యోగాలు, సొంత సంపాదనలు మహిళల జీవితంలో పురోగతిగా కనిపించినా, మహిళకు భద్రత లేదు. నిర్భయంగా సంచరించే స్వేచ్ఛ లేదు. ఆమె అడుగుజాడలపై ఆంక్షల పరదాలు తొలగిపోలేదు. ఇంటి నుంచి బయటికి అడుగుపెట్టే మహిళ తిరిగి క్షేమంగా ఇంటికి చేరే వాతావరణం లేదు. క్షణక్షణం తనని తాను, తన ఆలోచనల్ని తాను కూడదీసుకుంటూ బతకాల్సిరావడం కన్నా మించిన దుస్థితి మరొకటి లేదు. ఈ లోకాన ఏ ప్రాణికీ లేని ఈరకమైన భీతి మహిళకే ఉండటం మహావిషాదం. ఈ విషాద బీభత్సం నుంచి విముక్తి కోసం మరో అడుగు ముందుకెయ్యటం మహిళా దినోత్సవాలకు దీప్తీ.. స్ఫూర్తీ..!

ఆధిపత్యం, అణచివేతలపై తిరుగుబాటుకే బీఎల్ఎఫ్



ఎస్. వీరయ్య

ఆధిపత్యం ఒక చీడపురుగు. అది మనువాదం ముద్దుబిడ్డ. అది బడుగులనూ, దళితులనే కాదు, ఆడబిడ్డలనూ వదల్లేదు. మహిళలకు సంబంధించినంత వరకు హిందువులలో మనువాదం రూపంలో ఆవహించినా... ఆధిపత్యం ఏ మతాన్నీ వదల్లేదు. కుల వ్యవస్థను కూడా వదల్లేదు. మహిళకు సమాన స్థానంలేదు. ఏ సామాజిక తరగతి చూసినా, ఏ వర్గం చూసినా స్త్రీకి సమాన గౌరవం దక్కలేదు. ఆధిపత్య కులాలు దళితులను బానిసలుగానే పరిగణిస్తున్నాయి. పెట్టుబడిదారులు కార్మికులను బానిసలుగా చేసి దోచుకుంటున్నారు. ఆశ్చర్యకరంగా ఈ 'బానిసలే' తమ భార్యలను బానిసలుగా పరిగణిస్తున్నారు. పురుషాధిక్యత నరనరాన జీర్ణించుకున్న సమాజం మనది. రేణుకా చౌదరిని శూర్పణఖతో పోల్చినప్పుడే మహిళలపట్ల మనువాద మోడీ వైఖరి మరికొంత మందికి అర్థమైంది. మోడీ దృష్టిలో శూర్పణఖ అయినా, రేణుకా చౌదరి అయినా.. మహిళ ఎవరైనా మనువాదానికి తలవంచాలి. పురుషుడి ఆధిపత్యాన్ని అంగీకరించాలి. అదే అహంభావాన్ని పార్లమెంటులో మోడీ ప్రదర్శించారు. మోడీ వ్యాఖ్యలను రేణుకాచౌదరి తప్పుబట్టారే తప్ప కాంగ్రెసు నాయకత్వం సీరియస్‌గా పరిగణించకపోవటం గమనించాలి. పోర్న్ చిత్రాలను వ్యతిరేకించిన సామాజిక కార్యకర్త నుద్దేశించి "నువ్వు ఇంకా అందంగా ఉన్నావు. నిన్నుపెట్టి సినిమా తీస్తా" అన్నాడు ప్రముఖ తెలుగు సినీ దర్శకుడు. సినిమా రంగంలో మహిళలు రోజుకో భర్తను మారుస్తారని తెలంగాణ బీజేపీ ఎమ్మెల్యే బరితెగించి మాట్లాడాడు. అంటే అది సినిమా రంగమైనా, రాజకీయ రంగమైనా... రంగమేదైనా మనువాదపు రంగు మాత్రం అదే! మహిళపైన ఆధిపత్యమే! రాష్ట్ర మంత్రివర్గంలో మహిళలేదు. ప్రజా ప్రతినిధులుగా మహిళలు ఎన్నికైనా భర్తలదే పెత్తనం. ప్రపంచస్థాయి పారిశ్రామికవేత్తల సదస్సుకు ఆశ్రయమిచ్చినప్పటికీ, మన ప్రతినిధి వర్గంలో ఒక్క మహిళా పారిశ్రామిక వేత్తకు కూడా స్థానం లేదు. దేశంలో తలాక్ సమస్యను కూడా రాజకీయ ప్రయోజనాలకు వాడుకునే దుస్థితి దాపురించింది.

బాంచెన్ దొరా అన్న బడుగులే బరిసెలందుకుని తిరగబడేటట్టు చేసింది సాయుధ రైతాంగ పోరాటం. వెట్టిచాకిరిపైన తిరగబడే చైతన్యం నింపింది. దళితులు, గిరిజనులు, బలహీన వర్గాలను పోరుబాటలో నడిపింది ఎర్రజెండా. ఈ ప్రజల తిరుగుబాటు వారసత్వమే బహుజన లెఫ్ట్ ఫ్రంట్‌కు ఆదర్శం. ఆర్థికదోపిడీ మీద, సామాజిక అణచివేత మీద పోరాటమే దీని మార్గం. రాజ్యాధికారమే దీని లక్ష్యం.

తెలంగాణ వస్తే సామాజిక సమస్యలు సైతం పరిష్కారమవుతాయని జనం ఆశించారు. అది అత్యాశేనని పాలకులు తేల్చారు. శృతిపైన లైంగిక దాడితో తెలంగాణకు స్వాగతం పలికారు పోలీసులు. ఆశీర్వదించారు పాలకులు. సినీ నటి దీపికా పదుకునే ముక్కుకోస్తామనీ, తలతీస్తే కోటి రూపాయల బహుమానం అనీ మనువాదులు బరితెగించి ప్రకటించినా ముఖ్యమంత్రి ఖండించలేదు. తెలంగాణ రాష్ట్రంలో కూడా మహిళల మీద లైంగికదాడులు, గృహహింస ఆగలేదు. ఉమ్మడి రాష్ట్ర వారసత్వాన్నే తెలంగాణ పాలకులు కొనసాగిస్తున్నారు. మహిళలకు భద్రత, సాధికారత, హక్కులు, ఆత్మగౌరవం అన్న మాటలను పాలకులే ఖాతరు చేయటానికి సిద్ధంగా లేరు. దేశంలో కూడా హత్యల్లో, లైంగిక దాడులలో బీజేపీ పాలిత రాష్ట్రాలే అగ్రస్థానంలో ఉన్నాయి. దేశంలో మహిళల పరిస్థితిని గురించి సుప్రీం కోర్టు న్యాయమూర్తి ఎ. గోపాలగౌడ చెప్పిన మాటలు వాస్తవాలకు దర్పణం పడుతున్నాయి. "రాజ్యాంగం ప్రవేశికలో పేర్కొన్న సమానత్వం అమలు కాలేదు. సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాలలో అమలు కావాలి. దేశంలో 50శాతం మహిళలున్నారు. అయినా 5శాతం మహిళలకే స్వంత ఆస్తి ఉన్నది" అన్నారాయన. చట్టసభల్లో మహిళల సంఖ్య పెరిగితే కుటుంబాలు విచ్ఛిన్నమవుతాయంటున్నది ఆర్ఎస్ఎస్. 'నస్త్రీ స్వాతంత్ర్య మర్హతి' అన్న మనుస్మృతిని పక్కాగా అమలు చేయాలన్నదే దాని ప్రయత్నం.

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మద్యం విధానం మహిళల పట్ల శాపంగా మారింది. తాగుడుకు బానిసై చనిపోతున్న వారు పేద కుటుంబాల పురుషులే. పౌష్టికాహారం లేక, తాగుడు ప్రభావాన్ని తట్టుకోలేక పురుషులు చనిపోతే, ఒంటరి మహిళలే అనేక కుటుంబాలను నెట్టుకొస్తున్నారు. అయినా మద్యం అమ్మకాలను ప్రభుత్వం ఆదాయపు వనరుగానే చూస్తున్నది. వృద్ధాప్య పింఛను పెంచినట్టే పెంచి, కుటుంబంలో ఒక్కరికే అన్నది. దీనితో కుటుంబంలో వయసులో పెద్దవాడు భర్త కావటంతో భార్య పింఛన్ హక్కు కోల్పోయింది. ఉన్న కొద్దిపాటి ఆర్థిక వెసులుబాటు పోయింది.

కుల వ్యవస్థలో అగ్రవర్ణమా? అణచివేతకు గురవుతున్న సామాజిక తరగతులా? అన్న తేడా లేదు. అన్ని కుటుంబాలలోనూ మహిళ పరిస్థితి అధోగతే. తెలంగాణ గ్రామీణ ప్రాంతాలలో భూస్వామి దొర. భూస్వామి భార్య మాత్రం దొర'సాని'. 'దొర'కు ఉన్న గౌరవం ఆయన భార్యకు లేదు. 'దొర' కుటుంబంలో కూడా మహిళకు దక్కింది 'సాని' స్థానమే! అణగారిన తరగతులలోనూ ఇదే పరిస్థితి. భర్తతో సమానంగా కూలి చేస్తున్నందువల్ల ధైర్యంగా ఎదిరించే ప్రయత్నం చేసినప్పటికీ, ఆధిపత్యం మాత్రం బుసలు కొడుతూనే ఉంటుంది. తను ప్రేమించిన అమ్మాయి తనకు దక్కలేదని యాదాద్రి-భువనగిరి జిల్లాలో ఒక ఉన్మాది హత్య చేసాడు. ఆ యువకుడు దళితుడే సుమా! పురుషాధిక్యత అడుగడుగునా వెన్నాడుతున్నది.

చదువూ, ఆస్తి, అధికారం తరతరాలుగా దళితులకూ, మహిళలకూ నిషిద్ధం. స్త్రీలైనా, పురుషులైనా, ఏ కులం లేదా ఏ సామాజిక తరగతికి చెందినవారైనా... ఎవరి పనిలో వారు నిపుణులే. సమాజంలో ఉత్పత్తిలో భాగస్వాములైన శ్రామికులంతా నిపుణులే. వారి వృత్తి నైపుణ్యమే వారి వారసత్వ సంపద. ఆధునిక సమాజంలో, యాంత్రీకరణ, శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధితో కొత్తమార్పులొచ్చాయి. ప్రజాస్వామ్య వ్యవస్థలు ఆవిర్భవించాయి. ఈ మార్పులతో వచ్చిన ఆధునిక అవకాశాలన్నీ సహజంగానే చదువుమీద, ఆస్తిమీద అధికారం ఉన్నవారికే అందుబాటులోకి వచ్చాయి. ఆధునిక రాజ్యాంగం, చట్టం, న్యాయం వంటి అవకాశాలు కూడా వీరికే దక్కాయి. బోధన, వైద్యం, పరిపాలనా రంగాలలో కూడా ఆధిపత్య కులాలదే ఆధిపత్యం అయ్యింది. అందులోనూ పురుషులదే పెత్తనం అయ్యింది. దేశ కాల పరిస్థితులు, ప్రపంచ స్థితిగతులు అధ్యయనం చేసే అవకాశాలు కూడా వీరికే దక్కాయి. ఆర్థిక వేత్తలుగానూ, రాజకీయ వేత్తలుగానూ కూడా వీరే ఎదిగారు. శూద్ర వర్ణాలలో సైతం భూమి మీద ఆధిపత్యం ఉన్న వారికే చదువుకునే అవకాశం దక్కింది. ప్రజాస్వామ్యం విస్తరణతో బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యుల తర్వాత అవకాశాలను

సమకాలీనం

అందుకోగలిగింది వీరే. అందుకే, అణగారిన తరగతులను అభివృద్ధి చేయటం సామాజిక బాధ్యత. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రభుత్వాలదే బాధ్యత. ఆస్తిమీద రిజర్వేషన్ కొనసాగుతుండగా సమానత్వం సాధ్యం కాదు. అందుకే విద్యా, ఉద్యోగ రంగాలలోనూ, కొన్ని తరగతులకు కొన్నిస్థాయిల్లో రాజకీయ రంగంలోనూ రిజర్వేషన్లు




ప్రారంభించారు. ఇవి తాత్కాలిక ఉపశమన చర్యలే. అయినా.. కొంత ఊరటనిస్తున్నాయి. ఆయా తరగతులలో గణనీయమైన సంఖ్యలో చదువుకున్న వారు, మధ్యతరగతి అభివృద్ధి చెందడానికి తోడ్పడ్డాయి. రాష్ట్రంలోని స్థానిక సంస్థలలో మహిళలకు 50శాతం రిజర్వేషన్లు మంచి పరిణామమే.

రిజర్వేషన్ల మీద దాడి చేస్తున్నవారు ప్రధానంగా ఆధిపత్య శక్తులే కావటం గమనార్హం. వీరు మెరిట్ గురించి మాట్లాడటం మరింత ఆశ్చర్యకరం. భూమిమీద తరతరాలుగా ఆధిపత్యం పొందిన వీరికి వ్యవసాయంలో ఉన్న మెరిట్ ఏమిటో చెప్పజాలరు. వీరెప్పుడూ నాగలిపట్టలేదు. విత్తనం వేయలేదు. నాట్లు వేయలేదు. కోత కోయలేదు. అయినా ఆస్తి వీరికే రిజర్వ్ చేసుకున్నారు. మార్కులతో నిమిత్తం లేకుండా ప్రయివేటు కాలేజీలలో డొనేషన్లు కట్టి సీట్లు సంపాదించేది వీరే. డాక్టర్లూ, ఇంజనీర్లూ అవుతారు. సంపద తరాలుగా వీరికే రిజర్వు అయిన ఫలితంగా మెరిట్‌తో నిమిత్తం లేకుండానే పైపైకి ఎగబాక గలుగుతున్నారు. అధికారం చేతుల్లో ఉండటంతో అవినీతీ, ఆశ్రిత పక్షపాతంతో అందలం ఎక్కినవారే. వీరికి మెరిట్ అవసరం పడలేదు. భూస్వామికీ, పెట్టుబడిదారుకూ మెరిట్ అవసరం లేదు. ఆస్తీ, డబ్బూ ఉంటే చాలు. అధికారానికి మెరిట్ అవసరం లేదు. ఆధిపత్య పెత్తందారీ శక్తులైతే చాలు. సినిమాహీరోలు కావడానికి నటనలో మెరిట్ అవసరం లేదు. కులం, డబ్బు ఉంటే చాలు. మహిళలుంటేనే సినిమా నడుస్తుంది. లేకుంటే అక్కడ కూడా మహిళను రానిచ్చేవారు కాదు. ఇప్పుడు దర్శకులుగా మహిళలకు వస్తున్న అవకాశాలెన్ని? సమర్థులు లేకనా? దేశాన్ని ఇంతకాలం పరిపాలించిన వారు ప్రధానంగా అగ్రవర్ణ పెత్తందారులే కదా! అయినా ఆర్థిక అసమానతలూ, సామాజిక సమస్యలూ, ధరలూ, నిరుద్యోగం పెరుగుతూనే ఉన్నాయి. వీరి మెరిట్ గురించి ఎలాంటి నిర్ధారణకు రావాలి? విద్య, ఉద్యోగాలలో రిజర్వేషన్ల విషయంలో మాత్రం మెరిట్ సమస్యను ముందుకు తెస్తారు. ఇక్కడ అసలు సమస్య మెరిట్ కాదు. ఎవరి ప్రయోజనాల కోసం ఎలాంటి వాదనలు చేస్తున్నారన్నదే అసలు సమస్య. పాలకుల తప్పుడు విధానాల పట్ల అసంతృప్తి చెందిన ప్రజలు పోరాట బాట పట్టకుండా ప్రజల దృష్టి మరలించడమే వీరి ఎత్తుగడ. రిజర్వేషన్లే వద్దంటారు. లేదంటే తమకూ రిజర్వేషన్లు కావాలంటారు. ఇది రాజకీయ ఎత్తుగడలో భాగం.

ప్రయివేటు రంగంలో రిజర్వేషన్లు సాధించటమే ఇప్పుడు తక్షణ కర్తవ్యం. ప్రభుత్వశాఖలలో పోస్టులు కుదిస్తున్నారు. కాంట్రాక్టీకరణ పెరిగింది. ప్రభుత్వరంగ సంస్థలలో ప్రయివేటీకరణ జరుగుతున్నది. అందువల్ల ఇప్పుడున్న రిజర్వేషన్లు ఉన్నా లేనట్టే. దళితులు, గిరిజనులు, మహిళలు, వెనుకబడిన తరగతులకు ప్రయివేటు సంస్థలలో రిజర్వేషన్లు సాధించుకోవాలి. అవి తమ స్వంతమైనట్టూ, తమ సంస్థలలో రిజర్వేషన్ ఎందుకివ్వాలంటారు కొందరు. ప్రయివేటులో 'ప్రయివేటు' ఎంత అన్న ప్రశ్నకు వారు సమాధానం చెప్పాలి. ప్రయివేటు సంస్థలుగా చెప్పబడుతున్న వాటిలో 90శాతం పెట్టుబడి ప్రభుత్వరంగ బ్యాంకులు ఇస్తున్న అప్పులే. బడా పెట్టుబడిదారులు వాటినీ ఎగవేస్తున్నారు. ఆస్తిలో తరతరాలుగా రిజర్వేషన్ అనుభవిస్తూ, ఇప్పుడూ ప్రజల సొమ్ము వాడుకుంటూ, ప్రభుత్వ సౌకర్యాలూ, రాయితీలూ అనుభవిస్తూ రిజర్వేషన్లను మాత్రం ప్రశ్నిస్తున్నారు. స్వప్రయోజనం కోసం ప్రయివేటురంగంలో రిజర్వేషన్లను తిరస్కరిస్తున్నారు. సామాజిక ప్రయోజనం కోసం వాటిని ప్రవేశపెట్టాలి. అందుకే మహిళల సమస్యలైనా.. రిజర్వేషన్ల సమస్యలైనా... ఎవరు ఆధిపత్యం ప్రదర్శించినా ప్రశ్నిస్తుంది బహుజన లెఫ్ట్ ఫ్రంట్.

తెలంగాణ ప్రజలది ప్రతిఘటించే వారసత్వం. మహిళలను రాజకీయ రంగ ప్రవేశం చేయించింది వీరతెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం. స్త్రీ పురుష సమానత్వాన్ని చాటిచెప్పింది ఆ పోరాటం. భూస్వామ్య, సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాల్లో కదిలారు మహిళలు. బాంచెన్ దొరా అన్న బడుగులే బరిసెలందుకుని తిరగబడేటట్టు చేసింది సాయుధ రైతాంగ పోరాటం. వెట్టిచాకిరిపైన తిరగబడే చైతన్యం నింపింది. దళితులు, గిరిజనులు, బలహీన వర్గాలను పోరుబాటలో నడిపింది ఎర్రజెండా. ఈ ప్రజల తిరుగుబాటు వారసత్వమే బహుజన లెఫ్ట్ ఫ్రంట్‌కు ఆదర్శం. ఆర్థికదోపిడీ మీద, సామాజిక అణచివేత మీద పోరాటమే దీని మార్గం. రాజ్యాధికారమే దీని లక్ష్యం. ■

హామీల రంగులు



తెలిదేవర భానుమూర్తి

నారదుడు కొప్పేసుకుండు. పోడర్ బూస్కుండు. తంబూరు దీస్కుండు. ఒకపారి టింగ్‌టింగ్‌మన్నడు. చిర్తలు దీస్కుండు. ఒకపారి గవ్విటిని కొట్టి సూస్కుండు. గీపారి యాడికి బోవాలె. యాడికిబోతె బాగుంటదని జెరసేపు గాయిన సోంచాయించిండు. యాడికో ఎందుకు ఎప్పటితీర్గ యాద్గిరిగుట్టకు బోతె బాగుంటదని అనుకున్నడు. అనుకోని చిర్తలు గొట్టుకుంట నారాయన, నారాయన అన్కుంట గాయిన మొగులు మీదికెల్లి ఎల్లిండు. యాద్గిరి గుట్ట దిక్కు గాయిన రాబట్టిండు. నడ్మల నర్కం దిక్కు బోతున్న యముని దున్నపోతు గాయినకు గల్సింది.

"యాడికి బోతున్నవు నారదా?" అని దున్నపోతు అడిగింది.

"యాద్గిరి గుట్టకు బోతున్న" అని నారదుడు జెప్పిండు.

"గుట్టకు ఎందుకు బోతున్నవు" అని దున్నపోతు అడిగింది.

"నర్సిమ్మసామితోని ముచ్చటబెట్టె తందుకు" అని నారదుడు జెప్పిండు.

"గాయినతోని ముచ్చటబెట్టె ఏమొస్తది?" అని దున్నపోతు అడిగింది.

"గాయినతోని ముచ్చటబెట్టె తెలంగానల ఏమైతున్నదో ఎర్కైతది" అని నారదుడు అన్నడు.

"గీయింత దాన్కి యాద్గిరి గుట్టకు బోవుడెందుకు?" అని దున్నపోతు అన్నది.

"ఏంది. గట్లంటున్నవు?" అని నారదుడు అడిగిండు.

"తెలంగానల ఏమైతున్నదో నేను జెప్త గద" అని దున్నపోతు అన్నది.

"తెలంగానల ఏమైతున్నదో నీకెట్ల ఎర్క" అని నారదుడు అడిగిండు.

"నెల దినాల సంది నేను తెలంగానలనే ఉన్న" అని దున్నపోతు అన్నది.

"తెలంగానల ఎందుకున్నవు?"అని నారదుడు అడిగిండు.

"మా దున్నపోతుల మీటింగ్లు అయితుంటె నేను తెలంగానకు వొచ్చిన" అని దున్నపోతు అన్నది.

"గట్లయితె తెలంగానల ఏమైతున్నదో జెరజెప్పు" అని నారదుడు అన్నడు.

"హోలి పండ్గ వొచ్చింది. అందరు రంగులు బోస్కోబట్టింన్రు. తీరుతీరు రంగులతోని హోలి ఆడబట్టింన్రు. కాంగ్రెస్ పార్టి బస్సుయాత్ర జేస్కుంట హోలి ఆడబట్టింది. అన్ని పార్టిలకు రంగులున్నయి. మన పార్టికి రంగు లేదు. మన పార్టి రంగుల తెల్ల రంగు. మనం ఏ రంగు బోద్దాం అని జెరసేపు కాంగ్రెస్ లీడర్లు సోంచాయించింన్రు. అన్ని రంగులు గలుస్తనే తెల్లరంగు అయితది. మనం అన్ని రంగులు బోద్దాం అని గాల్లు అనుకున్నరు. అనుకోని హోలి హోలిల రంగ హోలి చెమ్మకేలిరె హోలి హోలిపండగొచ్చినాది హోలీ చెమ్మకేలిరె హోలీ అని పాడుకుంట గాల్లు బస్సుల దిరుక్కుంటనే రంగలు బోయబట్టింన్రు. ఏ రంగో ఎందుకు నల్ల రంగు బోస్తె పక్కగ ఉంటదని కాంగ్రెస్ లీడర్లు



నల్ల రంగు బొయ్యబట్టింన్రు. రంగు దొర్కకుంట డాంబరు దీస్కోని మొకాలకు బుయ్యబట్టింన్రు. రంగులు బోస్కుంట ఓట్లు అడ్గబట్టింన్రు. వొచ్చె ఎలచ్చన్ల మాకే ఓట్లు ఎయ్యింన్రి. వొచ్చేపారి ఎట్లన్న మేమే గెలుస్తం. దలితులకు తలా మూడెక్రాల బూమి ఇస్తమని టిఆర్ఎస్ సర్కార్ జెప్పింది. గని ఇదువర దాంక ఒక్కలికి గూడ మూడెక్రాల బూమి ఇయ్యలేదు. ఇంటికొక కొల్వు ఇస్తమని జెప్పింది. గని ఊరికొక్క కొల్వు గూడ ఇయ్యలేదు. తెలంగానల రైతులు పుర్గులమందు దాగి పానాలు దీస్కుంటున్నరు. గీ సర్కార్ రైతుల గురించి ఏం జెయ్యలేదు అని కాంగ్రెస్ లీడర్లు జెప్పబట్టింన్రు.

ఇగ టిఆర్ఎస్ లీడర్లు జెనం మీద గులాబిరంగు బోయబట్టింన్రు. కాంగ్రెస్ నల్బై ఏండ్లల్ల జెయ్యనిది మేము నాలుగేండ్లల్ల జేసినం. మిషన్ కాకతీయ కింద చెర్వులను మంచిగ జేపిచ్చినం. మిషన్ బగీరత కింద అందరికి మంచి నీల్లు ఇస్తున్నం. లేనోల్లకు డబల్ బెడ్ రూం ఇండ్లు గట్టిచ్చినం. కొల్వులేనోల్లకు కొల్వులు ఇచ్చినం అని జెప్పుకుంట గాల్లు గులాబిరంగు బోయబట్టింన్రు. ఎవ్వలు ఎంత రంగు బోసింన్రు. ఎవ్వలు గాల్ల నియోజకవర్గంలనే రంగు బోసింన్రా? లేకుంటె వేరె జాగలల్ల రంగు బోసింన్రా? గులాబిరంగు గాకుంట ఇంకేమన్న రంగులు బోసింన్రా? మొకాలకు రంగులు బూసింన్రా? పిచికారితోని రంగులు బోసింన్రా? ఎవ్వరెంత గనం రంగులు బోసింన్రు అనే దాని మీద ముక్యమంత్రి సర్వే జేపిచ్చిండు. సర్వే జేపిచ్చి మార్కులు ఇచ్చిండు. యాబైకన్న ఎక్వ మార్కులు వొచ్చినోల్లకే వొచ్చెపారి ఎలచ్చన్ల టికిట్లు ఇస్తమని జెప్పింన్రు. గులాబిరంగు తక్వ బోసినోల్లకు తక్వ మార్కులు వొస్తయని అన్నరు. ఇగదాంతోని టిఆర్ఎస్ లీడర్లు రంగు బాగ బొయ్యబట్టింన్రు. సన్నదోతులు గట్టుకోని ఉంగ్రాలు బెట్టుకోని గునగున నడుస్తున్న ఓ సావుకారు హోలిపైసలియ్యవా అని పాడబట్టింన్రు. గది జేస్తం, గిది జేస్తం అన్కుంట జెనం మీద హామీల రంగులు బోయబట్టింన్రు.

తెలుగుదేసం లీడర్లు జెనం మీద పచ్చరంగు బోయబట్టింన్రు. పల్లెపల్లెకు పచ్చరంగు అన్కుంట తిర్గబట్టింన్రు. పచ్చరంగు దొర్కకుంటె పస్పు దీస్కోని మొకాలకు బూయబట్టింన్రు. ఇగ బిజెపి లీడర్లు జెనం మీద కాషాయరంగు బోయబట్టింన్రు. చెవులల్ల తామరపూలు బెట్టబట్టింన్రు. మా సర్కార్ వొస్తె అన్నిటి మీద కాషాయరంగు బూస్తమని గాల్లు జెప్పబట్టింన్రు. కొందరు లీడర్లయితె జెనం మీద బుర్ద జల్లబట్టింన్రు. గిదేందని అడిగితె గిది గూడ ఒక రంగే అనబట్టింన్రు. రంగులు బోస్కుంట లీడర్లు ఓట్లు అడ్గబట్టింన్రు. రంగులు బోస్కుంట అడ్వాన్స్‌గ ఓట్లు అడిగితె బాగుంటదని గాల్లు అనబట్టింన్రు. మల్ల గలుస్త" అన్కుంట దున్నపోతు నర్కం దిక్కు బోయింది. నారాయన, నారాయన అన్కుంట నారదుడు వైకుంటం దిక్కు బోయిండు.

తోక.... పొద్దుమీకింది. ఎప్పటి తీర్గ చౌరస్తల ఉన్న పాన్‌డబ్బ కాడ్కి బోయిన. గాడ పాన్లు దినుకుంట మా దోస్తులు ముచ్చటబెడ్తున్నరు.

"గుజరాత్ల హోలి ఆడొద్దన్నరు" అని యాద్గిరి అన్నడు.

"ఎందుకు ఆడొద్దన్నరు" అని సత్నారి అడిగిండు.

"గాడ నీల్ల కర్వు ఉన్నదట" అని యాద్గిరి అన్నడు.

సెల్: 9959150491

రిపోర్టర్స్ డైరీ

థర్డ్ క్లాస్ మాటలు..

కొద్ది రోజుల క్రితం హైదరాబాద్‌లో ఓ ముఖ్యమైన మీటింగు జరుగుతున్నది. ఆ సమావేశంలో ప్రభుత్వం అతి త్వరలో తీసుకు రాబోతున్న కీలక చట్టాల గురించి చర్చ కొనసాగుతున్నది. ప్రభుత్వాధినేత చట్టాలపై ఉపన్యాసం దంచికొట్టారు. ఆ తర్వాత అభిప్రాయాలను తెలియజెప్పాలంటూ మీటింగులో ఉన్న మంత్రులు, ఐఏఎస్‌లు, ఇతర ఉన్నతాధికారులకు సూచించారు. ఇంతలో ఓ అమాత్యుడు లేచి.. 'మనం తీసుకోబోయే నిర్ణయం ఇప్పుడు మనకు లాభం చేకూర్చవచ్చు. కానీ భవిష్యత్తులో వేరే పార్టీ అధికారంలోకొస్తే అప్పుడు ఇదే చట్టాన్ని, అందులోని క్లాజులను ఉపయోగించుకుని.. మనోళ్లను ఆ పార్టీ లాగేసుకుంటది...' అని వినమ్రపూర్వకమైన సూచన చేశారు. దీంతో శివాలెత్తిన.. మన ఎనిమిదో నిజాం నవాబు.. ఒంటికాలిమీద ఫైరయ్యారు. 'గేం భయ్.. మాకియ్యన్నీ తెల్వవా... నువు జెప్తెనే మేం నేర్చుకోవాల్నా.. ఏదో సలహాలియ్యర భయ్.. అంటే అసలు మనం చేసిందే తప్పంటవ్.. నీయ్యన్ని థర్డ్‌క్లాస్ మాటలు.. థర్డ్‌క్లాస్ యవ్వారాలు...' అని కన్నెర్రజేశారు. దీంతో ఖిన్నుడైన సదరు మినిస్టర్.. కిక్కురు మనకుండా కూర్చుండిపోయారు. పంచాయతీ రాజ్ చట్టం, దానిపై సమీక్షా సమావేశాల సందర్భంగా ఇటీవల విలేకరుల మధ్య ప్రస్తావనకొచ్చిన మాటలివి.. గదీ ముచ్చట...

-బి.వి.యన్.పద్మరాజు

పవన్ లెక్కల కుస్తీ

జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ నటించిన 'అజ్ఞాతవాసి' సినిమా భారీ అంచనాలతో వచ్చి బాక్సాఫీస్ వద్ద బోల్తా కొట్టింది. ఈ పరిస్థితి అంచనా వేసిన పవన్ కళ్యాణ్... ఇద్దరు చంద్రులతో మాట్లాడి ఐదు షోలకు అనుమతి తెచ్చుకుని రాబట్టుకున్నారు. ఆ తర్వాత ఆ సినిమాను జనం మరిచిపోయారు. కరెక్టుగా ఆయన ఏర్పాటు చేసిన ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీ కూడా మరో అజ్ఞాతవాసి చిత్రమైంది. ఏపీలో జనమంతా ప్రత్యేక హోదా కావాలంటూ ఉద్యమాలు చేస్తుంటే...పవన్ మాత్రం ఏసీ గదుల్లో తొక్కల మీటింగులు పెట్టి కాలయాపన చేస్తున్నారని వైఎస్ జగన్ విమర్శలు చేస్తున్నారు. ఈ నాలుగేండ్లలో కేంద్రం ఏపీకి ఎన్ని నిధులు ఇచ్చింది. ఎంత ఖర్చు చేసింది. ప్రత్యేక హోదాతో రాష్ట్రానికి కలిగిన ప్రయోజనాలు ఏమిటి? ప్రత్యేక ప్యాకేజీతో నష్టమేమిటి? అని విషయాలపై ఫ్యాక్ట్ ఫైండింగ్ చేస్తారట. ఇంటర్నెట్‌లో కొడితే ఆ లెక్కలన్నీ వస్తాయి. తరచి చూస్తే మనకు తెలిసిపోతున్నది. కానీ మీటింగులు పెట్టి బీజేపీ, టీడీపీకి దెబ్బపడకుండా ప్రయత్నాలు చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. రాజ్యాంగం ప్రకారం ఏపీకి ప్రత్యేక హోదా కల్పించడం ద్వారా అనేక హక్కులు కల్పించబడుతాయి. దీంతో ఆ రాష్ట్రం బాగా అభివృద్ధి చెందుతుంది. అందుకే ప్రత్యేక ప్యాకేజీ కంటే ప్రత్యేక హోదా కోసం జనమంతా కదులుతున్నారు. ప్రజా ఉద్యమం కారణంగా బీజేపీ, టీడీపీ పార్టీలు ఏం చెప్పాలో అయోమయంలో పడ్డాయి. ఫ్యాక్ట్ ఫైండింగ్ అయిపోయింది. వాట్ నెక్స్ పవన్...

- బి. జగదీశ్వర్

కృష్ణయ్య మొగ్గు ఎటువైపు..?

బీసీ సంక్షేమ సంఘానికి బ్రాండ్ అంబాసిడర్‌గా ఆర్ కృష్ణయ్య విషమ పరీక్ష ఎదుర్కోబోతున్నారు. బీసీల హక్కుల సాధన కోసం నిరంతరం పోరాటాలమయంగా మారిన ఆయన జీవితం... పసుపు పచ్చని కండువా కప్పుకోవడంతో మసకబారిపోయింది. భేదాభిప్రాయాల కారణంగా ఆయనకు కుడిభుజంగా కొనసాగిన జాజుల శ్రీనివాస్‌గౌడ్ సొంత సంఘం పెట్టుకునేదాకా వెళ్లింది. దీంతో ఆయన వెనక ఉన్న పునాది కదిలింది. బీసీ సంక్షేమ సంఘంలో ఎంతో క్రియాశీలకంగాఉన్న క్యాడర్ దూరమయ్యారు. ప్రస్తుతం ఆయన ఎమ్మెల్యేగానే బిజీబిజీగా ఉన్నారు. టీడీపీ అభ్యర్థిగా గెలిచినా ఆ పార్టీకి దూరభారంగా ఉంటున్నారు. ఈ విషయాన్ని గమనించిన టీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు ఆయనపై వల విసురుతున్నట్టు సమాచారం. ముఖ్యమంత్రి కె చంద్రశేఖరరావు రాజ్యసభ ఆఫర్ ఇవ్వగా, కాంగ్రెస్ మాత్రం లోక్‌సభకు పంపిస్తామని రాయబారం చేస్తున్నట్టు భోగట్టా. రెండింటిలో ఏదో ఒక దానిని ఎంపిక చేసుకోవాలనే విషమ పరీక్ష ఆర్. కృష్ణయ్య ఎదుర్కొంటున్నారు. గులాబీవనంలో కలువడం కంటే కాంగ్రెస్ గుంపులో కలువడమే ఆయనకు కంఫర్టబుల్‌గా ఉంటుంది. చాలా కాలంగా కాంగ్రెస్ నేతలతోనూ, వైఎస్ రాజశేఖర్‌రెడ్డితో ఆయనకు సన్నిహిత సంబంధాలు ఉండేవి. కానీ ఆయన మనసు మాత్రం కాషాయంపై ఉందని కూడా కొందరు చెబుతుంటారు. కానీ తెలంగాణలో ఆ పార్టీకి అదరణ లేకపోవడంతో ఇక కృష్ణయ్య ఎటు మొగ్గుచూపుతారనేది వేచి చూడాలి.

- గుడిగ రఘు

కొనుగోళ్లు..!

రాజకీయాలు ఎప్పుడూ ఒకేలా ఉండవని మరోసారి రుజువైంది. కాదు రుజువు చేశారు ఎన్డీయే పాలకులు. నవ్విపోదురుగాక నాకేంటి సిగ్గు అన్న తరహాలో అన్నీ వదిలేసిన బీజేపీ, దాని అనుంగు ఎన్డీయే మిత్రులు సంబురాలు చేసుకుంటున్నారు. కానీ మోడీ గురువూ, మాజీ ప్రధాని వాజ్‌పేయి మాత్రం తన శిష్యుడు నిర్వాహకం గురించి నోరుతెరిచాడట. ఔరా ! అని కచ్చితంగా మనస్సులో అనుకునే ఉంటాడని ఊహాగానాలు వెలువడుతున్నాయి. ఈశాన్య రాష్ట్రాల్లో గెలుపు నాలుగేండ్ల తమ పరిపాలన ఫలితమేనని జబ్బలు చరుచుకుంటున్న తీరును ఆయన్ను మైమరిచిపోయేలా చేసే బదులు, కలిచివేస్తోందనే బీజేపీ నేతలే చెప్పుకుంటున్నారు.

- బి.బసవపున్నయ్య

సినిమాకు సున్నితత్వాన్ని అద్దుతూ...



మహిళ అంటేనే సృజనాత్మకత. ఎడారిలో కూడా రంగులు పూయించగల మహత్యం ఆమెది. ప్రపంచం ఆమెను ఇంటికి పరిమితం చేసినా.. ఆ ఇంటినే ఓ రంగుల ప్రపంచం చేస్తుంది. ఇంట్లోని ప్రతి మూలకు కళాత్మకతను అద్దుతుంది. అలాంటి మహిళ ఇక కళాత్మక రంగంలో ఉంటే వేసే ప్రభావం అంతా ఇంతా కాదు. వెండితెరకు సున్నితత్వాన్ని అద్ది... అసమానత, హింస లేని అద్భుత లోకాన్ని ఆవిష్కరిస్తారు. అలాంటి మహిళలే వీళ్లు. సినిమా రంగంలో తమదైన ముద్రవేసినవాళ్లు కొందరైతే... ఇప్పుడిప్పుడే నూతన ఆవిష్కరణలు చేస్తున్నవారు మరికొందరు. మరో నాలుగు రోజుల్లో ఉన్న మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మానవితో పంచుకున్న అభిప్రాయాలు...

'నువ్వు గర్వపడేలా చేస్తా అమ్మా'



'అమ్మా! నా హృదయంలో తీరనిలోటు ఒకటి ఏర్పడింది. ఇప్పుడు నేను ఎలా జీవించాలన్న విషయాన్ని నేర్చుకోవాలి. ఇంతలోటు ఉన్నప్పటికీ ఇంకా నేను నీ (శ్రీదేవి) ప్రేమ, అనుభూతిని పొందుతున్నాను. నువ్వు నన్ను బాధ నుంచి, నొప్పి నుంచి సంరక్షిస్తున్నట్లే అనిపిస్తోంది. నేను కళ్లు మూసిన ప్రతిసారి.. గుర్తు చేసుకోవడానికి ఎన్ని అనుభూతులున్నాయో. అన్నీ మంచి అనుభూతులే ఉన్నాయి. దీనికంతటికి కారణం నువ్వే అని నాకు తెలుసు. మా జీవితాల్లో నువ్వు ఉండటం.. మా అదృష్టం. నువ్వు చాలా మంచిదానివి, చాలా స్వచ్ఛమైన వ్యక్తివి. ఎంత ప్రేమమూర్తివి. అందుకే దేవుడు నిన్ను తిరిగి తీసుకెళ్లిపోయాడు. నా స్నేహితులు ఎప్పుడూ 'నువ్వు హ్యాపీగా ఉంటావు' అంటుండేవారు. ఆ సంతోషానికి కారణం నువ్వేనని నాకు ఇప్పుడు అర్థమైంది. ఇన్నాళ్లు నేను ఎవరు ఏమన్నా పట్టించుకోలేదు.. ఏదీ సమస్యగా అనిపించలేదు, ఈ రోజు బాలేదని ఎప్పుడూ కూడా అనిపించలేదు.. ఎందుకంటే అప్పుడు నాకు నువ్వు ఉన్నావు కాబట్టి. నువ్వు నన్ను చాలా ప్రేమించావు, నాకు అన్నీ నువ్వయ్యావు. అందుకే నేను ఎవరిపైనా ఆధారపడలేదు.. నాకు కావాల్సిన ఒకేఒక్క వ్యక్తివి నువ్వని ఇప్పుడు తెలుస్తోందమ్మా. నా జీవితంలో నువ్వు ఓ భాగం. నా ప్రాణ స్నేహితురాలివి. నీ జీవితాన్ని మొత్తం మాకోసం ఇచ్చేశావు. ఇప్పుడు నీ కోసం అదే చేయాలి అనుకుంటున్నా అమ్మా. నువ్వు గర్వపడేలా చేస్తాను. నిన్ను చూసి నేను ఎంత గర్వపడ్డానో.. అదే స్థాయిలో నన్ను చూసి నువ్వు గర్వపడే రోజు వస్తుందని ఆశిస్తూ పనిచేస్తా. ఇదే ఆలోచనతో ప్రతిరోజు నిద్రలేస్తానని ప్రతిజ్ఞ చేస్తున్నా. ఎందుకంటే నువ్వు ఇక్కడే ఉన్నావు.. దాన్ని నేను అనుభూతి చెందుతున్నా. నువ్వు నాలో, ఖుషిలో, నాన్నలో నిండి ఉన్నావు. నువ్వు మాపై వేసిన ముద్ర (చూపిన ప్రభావం) చాలా బలమైనది. మేము జీవించడానికి అది చాలు.. కానీ నీ లోటును తీర్చడానికి మాత్రం అది సరిపోదు'

- శ్రీదేవికి కూతురు జాన్వి లేఖ

ముందడుగు కావాలి...

ఉమెన్స్ డే ఒక్క రోజుకు మాత్రమే పరిమితమైన వేడుక కాదు. ఎలాంటి మార్పుల్లేకుండా మూస ధోరణిలో ఉన్న ఈ ప్రపంచాన్ని మహిళ తన చూపులతో ప్రతిరోజూ వెలిగిస్తుంది. తాను వెలగడమే కాదు... తన చుట్టూ ఉండేవారికి ఆ వెలుగులను పంచుతుంది. ప్రపంచంలోనే కాదు... ఇటీవల కాలంలో భారతీయ మహిళల్లో చాలా మార్పు వచ్చింది. ఆలోచనల్లోనే కాదు.. తమ స్థానాన్ని తాము దక్కించుకుంటూ అన్ని రంగాల్లోకి విస్తరిస్తున్నారు. వ్యాపారం, సినిమా రంగాల్లోనూ వారి భాగస్వామ్యం పెరిగింది. అలా విజయవంతంగా సాగిపోతున్న మహిళలను ప్రోత్సహించడం, ప్రశంసించడం పెరిగింది. గతంలో అవకాశాలు లేవు. ఇప్పుడు చాలా అవకాశాలొచ్చాయి. అన్ని రంగాల్లోనూ మహిళలు అడుగు పెడుతున్నారు. అయితే ఇది మాత్రమే సరిపోదు. ఇంకా సాధించాల్సింది చాలా ఉంది. మహిళలు తమ శ్రమతో ఓ స్థాయికి వెళ్తున్నా... నిజంగా వాళ్లకు దక్కాల్సిన ఫలితం, స్థానం ఏదైనా కావచ్చు.. దక్కడం లేదు. ఒకవేళ దక్కినా పనిచేసేచోట స్వేచ్ఛ లేదు. మహిళలకు ఇంకొంచెం స్వతంత్రత అవసరం. అది సమాజం ఇవ్వాల్సింది.. మహిళలు తమకు తాముగా తీసుకోవాల్సింది. దానికోసం ఈ ఉమెన్స్‌డే ఓ ముందడుగు అవుతుందని భావిస్తున్నా!

- శ్వేత, స్టయిలిస్ట్



స్వేచ్ఛగా ఊపిరి తీసుకోగలిగినప్పుడే...



ఒక్క రోజుకే మహిళా దినోత్సవం పేరు పెట్టి సంబరపడిపోతున్నాం. మహిళలు ఎంత గొప్ప వాళ్లు... ఎన్ని ఉన్నత శిఖరాలు అధిరోహిస్తున్నారని పొగుడుతున్నారు. దీంతో మనకు చాలా మంచి స్థానం లభించిందని మురిసిపోతూ... మనలను మనం మభ్య పెట్టుకుంటున్నాం అనిపిస్తుంది. ఇప్పుడే కాదు... ఝాన్సీ లక్ష్మీభాయి, రుద్రమదేవి లాంటి ఎందరో ధీరవనితలు రాజ్యమేలిన చరిత్ర మనకున్నది. మహిళలు తమ శక్తి సామర్థ్యాలకు మించి కుటుంబంలో, దేశంలో బాధ్యతలు నిర్వహిస్తున్నారు. పురుషులతో దీటుగా పోరాడుతున్నారు. అ ంత శక్తిసామర్థ్యాలు, బాధ్యత చూపిస్తున్నప్పటికీ... మహిళలను మానసికంగానో, శారీరకంగానో, వృత్తిపరంగానో చిన్నచూపు చూస్తున్నారు. అణగదొక్కే ప్రయత్నం చేస్తున్నారు. అనేక సమస్యలు సృష్టిస్తున్నారు. ఇప్పటికీ ఎంత ఉన్నత స్థానాల్లో ఉన్నా, మంచి హోదాలో ఉంటూ ఉనికిని, స్వేచ్ఛను, ప్రగతిని చాటుతున్నా... ఆ విజయం, ఆ నవ్వులు నిజంగా నిజమేనా అనిపిస్తుంది. వారికి కుటుంబం నుంచి, సమాజం నుంచి సహకారం లభిస్తోందా? అన్న అనుమానం వస్తుంది. ఎందుకంటే ఆరేండ్ల అమ్మాయి దగ్గరనుంచి 60 ఏండ్ల మహిళ దాకా ఒంటరిగా బయటకు వెళ్లాలంటే ..ఎన్ని ఇబ్బందులో. ఎంత ఉన్నత శిఖరాలు అధిరోహించిన మహిళకైనా కుటుంబంలోనో, బయటనో, సమాజంలోనో... పురుషుడినుంచో, మరో స్త్రీనుంచో విమర్శలు, అవమానాలు ఏమీ తప్పడం లేదు. గౌరవం లభిస్తోంది. గౌరవించే సంప్రదాయం పెరిగింది. అయినా స్త్రీలు స్వేచ్ఛగా బయటికి వెళ్లి.. మళ్లీ ఇంటికి రాగలిగే వాతావరణం లేనప్పుడు ఎలా సంబరపడతాం? మహిళా దినోత్సవాన్ని పండగలా ఎలా జరుపుతాం? ఏ మహిళ అయినా... మానసికంగా క్షోభ పడకుండా స్వేచ్ఛగా ఊపిరి తీసుకుంటూ బతకగలిగినప్పుడు ప్రతిరోజూ మహిళా దినోత్సవం అవుతుంది.

- శ్రేష్ట, సినీ గేయ రచయిత



కాస్త డిఫరెంట్‌గా...

చాలా మంది ఇంటి శుభ్రతకే ఎక్కువ సమయాన్ని కేటాయిస్తారు. ఇక అలంకరణ విషయానికొస్తే పెద్దగా చెప్పుకోవాల్సిన అవసరం లేదు. ఇంటితో పాటు బాత్‌రూమ్ శుభ్రతకు, అలంకరణకు కాస్త సమయం కేటాయిస్తే ఇంకా బాగుంటుంది. బాత్ రూమ్‌ను ఎలా అలంకరించుకోవాలో తెలుసుకుందాం...

- బాత్‌రూమ్ కంటైనర్స్‌గా బయటకు కనిపించేవి కలర్‌ఫుల్ టైయిల్స్, షోవర్, షాంపూలు, బాత్ ఆయిల్స్, టవల్స్, బ్రష్, బకెట్, సబ్బులు, ఆరోమా ట్యాబ్‌లెట్స్. వీటిని బాత్ రూమ్ కంటైనర్స్‌గా చెప్పుకోవచ్చు. అయితే వీటిని ఎక్కడ పడితే అక్కడ పెడితే ఉపయోగించడం ఇబ్బందిగా ఉంటుంది. ఉన్నవాటిని అందంగా అలంకరించుకుంటే చూడటానికి అందంగా కనిపించడంతో పాటు అందుబాటులో ఉంటాయి.
- బాత్‌రూమ్‌లో ఒకపక్కకు రాయితో తయారు చేసిన చిన్న వాటర్ ఫౌంటెన్‌ను ఉంచుకోండి. ఇది బాత్‌రూమ్‌కు చాలా అందాన్నిస్తుంది. వాటర్ ఫౌంటెన్ నీటిలో కొన్ని చుక్కల పర్‌ఫ్యూమ్ వేసుకుంటే బాత్‌రూమ్‌లో సుగంధభరితమైన వాసన వస్తుంది.
- అలాగే బాత్‌రూమ్ కిటికీ వెంబడి చిన్న చిన్న గవ్వలు, ఆలుచిప్పలను ఉంచుకోండి. ఇవి ఎంతో అందంగా కనిపిస్తాయి. బాత్ రూమ్‌లో గవ్వలను చూడగానే మానసికంగా ప్రశాంతంగా, సంతోషంగా ఉంటారు.
- ఒక చిన్న మట్టి పాత్రలో నీళ్లు తీసుకోవాలి. ఆ నీళ్లల్లో రెండు లేదా మూడు చుక్కల ఆరోమా నూనె, చిన్న పువ్వులను వేసి ఉంచితే ఎంతో అందంగా కనిపిస్తుంది. ముఖ్యంగా ఇది బాత్‌రూమ్‌లో వచ్చే దుర్వాసనను దూరం చేస్తుంది.
- బాత్‌రూమ్‌లోని దుర్వాసనను పూర్తిగా తొలగించడంలో ఆరోమా ఆయిల్స్ బాగా పని చేస్తాయి. ఒక స్ప్రే బాటిల్ కొద్దిగా నీళ్లు తీసుకొని దాంట్లో కొన్ని చుక్కల ఆరోమా నూనెను కలిపి బాత్‌రూమ్‌లో స్ప్రే చేస్తే గది వాసన సుగంధభరితంగా మారుతుంది.
- ఆరోమా వాసనను వెదజల్లే క్యాండిల్స్‌ను రాత్రి సమయంలో బాత్‌రూమ్‌లో పెడితే దుర్వాసన పోయి.. మంచి వాసన వస్తుంది.
- బాత్‌రూమ్ ఐటమ్స్‌ను ఎక్కడపడితే అక్కడ పెట్టకుండా ఒక క్రమ పద్ధతిలో అమర్చుకుంటే చూడటానికి అందంగా, శుభ్రంగా కనిపిస్తాయి.

❄

పురుషుల ఆలోచనా తీరు మారాలి..

ఏం చేయాలి? ఏం చేయకూడదు? అనేది ప్రతి ఒక్కరికికచ్చితంగా తెలుస్తుంది. అసలు తమలో ఏముందో మహిళలు తమను తాము తెలుసుకోవాలి. ఒక్కసారి వెనక్కి తిరిగి చూసుకోవాలి. ఇప్పటిదాకా చేసినవి... వాటి ఫలితాలు, ఇప్పుడు చేయబోయేవి ఏమిటని ఆలోచించుకోవాలి. నీకు నీవు సహకారం అందించుకోవాలి. నీకు నీవు నిలబడకపోతే... నీకోసం ఎవ్వరూ నిలబడరు. మనం ఏం ఆలోచిస్తామో.. ఏం కోరుకుంటామో... అదే మనకు లభిస్తుంది. అందుకే ఎప్పుడూ సానుకూలంగా ఉండాలి. మహిళను అన్న నిరాశ వద్దు. మహిళల విషయంలో సమాజం ఎలా ఉందో... ఇండస్ట్రీ కూడా అలాగే ఉంటుంది. అయితే ఏదైనా ఒక్కరుగా చేస్తే సమస్తం మారిపోదు. సమాజం మొత్తం మారాల్సి ఉంది. మహిళల పట్ల పురుషుల ఆలోచనా తీరు మారాలి. మేం తక్కువ, ఏం చేయలేమన్న భావన మహిళల మెదళ్లలోంచి పోవాలి.

- అనుష్క శర్మ





మీరే నిర్ణయించుకోండి...

అమ్మాయిలకు కావాల్సింది సానుభూతి కాదు. వాళ్లు కోరుకునేది సహానుభూతి. అనవసరమైన ఉచిత సలహాలు ఆమెకు అవసరం లేదు... తన నిర్ణయాన్ని తాను తీసుకునేందుకు అంగీకారం కావాలి. ప్రతి మహిళకు ఒక కథ ఉంటుంది. ఓ ప్రయాణం ఉంటుంది. పంచుకునేందుకు ఎన్నో అనుభవాలు ఉంటాయి. భారతదేశంలో ప్రత్యేకించి అమ్మాయిలు నేర్చుకోవాల్సిందేమంటే... 'నీవు ఎలా ఉండాలో చెప్పే అవకాశం ఇంకొకరికి ఇవ్వకు. నీకేం కావాలో చెప్పే అధికారం ఇంకొకరికి ఇవ్వకు. మొదటి తరం మహిళలు... 'ఎలా ఉండాలి? ఏం తినాలి? ఎలాంటి బట్టలు వేసుకోవాలి? ఎలా నడవాలి?' అన్నీ ఎవరో ఒకరు చెబితే చేశారు. కానీ ఇప్పుడు ఎలా ఉండాలో మీరే తెలుసుకోండి. మీ భవిష్యత్ ఏంటో మీరే తేల్చుకోండి. మీ జీవితానికి ఏది ప్రధానమో, ఏది అప్రధానమో మీరే నిర్ణయించుకోండి. ఆ నిర్ణయాధికారంతోనే ఈ మహిళా దినోత్సవాలకు సార్థకత.

- ప్రియాంక చోప్రా

మూడువేలకు పైగా నాటక ప్రదర్శనల్లో..!

సినిమాలు, టీవీ కార్యక్రమాలు అందుబాటులో ఉన్న కాలంలోనూ నాటక ప్రదర్శనల ద్వారా ప్రేక్షకుల అభిమానం అందుకున్న ప్రముఖ రంగస్థల కళాకారిణి విజయదుర్గ. ఆమె మూడువేలకు పైగా పౌరాణిక, చారిత్రక, సాంఘిక నాటక ప్రదర్శనలు ఇచ్చారు. భక్త కన్నప్ప నాటకంలోని నీల పాత్రలో, సతీ సక్కుబాయి నాటకంలోని శ్రీక ష్ణ పాత్రలో విజయదుర్గ విమర్శకుల ప్రశంసలందుకున్నారు.

విజయదుర్గ విజయవాడలో జన్మించారు. ఆమె తండ్రి ములుగు వీరభద్రరావు రంగస్థల కళాకారుడు కావడంతో చిన్నతనం నుంచే అభినయం ఆమెకు అలవడింది. విజయ 11ఏండ్ల వయసులోనే నాటకాలలో నటించడం ప్రారంభించారు. 1977లో 'గాలివాన' అనే సాంఘీక నాటకంలో ఆమె మొదటిసారిగా నటించారు. మోతుకూరి జాక్సన్ రచించిన దేవాలయం, నటనాలయం నాటకాలు, మండువా, లోగిలి వంటి సాంఘీక నాటకాలలో ఆమె తన అభినయంతో ప్రేక్షకుల అభిమానం అందుకున్నారు. షణ్ముఖ నాట్యమండలి, సాయిబాబా నాట్యమండలి, కనకదుర్గ విజయసాయి నాట్యమండలి తదితర నాట్యమండలి వారి ఆధ్వర్యంలో వందలాది నాటక ప్రదర్శనలలో ఆమె నటించారు. కేవలం నాటక ప్రదర్శనలకే పరిమితం కాకుండా రేడియో, దూరదర్శన్ లోనూ అనేక కార్యక్రమాల్లో పాల్గొన్నారు.



బుర్రా విజయదుర్గ (4మార్చి, 1962)

ఆమె కూతురు అమృతవర్షిణి కూడా రంగస్థలంపై నటిగా రాణిస్తున్నారు.

విజయదుర్గ నటించిన క్రిస్టియన్ నాటకాలు శిలువధారి, లాజర్ ధనవంతుడు, యోహన్ శిరశ్ఛేదం, బెత్లెహం శిశువు, తప్పిపోయిన కుమారుడు, బైబిల్ దొంగలు ఆమెకు ఎంతో గుర్తింపు తీసుకువచ్చాయి. పౌరాణిక విభాగంలో శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి కథ, ఊర్వశీ శాపవిమోచనము, మైరావణ, చింతామణి, బాలనాగమ్మ, నర్తనశాల, మోహినీ భస్మాసుర, నలదమయంతి, గయోపాఖ్యనం వంటి నాటకాలు ఆమెకు ఎంతో కీర్తి తీసుకువచ్చాయి. చారిత్రక విభాగంలో అనార్కలి, పల్నాటి యుద్ధం మొదలైనవి, సాంఘీక నాటకాల్లో ..పల్లెపడుచు, గాలివాన, నటనాలయం, ఆరని కన్నీరు, వలయం, లావాలో ఎర్రగులాబి, రక్తకన్నీరు, దేవుడులేని దేవాలయం, ఈ బ్రతుకు మాకొద్దు, సమాజం మారాలి, మండువా లోగిలి, నవయుగం తదితర నాటకప్రదర్శనల్లో ఆమె తన నటన ద్వారా రంగస్థల అభిమానుల మనసులు గెలుచుకున్నారు. ❄

బ్యాలెన్స్ కోల్పోవద్దు..



నేడు మహిళలు అనేక రంగాల్లో తమ ప్రతిభను కనపరుస్తూ.. కీలక బాధ్యతలను నిర్వహిస్తున్నారు. ఒకప్పుడు మహిళలకు ఆర్థికస్వేచ్ఛ ఉండాలి అనేవారు.. ఇప్పుడు ఆస్తిహక్కు ఉండాలి అంటున్నారు. ఆర్థిక స్వేచ్ఛ అయినా.. హక్కు అయినా నిర్ణయం ఆమె చేతిలోనే ఉండాలి. నిర్ణయాధికారం లేకపోతే మహిళ తనకు తాను ఎలాంటి ఉన్నతి సాధించలేదు. ఒక కుటుంబం బాగుండాలన్నా.. దేశం ప్రగతి సాధించాలన్న మహిళల భాగస్వామ్యం తప్పనిసరి. చదువు, కెరీర్‌తో పాటు ఇంటిబాధ్యతలను బ్యాలెన్సు చేసుకోవాలి. కుటుంబాన్ని, జాబ్‌ను బ్యాలెన్సు చేసుకునే క్రమంలో చాలామంది అమ్మాయిలు వత్తిడికి లోనవుతున్నారు. మెంటల్లీ స్ట్రాంగ్‌గా ఉంటూ.. ముందస్తు ప్లానింగ్‌తో ఉన్నప్పుడు టెన్షన్ పడకుండా పనులు పూర్తిచేసుకోవడం సాధ్యమవుతుంది. ఏ రంగంలో రాణించాలనుకున్నా.. కుటుంబం, కెరీర్‌ను బ్యాలెన్స్ చేసుకునే పరిణితి సాధించాలి. తాను తక్కువ అన్న భావన మనసులోకి రానివ్వకూడదు.

- అపర్ణ మల్లాది, సినీ దర్శకురాలు

రాష్ట్రపతితో గవర్నర్ భేటీ

- హస్తినలో రెండురోజుల పర్యటనకు నరసింహన్

నవతెలంగాణ-న్యూఢిల్లీబ్యూరో

రాష్ట్రపతి రామ్‌నాథ్‌కోవింద్‌ను ఉమ్మడి రాష్ట్రాల గవర్నర్ నరసింహన్ భేటీ అయ్యారు. రాష్ట్రంలోని తాజా పరిస్థితులతో కూడిన నివేదికను అందజేశారు. రెండు రోజుల హస్తిన పర్యటనలో భాగంగా శనివారం గవర్నర్ ఢిల్లీ చేరుకున్నారు. రాష్ట్రపతి రామ్‌నాథ్‌కోవింద్‌ను ఉదయం రాష్ట్రపతి భవన్‌లో కలిశారు. కేంద్రహోంమంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌తో నరసింహన్ భేటీ అయ్యారు.ఆదివారం ప్రధానిని కలవనున్నట్టు సమాచారం.

మాజీ ఎంపీ బంగారు సుశీల అస్తమయం

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

లోక్‌సభ మాజీ సభ్యురాలు బంగారు సుశీల శనివారం మరణించారు. ఆమె బీజేపీ మాజీ జాతీయ అధ్యక్షులు బంగారు లక్ష్మణ్ సతీమణి. తొలి నుంచి ఆమె బీజేపీలో క్రియాశీల కార్యకర్తగా వ్యవహరించారు. రాజస్థాన్‌లోని జాలోర్ నియోజ కవర్గంనుంచి లోక్‌సభకు పోటీచేసి విజయం సాధించారు. మంచి పార్లమెంటే రియన్‌గా పేరు ప్రఖ్యాతలు గడించారు. ఆమె మృతి పట్ల బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కె లక్ష్మణ్, మాజీ కేంద్రమంత్రి బండారు దత్తాత్రేయ, శాసనసభాపక్షనేత జి కిషన్‌రెడ్డితో పాటు పలువురు పార్టీ నేతలు సంతాపం తెలిపారు. ఆమె మరణం బీజేపీ మహిళా కార్యకర్తలకు తీరని లోటని వారు పేర్కొన్నారు.

మే 1నుంచి రఘుబాబు స్మారక నాటకోత్సవాలు : పరుచూరి




నవతెలంగాణ-ఖమ్మం

రఘుబాబు స్మారక నాటకోత్సవాలను మే ఒకటో తేదీ నుంచి నాలుగో తేదీ వరకు ఖమ్మం కళాపరిషత్, ప్రజా నాట్యమండలి సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక భక్త రామదాసు కళాక్షేత్రంలో నిర్వహించనున్నట్టు సినీ రచయిత పరుచూరి వెంకటేశ్వరరావు తెలిపారు. ఖమ్మంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తన కుమారుడు పరుచూరి రఘుబాబు జ్ఞాపకార్థం స్మారక నాటకోత్సవాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. తెలుగు నాటక రంగానికి సేవచేయాలనే తపనతో 1991నుంచి పరుచూరి రఘు మెమోరియల్ ట్రస్ట్ స్థాపించి నాటక పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఏప్రిల్ 27నుంచి 30వరకు ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా పల్లెకోనలో అఖిల భారత స్థాయి నాటక పోటీలు జరుగుతాయన్నారు. ఖమ్మంలో జరిగే పోటీల్లో భాగంగా సినీ గాయకులచే సంగీత విభావరితో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఇప్పటికే రెండు తెలుగు రాష్ట్రాల నుంచి మొత్తం 100 ఎంట్రీలు అందాయన్నారు. వాటిని ప్రాథమిక పరిశీలన చేసిన అనంతరం అందులో 7నాటకాలు, 12నాటికలు ఎంపిక చేసి వాటికి తుది పోటీలు ఖమ్మంలో నిర్వహిస్తామన్నారు. వీటిలో విజేతగా నిలిచిన వారికి సినీ, రాజకీయ ప్రముఖుల చేతుల మీదుగా బహుమతులు అందజేస్తామన్నారు. ఎంపికైన ప్రతి నాటకానికి రూ.20వేలు, నాటికకు రూ.15వేల పారితోషికం ఇవ్వనున్నట్టు తెలిపారు. రెండు విభాగాల్లో ఉత్తమ, ద్వితీయ ప్రదర్శనల అవార్డులతో పాటు వ్యక్తిగత బహుమతులు కూడా అందించనున్నట్టు తెలిపారు. పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ సంప్రదాయ సత్కారం ఉంటుందన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని కళాకారులు, అభిమానులు, ప్రతీ ఒక్కరూ హాజరై ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. విలేకరుల సమావేశంలో ఖమ్మం కళాపరిషత్ అధ్యక్ష, కార్యదర్శులు వీవీ.అప్పారావు, నాగబత్తిని రవి, ప్రజా నాట్యమండలి బాధ్యులు ఏఎస్.కుమార్, జోజి, సదానందం, మోటమర్రి జగన్మోహన్‌రావు, సురేష్ పాల్గొన్నారు.

70 ఏండ్లలో కానిది.. నాలుగేండ్లలో అవుతుందా?

- రైతులు ఇప్పుడే గుర్తుకొచ్చారా? : ప్రతిపక్షాలపై మంత్రి పోచారం ఫైర్



నవతెలంగాణ-జగిత్యాల

కాంగ్రెస్, బీజేపీ 70 ఏండ్ల పాలనలో మారని రైతుల బతుకులు.. నాలుగేండ్లలోనే ఎలా మారుతాయని వ్యవసాయ శాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి ప్రశ్నించారు. తామే రైతుపక్షపాతి అన్నట్టుగా ప్రతిపక్షాలు వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. జగిత్యాల జిల్లా లక్ష్మీపూర్‌లో ఏడు కోట్ల నిధులతో నిర్మించనున్న విత్తనశుద్ధి ప్లాంట్‌కు నిజామాబాద్ ఎంపీ కవితతో కలిసి ఆయన శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ.. ఉత్తర తెలంగాణలో నీటి ఎద్దడిని నిలువరించేందుకు కాళేశ్వరం ప్రాజెక్టు పనులు వేగంగా నడుస్తున్నాయని చెప్పారు. రాష్ట్రంలో 70లక్షల మంది రైతులకు రెండు పంటల పెట్టుబడి కింద ప్రతి సంవత్సరం రూ.12వేల కోట్లు అందజేయనున్నట్టు చెప్పారు.ఎంపీ కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ.. విత్తనోత్పత్తిలో జగిత్యాల జిల్లా అగ్రస్థానంలో నిలవాలని ఆకాంక్షించారు. లక్ష్మీపూర్ రైతులు వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చే విషయంలో ముందున్నారన్నారు. ఇక్కడ విత్తనశుద్ధి కర్మాగారం నిర్మాణం పూర్తయితే రైతులకు విత్తనాలిచ్చి తిరిగి రైతుల నుంచే మార్కెట్ కన్నా 25శాతం ఎక్కువ ధరకు కోనుగోలు చేస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ తుల ఉమ, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మెన్ కొండబాల కోటేశ్వరరావు, టెస్కాబ్ చైర్మెన్ కొండూరి రవీందర్‌రావు, ఎఫ్‌సీఐ చైర్మెన్ రాజేశంగౌడ్, వ్యవసాయ శాఖ కమిషనర్, విత్తనాభివృద్ధి సంస్థ ఎమ్‌డీ కటారి జగన్మోహన్, మార్క్‌ఫెడ్ చైర్మెన్ లోకబాపురెడ్డి, జగిత్యాల ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి, కలెక్టర్ శరత్ పాల్గొన్నారు.

కేసీఆర్ సోయితప్పి మాట్లాడుతున్నారు

- కమీషన్ల కక్కుర్తిలో ఎంపీ కవిత
- వచ్చే ఎన్నికల్లో బీజేపీదే అధికారం : బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి మురళీధర్‌రావు




నవతెలంగాణ-మల్లాపూర్

మైకు దొరికితే సీఎం కేసీఆర్ సోయితప్పి మాట్లాడుతున్నారని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి మురళీధర్‌రావు అన్నారు. రాబోయే ఎన్నికల్లో తెలంగాణాలో బీజేపీదే అధికారమని దీమా వ్యక్తం చేశారు. జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలంలోని ముత్యంపేట చెక్కర కర్మాగారం పునరుద్ధరణ కోసం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ధర్మపురి అరవింద్ ఆధ్వర్యంలో చేపట్టిన పాదయాత్రను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాక చెక్కర కర్మాగారాలను వంద రోజుల్లో స్వాధీనపర్చుకుంటామని చెప్పి కేసీఆర్ మాట తప్పారని విమర్శించారు. టీఆర్ఎస్‌తో బీజేపీ పొత్తుపెట్టుకునే ప్రసక్తే లేదన్నారు. 2019లో అధికారంలోకి వచ్చాక చెరకు రైతులను ఆదుకుంటామన్నారు. రాహుల్‌గాంధీ నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ మరింత అధ్వాన స్థితిలోకి వెళ్లిపోయిందన్నారు. ఎంపీ కవిత నియోజకవర్గంలోనే చెక్కర కర్మాగారాలు మూతపడుతుంటే సీఎం కేసీఆర్ నోరు మెదపకపోవడం సరికాదన్నారు. కమీషన్ల కోసం ఎంపీ కక్కుర్తి పడుతున్నారని ఆరోపించారు. మాజీ ఎమ్మెల్యే యెండల లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. రాష్ట్రంలో కార్మికులు, రైతులు చనిపోతుంటే వారిని ప్రభుత్వం ఆదుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో బీజేపీ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు బాజోజి భాస్కర్, చెరకు ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు మామిడి నారాయణరెడ్డి, పునరుద్ధరణ కమిటీ చైర్మెన్ రాజారెడ్డి పాల్గొన్నారు.

లెక్కలు తేల్చారు

జేఎఫ్‌సీ నివేదిక విడుదల

- 11 అంశాల ప్రస్తావన
- బకాయిలు రూ.74,542 కోట్లుగా ంచనా
- ప్రధానికి నివేదిక అందజేయాలని ర్ణయం



హైదరాబాద్: ప్రత్యేక హోదా, విభజన హామీల అమలులో ఏర్పడిన గందరగోళాన్ని ఛేదించేందుకు జనసేన అధినేత పవన్ కల్యాణ్ చొరవతో ఏర్పాటైన జాయింట్ ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీ (జేఎఫ్‌సీ) నివేదిక ప్రజల ముందుకొచ్చింది. సుదీర్ఘంగా చర్చించిన కమిటీ ఎట్టకేలకు లెక్కలు తేల్చింది. జేఎఫ్‌సీ తన నివేదికలో రాష్ట్ర ప్రభుత్వ కంటే కేంద్రాన్నే ఎక్కువ టార్గెట్ చేసినట్లుగా ఉంది. విభజన హామీల అమలులో కేంద్రం బాధ్యత ఎంత ఉందో, వాటిని సాధించుకోవాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపైనా అంతే ఉందని జేఎఫ్‌సీ నివేదిక స్పష్టం చేసింది. ప్రభుత్వ పెద్దలు రోజుకో ప్రకటన చేస్తూ ప్రజలను గందరగోళానికి గురి చేశారని, సమస్యల పరిష్కారానికి అటు కేంద్రం, ఇటు రాష్ట్ర ప్రభుత్వాలు చిత్తశుద్ధితో కృషి చేయలేదని పేర్కొంది. శనివారం హైదరాబాద్‌లో జేఎఫ్‌సీ కమిటీ సభ్యులు సమావేశమై తుది నివేదికను మీడియా ముందుం చారు. న్యాయంగా రావాల్సిన నిధుల్ని రాబట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని జేఎఫ్‌సీ తేల్చి చెప్పింది. కేంద్రం ప్రకటించిన స్పెషల్ ప్యాకేజీ కింద రావాల్సిన నిధుల్లో నయాపైసా రాలేదని స్పష్టం చేసింది. లోటు బడ్జెట్ కింద ఇవ్వాల్సిన రూ.14,333గాను రూ.4118 కోట్లే ఇచ్చారని చెప్పింది. అలాగే వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాలకు రూ.24,350 కోట్ల మేర ప్రతిపాదనలు పంపగా, అందులో రూ.2110 కోట్లు ఇచ్చి చేతులు దులుపుకుందని నివేదికలో పేర్కొంది. విభజన చట్టం ప్రకారం రూ.3820 కోట్ల ట్యాక్స్ రియంబర్స్‌మెంట్, విశాఖ-చెన్నై కారిడార్‌కు అవసరమైన రూ. 6000 కోట్లు, కాకినాడ పెట్రో కాంప్లెక్స్‌కు అవసరమైన రూ.5000 కోట్లు నేటికీ విడుదల చేయలేదని స్పష్టం చేసింది. ఇక విభజన చట్టం ప్రకారం రాష్ట్రానికి కేటాయించిన 11 జాతీయ విద్యా సంస్థలకు రూ.11,673 కోట్ల అంచనా వ్యయంలో ఇప్పటి వరకు కేవలం రూ.853 కోట్లు మాత్రమే ఇచ్చారని పేర్కొంది. పోలవరం ప్రాజెక్టుకు ఇచ్చిన నిధులు మినహాయించినా ఇంకా కేంద్రం ఇవ్వాల్సింది రూ.74,542 కోట్లని లెక్క తేల్చింది. ముఖ్యంగా విభజన చట్టం, పార్లమెంటు సాక్షిగా ప్రధాని మన్మోహన్ సింగ్ ఇచ్చిన ప్రత్యేక హోదా హామీని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేశాయని కమిటీ అభిప్రాయపడింది. లోటు బడ్జెట్‌లో భాగంగా ఉన్న రుణ విమోచన, పెన్షన్, డిస్కంల నష్టాల సర్దుబాటు, వేతన సంఘం బకాయిలపై రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ప్రతిపాదనల్ని బుట్టదాఖలు చేసిందని పేర్కొంది. వ్యవసాయ ఉత్పత్తిలోటు వ్యయం రూ.3,068.35 కోట్లు, రైతు సాధికార సమితి ఏర్పాటుకు రూ. 4001.32 కోట్లు, డిస్కం నష్టాల లోటు పూడ్చడానికి రూ.1500 కోట్లు, పెన్షన్‌ల కోసం రూ.3391.20 కోట్లు ఇవ్వాల్సి ఉండగా, వాటిని పక్కన పెట్టి కేవలం రూ.4117 కోట్లు ఇచ్చి చేతులు దులుపుకుందని పేర్కొంది.

హోదాతోనే ఏపీకి న్యాయం : పవన్ కల్యాణ్

ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇస్తేనే నూటికి నూరు శాతం న్యాయం జరుగుతుదని జనసేన అధినే పవన్ కల్యాణ్ అన్నారు. జేఎఫ్‌సీ సమావేశం అనంతరం కమిటీ సభ్యులతో కలిసి మీడియాతో మాట్లాడిన ఆయన విభజన చట్టంలో తక్షణం ప్రజలకు ఉపయోగపడే 11 అంశాలను జేఎఫ్‌సీ ముందుకు తెచ్చిందన్నారు. ప్రజలను గందరగోళానికి గురిచేయడంలో బీజేపీ, టీడీపీలకు సమాన వాటా ఉందన్నారు. సమస్యల పరిష్కారానికి అటు కేంద్రం, ఇటు రాష్ట్ర ప్రభుత్వం బాధ్యతతో పని చేయలేదన్నారు. ఇలాంటి పరిణామాలు మంచిది కాదని, సామాజిక అనిశ్చితికి, అస్థిరతకు దారితీసే ప్రమాదముందని హెచ్చరించారు. బీజేపీ, టీడీపీలు పుండుమీద కారం చల్లినట్లు పరస్పర విరద్ధ ప్రకటనలతో మరింత గందరగోళంలోకి నెట్టేశాయని మండిపడ్డారు. హోదానో, ప్యాకేజో సీఎం చంద్రబాబు తేల్చుకోలేకపోయారని, అంతటి అనుభవజ్ఞుడు అయోమయానికి గురైతే, ప్రజలకు ఎలా తెలుస్తుందన్నారు. నాలుగేళ్లుగా కేంద్రాన్ని ఎందుకు నిలదీయలేదని ప్రశ్నించారు. షెడ్యూల్ ప్రకారం పోలవరంను కేంద్రమే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. నిధులు, పనుల బాధ్యతను కేంద్రమే చూసుకోవాలని, పోలవరం ప్రాజెక్టు ముందుకెళ్లకపోతే ఆ బాధ్యత రాష్ట్రానిదేనన్నారు. రైల్వే జోన్ విషయంలోనూ ఇలాగే వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రం నుంచి ఏదడిగినా సాధ్యం కాదని చెబుతున్నారని, అలాంటప్పుడు రాష్ట్రాన్ని ఎలా విభజించారని నిలదీశారు. రాంవిలాస్ పాశ్వన్ సొంత ఊరు హాజీపూర్‌ను రైల్వే జోన్‌గా చేయగలిగినప్పుడు విశాఖను ఎందుకు చేయలేరని ప్రశ్నించారు. పార్లమెంట్‌లో ఇచ్చిన మాటను వెనక్కి తీసుకుంటే ప్రజల్ని పాలించే నైతిక హక్కు కోల్పోతారన్న సర్దార్ వల్లభాయిపటేల్ మాటల్ని ఒకసారి గుర్తు చేసుకోవాలని సూచించారు. దుగ్గరాజపట్నం పోర్టుకు పర్యావరణ సమస్యలు, భద్రతాసమస్యలు ఉన్నాయని కేంద్రం చెబుతోందని, ప్రత్యామ్నాయ ప్రదేశాన్ని చూపాలని రాష్ర ప్రభుత్వాన్ని అడిగితే ఇంత వరకు ఎందుకు చూపలేకపోయారో సమాధానం చెప్పాల్సిన అవసరముందన్నారు. కేంద్రంలో రాష్ట్రంలో బిజేపి, టిడిపిలే ప్రభుత్వాన్ని పంచుకుంటున్నాయని, అలాంటప్పుడు విభజన హామీలు నెరవేర్చడంలో ఉన్న సమస్యలేంటో అర్థం కావడం లేదన్నారు. సమస్యల పరిష్కారంలో అన్యాయం జరిగిందని ప్రజల్లో క్లారిటీ ఉన్నప్పుడు మీకెందుకు కనబడటంలేదని ప్రశ్నించారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గందరగోళ పరిస్థితులకు చరమగీతం పాడి స్పష్టత ఇవ్వాలని కోరారు. తాను ప్రజల పక్షమని, అవిశ్వాస తీర్మానం మార్చి 5న పెడితేనే నిబంధనల ప్రకారం పార్లమెంటులో చర్చకు వస్తుందన్నారు. మార్చి21న వైఎస్ఆర్ సిపి అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెడితే టిడిపి కచ్చింతంగా మద్దతు ఇవ్వాల్సిందేనని స్పష్టం చేశారు.

ఉన్నంతలో స్పష్టత ఇచ్చాం : జయప్రకాశ్ నారాయణ

జెఎఫ్‌సి ఇచ్చిన లెక్కలే తుది లెక్కలు కావని, తమకు సమాచారం ఉన్నంతలో స్పష్టత ఇచ్చే ప్రయత్నం చేశామని లోక్‌సత్తా వ్యవస్థాపక అధ్యక్షులు జయప్రకాశ్ నారాయణ అన్నారు. విభజన చట్టంలో తక్షణం ప్రజలకు అవసరమైన 11 అంశాల్లో 7 అంశాలు మాత్రమే చర్చకొచ్చాయని తెలిపారు. హక్కుగా రావాల్సినవి చాలా ఉన్నాయని, అందరం కలిసి రాష్ట్ర హక్కుల్ని కాపాడుకుందామని పిలుపునిచ్చారు. ప్రత్యేక హోదాతో రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని తేల్చి చెప్పారు.

ఎంవీ యాక్ట్ బిల్లుకు వ్యతిరేకంగా ధర్నాలు

- 6న కలెక్టర్ కార్యాలయాల ఎదుట

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకొస్తున్న మోటారు వాహన సవరణ చట్టం బిల్లుకు వ్యతిరేకం గా ఈనెల 6వ తేదీ కలెక్టర్ కార్యాలయాల ఎదుట ధర్నాలు నిర్వహించనున్నట్టు రోడ్ రవాణా కార్మిక సంఘాల సమన్వయ కమిటీ పిలుపునిచ్చింది. సీఐటీ యూ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన సమన్వయ కమిటీ సమావేశంలో వీఎస్‌రావు, పి.శ్రీకాంత్ (సీఐటీయూ) బి.వెంకటేష్, బి.కృష్ణమూర్తి (ఏఐటీ యూసీ), జి మల్లేష్‌గౌడ్ (ఐఎన్‌టీయూసీ), ఎ.నరేం దర్ (ఐఎఫ్‌టియూ), కె.నర్సింగరావు (టీఎన్‌టీ యూసీ), వి.కిరణ్(ఐఎఫ్‌టీయూ) తదితరులు పాల్గొ న్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డు రవాణారంగ కార్మికుల కుటుంబాలను ఛిద్రం చేసే ఎమ్‌వీ యాక్ట్ సవరణ బిల్లును కేంద్రప్రభుత్వం తక్షణం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. రాజ్యసభలో ఈ బిల్లుకు చర్చకు వస్తే, ఎంపీలంతా వ్యతిరేకంగా ఓటు వేయాలని డిమాండ్ చేశారు. బిల్లులో పేర్కొన్న అంశాలు అమల్లోకి వస్తే కార్మికు లతో పాటు ప్రజలపైనా తీవ్రమైన ఆర్థికభారాలు పడతాయని హెచ్చరించారు. పెట్రోల్, డీజిల్‌ను జీఎస్టీ పరిధిలోకి తేవాలని డిమాండ్ చేశారు. రవాణారంగం కార్మికుల కనీస వేతనం రూ.24వేలు ఇవ్వాలని కోరారు. ఈ బిల్లుకు వ్యతిరేకంగా ఈనెల 6వ తేదీ కలెక్టరేట్ల వద్ద జరిగే ధర్నాల్లో కార్మికులతో పాటు ప్రజలు కూడా భారీ సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

6న నిరసనల్లో పాల్గొనండి
ఆర్టీసీ కార్మిక సంఘాల పిలుపు

మోటారు వాహన చట్టం సవరణల బిల్లుకు వ్యతిరేకంగా ఈనెల 6వ తేదీ జరిగే దేశవ్యాప్త నిరసనల్లో ఆర్టీసీ కార్మి కులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని టీఎస్‌ఆర్టీసీ కార్మిక సం ఘాలు ఐక్యంగా పిలుపునిచ్చాయి. కార్మికుల నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరవ్వాలని, అన్ని డిపోలు, యూనిట్ల వద్ద భోజన విరామ సమయంలో నిరసన కార్యక్ర మాలు చేపట్టాలని పేర్కొన్నారు. టీఎస్‌ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (సీఐటీయూ) రాష్ట్ర కార్యదర్శి వీఎస్ రావు, ఎంప్లాయీస్ యూనియన్ (ఏఐటీయూసీ) ప్రధాన కార్యదర్శి కె రాజిరెడ్డి, స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఐఎన్‌టీయూసీ) ప్రధాన కార్యదర్శి జి అబ్రహం, కార్మిక పరిషత్ ప్రధాన కార్యదర్శి బి యాదగిరి, సూపర్‌వైజర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వాసుదేవరావు ఓ సంయుక్త ప్రకటన విడుదల చేశారు. అన్ని కార్మిక సంఘాలు కలిసి ఐక్యంగా ఆందోళనల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఇదే అంశంపై ఈనెల 20వ తేదీ హైదరాబాద్‌లో రాష్ట్ర సదస్సును నిర్వహిస్తున్నట్టు వివరించారు.

సంస్కృతిని పరిరక్షించుకుందాం

మంత్రి చందూలాల్

- తెలుగు వర్సిటీ ప్రతిభా పురస్కారాలు ప్రదానం



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ సంస్కృతిని పరిరక్షించు కుందామని గిరిజన, సాంస్కృతిక శాఖ మంత్రి అజ్మీరా చందూ లాల్ చెప్పారు. శనివారం హైదరాబాద్‌లో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం తెలుగు భాషా, సాహిత్యం, సంస్కృతి, జర్నలిజం, కళా ప్రక్రియల్లో విశిష్ట సేవలందించిన వారికి ప్రతిభా పురస్కారాలను ఆయన ప్రదానం చేశారు. ఈ సందర్భంగా చందూ లాల్ మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతిని గౌరవించే సంప్రదాయం తెలుగు విశ్వవిద్యాలయానికి ఉందని, దాన్ని కొనసాగించాలని సూచించారు. తెలంగాణ భాష, యాస, సంస్కృతి, సంప్రదాయాల వ్యాప్తి కోసం ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యేక శ్రద్ధ వహించా రని చెప్పారు. వాటి అభివృద్ధికి అవసరమైన నిధులు కేటాయిస్తామని అన్నారు. ఇటీవల జరిగిన ప్రపంచ తెలుగు మహాసభలకు విశేష గుర్తింపు వచ్చిందన్నా రు. కళాశాల విద్యాశాఖ కమిషనర్ నవీన్ మిట్టల్ మాట్లాడుతూ కళలు, సాహిత్యాన్ని కాపాడ్డంలో తెలుగు విశ్వవిద్యాలయం ప్రముఖ పాత్ర పోషిస్తోం దని చెప్పారు. పైరవీలకు తావులేకుండా ప్రతిభ ఉన్న వారిని గుర్తించి ప్రతిభా పురస్కారాలు ప్రకటించడం అభినందనీయమని అన్నారు. అధ్యక్షత వహించిన తెలుగు విశ్వవిద్యాలయం ఉపకులపతి ఎస్వీ సత్యనారాయణ మాట్లాడుతూ ప్రతిభా పురస్కారాల ఎంపిక ప్రక్రియ పారదర్శకంగా జరిగిందని చెప్పారు. ప్రతిభా పురస్కారాలు అందుకున్న వారిలో వసంతరావు దేశ్‌పాండే (నవల/కథ), వేణు సంకోజు (కవిత్వం), నియోగి (విమర్శ), మాసురామ్ రవికాంత్ (చిత్రకళ), శివరామాచారి (శిల్పకళ), డాక్టర్ వనజా ఉదయ్ (నృత్యం), కెఎస్ఆర్ బాలకృష్ణ శాస్త్రి (సంగీతం), అయ్యదేవర పురుషోత్తమరావు (నాటకరంగం), అంగళకుర్తి రామమూర్తి (జానపద కళారంగం), డాక్టర్ జిఎం రామశర్మ (అవధానం), అయినంపూడి శ్రీలక్ష్మి (ఉత్తమ రచయిత్రి) తదితరులున్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కవి ఏనుగు నర్సింహ్మారెడ్డి, తెలుగు విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ అలేఖ్య తదితరులు పాల్గొన్నారు.

'కార్పస్' దోపిడీ



ఫైల్

వడ్డీతో చెల్లించాలని నోటీసులు

- చెల్లించకుంటే నిత్యావసర కనెక్షన్స్ కట్
- సౌకర్యాలు కల్పించకుండానే నిర్వహణ భారం
- ఆందోళనలో రాజీవ్ స్వగృహ లబ్దిదారులు

రాజీవ్ స్వగృహలో నిర్వహణ పేరుతో కార్పస్ ఫండ్ వసూలుకు సిద్ధమైంది సర్కార్. ఉమ్మడి రాష్ట్రంలో బకాయిల పేరుతో వడ్డీ వసూలు చేసిన విషయం విదితమే. ఇప్పుడేమో కార్పస్ ఫండ్ పేరుతో సర్కార్ లబ్దిదారులకు నోటీసులు జారీ చేసింది. కార్పస్ ఫండ్‌ను వడ్డీతో చెల్లించాలని పేర్కొంది. చెల్లించకపోతే కరెంట్, వాటర్ కనెక్షన్లు కట్ చేస్తామని హెచ్చరికలు జారీచేసింది. దీంతోపాటు ఫ్లాట్స్ యజమానులతో సంప్రదించకుండానే నిర్వహణ ఛార్జీలూ పెంచారు. మధ్యతరగతి ప్రజల సొంతింటి కల నిజం చేస్తామని చెప్పిన ప్రభుత్వం సౌకర్యాలు కల్పించకుండా ఫీజుల పేరుతో దండుకుంటోందని లబ్దిదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నవతెలంగాణ - హైదరాబాద్ సిటీబ్యూరో

గ్రేటర్ హైదరాబాద్ శివారు ప్రాంతాలైన పోచారంలో సద్భావన, చందానగర్‌లో ఆరంభ్, బండ్లగూడలో సద్భావన, గాజులరామారంలో సహీరా, జవహర్‌నగర్‌లో అభిమాన్, బహదూర్‌పల్లిలో విశిష్ట పేరుతో రాజీవ్ స్వగృహ వెంచర్లలో సింగిల్, డబుల్, త్రిబుల్ బెడ్ రూమ్ ఇండ్లను నిర్మించారు. ఘట్‌కేసర్‌లోని పోచారంలో సర్వేనెంబర్ 35లోని 30 ఎకరాల్లో రూ.405 కోట్లతో సద్భావన పేరుతో రాజీవ్ స్వగృహ సముదాయాన్ని నిర్మించారు. సద్భావన వెంచర్‌లో 19 టవర్స్‌లో 1650 ఫ్లాట్లు ఉన్నాయి. వీటిలో మూడు పడక గదుల ఇండ్లు 126, రెండున్నర పడక గదులు 72, రెండు పడక గదుల ఇండ్లు 972, సింగిల్ బెడ్‌రూమ్ ఇండ్లు 480 ఉన్నాయి. అందులో 180 ఇండ్లు మాత్రమే కొనుగోలు చేశారు. మిగిలినవన్నీ ఖాళీగానే ఉన్నాయి. వీటి మెయింటెనెన్స్ భారం కూడా అక్కడున్న లబ్దిదారులపైనే వేసేందుకు సిద్ధమయ్యారు.

కార్పస్ ఫండ్ ఇలా..

టౌన్‌షిప్ నిర్వహణ కోసం ఏపీ అపార్ట్‌మెంట్ (ప్రమోషన్ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ అండ్ ఓనర్‌షిప్ యాక్టు) 1987 యాక్టులోని సెక్షన్ 21 ప్రకారం.. కార్పస్ ఫండ్ చెల్లించాలని, లేకుంటే నీరు, కరెంట్ కనెక్షన్లు తొలగిస్తామని తెలంగాణ రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ లిమిటెడ్ లబ్దిదారులకు నోటీసులు ఇచ్చింది. అయితే, కార్పస్ ఫండ్ చెల్లించాలని నిబంధనల్లో ఉన్న ఫ్లాట్‌ను కేటాయించినప్పటి నుంచి (31 జనవరి 2013) అది చెల్లించాలని అధికారులు ఫిబ్రవరిలో నోటీసులు జారీ చేశారు. 31 జనవరి 2013 నుంచి 31 జనవరి 2018 అంటే ఐదేండ్లకు సంబంధించిన కార్పస్ ఫండ్‌ను ఏడాదికి 18 శాతం వడ్డీతో చెల్లించాలని పేర్కొన్నారు. ఈ లెక్కన సింగిల్ బెడ్‌రూమ్‌కు రూ.25,700, డబుల్ బెడ్‌రూమ్‌కు రూ.30,050, రెండున్నర బెడ్‌రూమ్‌కు రూ.57,500, త్రిబుల్ బెడ్‌రూమ్‌కు రూ.72,500 చెల్లించాలి. దీంతోపాటు నిర్వహణ పేరుతో చదరపు గజానికి రూ.1.1 వసూలు చేస్తున్నారు. దీన్ని కూడా 24 పైసలు పెంచారు.

సౌకర్యాల లేమి

రాజీవ్ స్వగృహ ఫ్లాట్లను కొనుగోలు చేసేటప్పుడు సకల సౌకర్యాలు కల్పిస్తామని ప్రభుత్వం చెప్పింది. భారీ టవర్స్ కావడంతో ఓటీఎస్ లిఫ్ట్ పెడతామని అధికారులు చెప్పారు. కానీ దానికి బదులు యాపిల్ కంపెనీ చెందిన లిఫ్ట్ ఏర్పాటు చేశారు. దీంతో రెండు లిఫ్టులు పడిపోయాయని లబ్దిదారులు చెబుతున్నారు. గేటెడ్ కమ్యూనిటీ అని చెప్పారు తప్ప ఇప్పటివరకు ప్రహరీ నిర్మించలేదు. ఫలితంగా పాములు, కుక్కలు వస్తున్నాయి. దొంగలు కూడా పడ్డారు. ప్రతి ఫ్లాట్‌కు పైపులైన్ ద్వారా గ్యాస్ కనెక్షన్ ఇస్తామని, 10 శాతం మందికి మాత్రమే ఇచ్చారు. సోలార్ వాటర్ హీటర్లను పట్టించుకోవడం లేదు. వీధిదీపాలు పనిచేయడం లేదు. కరెంట్ బిల్లు ఎక్కువగా వస్తుందని పాడైన వాటికి మరమ్మతులు చేయడం లేదు. షాపింగ్ కాంప్లెక్స్ జాడే లేదు. యాంపీ థియేటర్ ఊసేలేదని లబ్దిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కార్పస్ ఫండ్ అసోసియేషన్ ఖాతాలోనే..
శ్రీనివాస్, జనరల్ మేనేజర్

కార్పస్ ఫండ్‌ను అసోసియేషన్ ఖాతాల్లోనే జమ చేస్తాం. ఎన్నికల తర్వాత వాళ్లే నిర్వహించుకుంటారు. బహిరంగ మార్కెట్‌లో పెరుగుతున్న రేట్ల ఆధారంగా నిర్వహణ ఛార్జీలు పెంచాం. నిర్వహణ ఖర్చు నెలకు రూ.6 లక్షలు అవుతుంది. ఖాళీగా ఉన్న ఫ్లాట్లకు సంబంధించిన ఛార్జీలను కార్పొరేషన్ భరిస్తుంది.

సౌకర్యాలు కల్పించండి : జనరల్ మేనేజర్‌కు వినతి

సద్భావన టౌన్‌షిప్‌లో సౌకర్యాలు కల్పించకుండా కార్పస్ ఫండ్ చెల్లించాలని నోటీసులు ఇవ్వడం సరైందికాదని సద్భావన ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు మహిపతి శ్రీనివాస్‌రావు అన్నారు. ఖాళీగా ఉన్న 90 శాతం ఫ్లాట్ల నిర్వహణ భారం కూడా తమపై వేస్తున్నారని, దీన్ని తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు తెలంగాణ రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ లిమిటెడ్ జనరల్ మేనేజర్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు.

టీఆర్టీ పరీక్షలు నేడే ఆఖరు

- చివరిరోజు 1,01,312 మంది దరఖాస్తు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణలో ఉపాధ్యాయ నియామక పరీక్ష (టీఆర్టీ) రాతపరీక్షలు ఆదివారంతో ముగియనున్నాయి. గతనెల 24వ తేదీన ప్రారంభమైన టీఆర్టీ రాతపరీక్షలు ఆదివారం ఆఖరు కానున్నాయి. 8,792 ఉపాధ్యాయ పోస్టులకు 2.77 లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసిన విషయం తెలిసిందే. శనివారం ఆన్‌లైన్‌లో జరిగిన స్కూల్ అసిస్టెంట్ పలు సబ్జెక్టులకు తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) నిర్వహించిన రాతపరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఈ మేరకు టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి ఎ వాణీప్రసాద్ శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. శనివారం ఉదయం హెచ్‌ఎండీఏ పరిధిలో రెండు కేంద్రాల్లో స్కూల్ అసిస్టెంట్ సోషల్ స్టడీస్, బయోసైన్స్, మ్యాథమెటిక్స్ సబ్జెక్టులకు (హిందీ, కన్నడ, మరాఠీ, తమిళం) మాధ్యమం అభ్యర్థులు 1,604 మంది దరఖాస్తు చేయగా, 1,328 (82.9 శాతం) మంది హాజరయ్యారని తెలిపారు. శనివారం మధ్యాహ్నం హెచ్‌ఎండీఏ పరిధిలో ఒక కేంద్రంలో స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ సైన్స్ (ఇంగ్లీష్ మాధ్యమం) అభ్యర్థులు 622 మంది దరఖాస్తు చేస్తే, 391 (62 శాతం) మంది రాశారని పేర్కొన్నారు. టీఆర్టీ రాతపరీక్షలను కమాండ్ కంట్రోల్ కేంద్రం ద్వారా పర్యవేక్షిస్తున్నామని తెలిపారు.

నేడు ఆఫ్‌లైన్‌లో స్కూల్ అసిస్టెంట్, ఆన్‌లైన్‌లో పీఈటీ

టీఆర్టీ రాతపరీక్షల్లో భాగంగా ఆదివారం ఆన్‌లైన్‌లో స్కూల్ అసిస్టెంట్, ఆన్‌లైన్‌లో ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్ (పీఈటీ) రాతపరీక్షలు జరుగుతాయని టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి ఎ వాణీప్రసాద్ తెలిపారు. చివరి రోజు రికార్డు స్థాయిలో 1,01,312 మంది అభ్యర్థులు హాజరుకానున్నారు. ఆదివారం ఉదయం తొమ్మిది కేంద్రాల్లో స్కూల్ అసిస్టెంట్ సోషల్ స్టడీస్, బయోసైన్స్, మ్యాథమెటిక్స్ సబ్జెక్టులకు దరఖాస్తు చేసిన (తెలుగు మాధ్యమం) అభ్యర్థులు 1,00,417 మంది దరఖాస్తు చేశారని తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం హెచ్‌ఎండీఏ పరిధిలో మూడు కేంద్రాల్లో పీఈటీ (ఇంగ్లీష్ మీడియం) రాతపరీక్షలు ఆన్‌లైన్‌లో జరుగుతాయని పేర్కొన్నారు. పీఈటీ పరీక్షకు 895 మంది అభ్యర్థులు రదఖాస్తు చేశారని తెలిపారు. పూర్తి వివరాలకు టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు.

హాల్‌టికెట్లలో తప్పులపై అభ్యర్థుల ధర్నా

టీఆర్టీ హాల్‌టికెట్లలో తప్పులు రావడం పట్ల కొందరు అభ్యర్థులు శనివారం టీఎస్‌పీఎస్సీ కార్యాలయం ముందు ధర్నా చేశారు. హాల్‌టికెట్లను సరిచేయాలని నినాదాలు చేశారు. మీడియం, సబ్జెక్టు, పర్సెంటేజీ, విద్యార్హతలు ఇలా పలు తప్పులు దొర్లడంతో అభ్యర్థులు టీఎస్‌పీఎస్సీ కార్యాలయం వద్ద బైఠాయించారు. పోలీసులు వచ్చి అభ్యర్థులను అరెస్టు చేసి చార్మినార్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. శనివారం ఉమ్మడి హైకోర్టుకు సెలవు కావడంతో అభ్యర్థులు నిరాశ చెందారు. కోర్టును ఆశ్రయించే అవకాశమూ లేకుండా పోయింది. ఆదివారమే చివరి పరీక్ష కావడంతో అభ్యర్థులకు ఏంచేయాలో పాలుపోవడం లేదు. తెలియక చేసిన తప్పులకు తాము నష్టపోవాల్సిందేనా?అని ప్రశ్నిస్తున్నారు.

దేశవ్యాప్తంగా 3.25 కోట్ల కేసులు పెండింగ్‌లోనే..

- పరిష్కారం కోసం ప్రత్యామ్నాయ మార్గాలను ప్రోత్సహించాలి: హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేష్ రంగనాథన్

నవతెలంగాణ - శామీర్‌పేట

'దేశవ్యాప్తంగా 3.25 కోట్ల కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. వాటి పరిష్కారానికి 300 ఏండ్లు పడుతుంది. కేసుల సత్వర పరిష్కారం కోసం ప్రత్యామ్నాయ మార్గాలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది' అని హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి, నల్సార్ యూనివర్సిటీ ఛాన్సలర్ రమేష్ రంగనాథన్ అన్నారు. శనివారం మేడ్చల్ జిల్లా శామీర్‌పేటలోని నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయంలో 16వ స్నాతకోత్సవం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఎడీఆర్, ఎఫ్‌డీఆర్ ప్రొఫెసర్లను సన్మానించి పట్టభద్రులకు పీజీ డిప్లొమా పట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ..ప్రతిరోజు 150 వరకు కేసులు పరిష్కారమవుతున్నా అదనంగా కేసులు వస్తున్నాయన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో 12.35 లక్షల కేసులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. కోర్టులలో పెండింగ్‌లో ఉన్న కేసుల సత్వర పరిష్కారం కావాలంటే మధ్యవర్తిత్వం అవసరం చాలా ఉందన్నారు. లోక్ అదాలత్‌లో కొన్ని కేసులు పరిష్కారమవుతున్నాయని తెలిపారు. న్యాయ వ్యవస్థలో కోర్టులు, జడ్జీలు తక్కువగా ఉన్నందున, కావాల్సిన సౌకర్యాలు లేక కేసులు పెండింగ్‌లో పడుతున్నాయని వివరించారు. న్యాయ వ్యవస్థలో కోర్టుల సంఖ్య పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ఏడీఆర్, ఎఫ్‌డీఆర్ కోర్సులలో డిప్లొమా పూర్తిచేసిన న్యాయవాదులు మధ్యవర్తిత్వాన్ని వహించి న్యాయ వ్యవస్థకు సహకరించాలని సూచించారు. పీజీ డిప్లొమా ఇన్ ఏడీఆర్ రెగ్యులర్ కోర్సులో సయ్యద్ ముజీబ్-బంగారు, కె.ప్రవీణ్‌కుమార్-వెండి పతకాలు సాధించారు. ఈ కార్యక్రమంలో నల్సార్ వైస్ ఛాన్సలర్ ఫైజాన్ ముస్తాఫా, నల్సార్ రిజిస్టార్ బాలకిష్టారెడ్డి, నల్సార్ ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.



తొలగింపుపై ఇంకా నిర్ణయం తీసుకోలేదు..

హెచ్-1బీ భాగస్వాములకు తాత్కాలిక ఊరట

వాషింగ్టన్: హెచ్-1బీ వీసాదారుల భాగస్వాములను ఉద్యోగాల నుంచి తొలగించే విషయంపై ఇంకా నిర్ణయం తీసుకోలేదని ట్రంప్ యంత్రాగం వెల్లడించింది. దీంతో పెద్ద సంఖ్యలో అక్కడ పనిచేస్తున్న భారతీయ ఉద్యోగులు, వారి కుటుంబాలకు ఊరట లభించినట్టయ్యింది. ఈ మేరకు డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోంల్యాండ్ సెక్యూరిటీ(డీహెచ్ఎస్) ప్రకటించింది. "హెచ్4 వీసాల మీద వివిధ కంపెనీల్లో పనిచేస్తున్న హెచ్-1బీ వీసా దారుల భాగస్వాములను ఉద్యోగాల నుంచి తొలగించే నిర్ణయంపై జూన్ వరకు ఎటువంటి నిర్ణయమూ తీసుకోబోం. వాళ్లని తొలగించాలని తీసుకునే నిర్ణయం దేశంపై ఆర్థికంగా ఎటువంటి ప్రభావం చూపుతుందనే దాన్ని పరిశీలించాల్సి ఉంది. అందువల్ల అప్పటి వరకు హెచ్-1బీ భాగస్వాముల ఉద్యోగాలకు ఎటువంటి ఇబ్బందులు ఉండవు" అని డీహెచ్ఎస్ వెల్లడించింది.

2015లో అప్పటి ఒబామా ప్రభుత్వం హెచ్-1బీ వీసాదారుల భాగస్వాములు, గ్రీన్‌కార్డు కోసం ఎదురుచూసే వారి భార్య/భర్తలు యూఎస్‌లోని వివిధ కంపెనీల్లో హెచ్-4 డిపెండెంట్ వీసాల కింద పనిచేసేందుకు అవకాశం కల్పిస్తూ ఓ విధానాన్ని తీసుకొచ్చారు. అయితే.. దాన్ని ఫిబ్రవరి 28 నుంచి తొలగిస్తామని ట్రంప్ ప్రభుత్వం ప్రకటించింది. కానీ, ఇప్పుడు హెచ్-4వీసాదారుల తొలగింపుపై సరైన నిర్ణయం తీసుకోలేదని అందుకు కొద్దిగా సమయం పడుతుందని అక్కడి ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఈ విధానంలో గణనీయమైన మార్పులు చేయాల్సి ఉందని.. వాటిని ఆర్థికపరంగా కూడా పూర్తిగా విశ్లేషించిన తర్వాతే నిర్ణయం తీసుకుంటామని డీహెచ్ఎస్ పేర్కొంది.

అమెరికా తూర్పు తీరాన్ని కుదిపేసిన తుఫాను

- ఐదుగురు మృతి
- అంధకారంలో 17లక్షల గృహాలు



బోస్టన్ : అమెరికా తూర్పు తీరాన్ని శుక్రవారం అత్యంత శక్తివంతమైన తుఫాను కుదిపివేయడంతో ఐదుగురు మరణించారు. శీతాకాలంలో చెలరేగిన ఈ తుఫాను తీవ్రత కారణంగా బలమైన గాలులు, భారీ వర్షాలతో పరిస్థితి అస్తవ్యస్థంగా తయారైంది. మంచు కూడా విపరీతంగా కురుస్తుండడంతో రహదారులు మూసుకుపోయాయి. ఓహియో, న్యూయార్క్‌లో కొన్ని ప్రాంతాల్లో ఒక అడుగు మేరా, బోస్టన్, రోడ్ ఐల్యాండ్‌ల్లో రెండు నుండి ఐదు అంగుళాల మేర మంచు పేరుకుపోయింది. వేలాది విమానాల రాకపోకలకు ఆటంకం కలిగింది. వాషింగ్టన్ డిసిలోని పలు ప్రభుత్వ కార్యాలయాలు కూడా మూతపడ్డాయి. తుపాను కారణంగా అమెరికాలోని ఈశాన్య ప్రాంతంలో, మధ్య పశ్చిమ ప్రాంతంలో దాదాపు 17లక్షల ఇండ్లు వ్యాపార సంస్థలు అంధకారంలో మగ్గుతున్నాయి. 3 వేల విమాన సర్వీసులు రద్దయ్యాయి. న్యూజెర్సీ నుండి మసాచుసెట్స్ వరకు తూర్పు తీరమంతా వరద హెచ్చరికలు జారీ చేశారు. ఈశాన్య ప్రాంతం నుండి మధ్య అట్లాంటిక్ ప్రాంతాల వరకు ప్రచండమైన గాలులు వీస్తాయని వాతావరణ శాఖ తెలియచేసింది.

చైనా ఆర్థిక అభివృద్ధి నమూనా ఇతర దేశాలకు ఆదర్శం

- కంబోడియా నిపుణుడు కిన్ ఫె

నాంఫెన్ : ఆర్థిక వ్యవస్థను మెరుగుపర్చుకోవటంలో, అవినీతిపై పోరు సల్పడంలో చైనా ఇతర దేశాలకు 'రోల్ మోడల్'గా నిలిచిందని కంబోడియా నిపుణుడు కిన్ ఫె వ్యాఖ్యానించారు. చైనీస్ పీపుల్స్ పొలిటికల్ కన్సల్టేటివ్ కాన్ఫరెన్స్ (సిపిపిసిసి) జాతీయ కమిటీ సమావేశం శనివారం నుండి, నేషనల్ పీపుల్స్ కాన్ఫరెన్స్ (ఎన్‌పిసి) సోమవారం నుండి ప్రారంభమవుతున్న తరుణంలో కంబోడియాలోని రాయల్ అకాడమీలో అంతర్జాతీయ సంబంధాల సంస్థ డైరెక్టర్ జనరల్‌గా వున్న కిన్ ఫె ఒక ఇంటర్వ్యూలో పై వ్యాఖ్యలు చేశారు. గత 40ఏండ్ల కాలంలో చైనా అమలు చేస్తున్న ఆర్థిక విధానాలు, సంస్కరణలు ఫలితాల్ని నేడు చైనా ప్రజలే కాకుండా, మొత్తం ప్రపంచం చూస్తోందని, ప్రపంచ పురోగతికి చోదక శక్తిగా ఉపయోగపడిందని ఆయన పేర్కొన్నారు. చైనా విజయవంతంగా అనుసరిస్తున్న ఆర్థికాభివృద్ధి నమూనా ఇతర దేశాలకు ఆదర్శంగా నిలుస్తోందని అన్నారు.

అంతరిక్ష పరిశోధనపై సంయుక్త సమాచార కేంద్రం

- రష్యా, చైనా మధ్య ఒప్పందం



మాస్కో/బీజింగ్ : చంద్రుడు, రోదసీలపై లోతుగా పరిశోధనలు చేపట్టే ప్రాజెక్టులకు ఉమ్మడిగా డేటా సెంటర్‌ను ఏర్పాటు చేసేందుకు రష్యా, చైనాల మధ్య అంగీకారం కుదిరిందని రష్యా రోదసీ సంస్థ రస్కోమాస్ ప్రకటించింది. ఈ ప్రాజెక్టుల్లో రష్యా, చైనా శాస్త్ర, పారిశ్రామిక సంస్థలు, కంపెనీల ప్రమేయం వుంటుందని పేర్కొంది. ఇందుకు సంబంధించి ఇరు దేశాలు పరస్పరం సహకరించుకునేందుకు ఒప్పందంపై రస్కోమాస్, చైనా నేషనల్ స్పేస్ అడ్మినిస్ట్రేషన్ (సిఎన్ఎస్ఎ) సంతకాలు చేశాయి. ఇరు దేశాల లూనార్ కార్యక్రమాలకు పరస్పరం సాయం అందించుకునే అవకాశాలను కూడా ఈ దేశాలు పరిశీలిస్తాయి. 2022లో రష్యన్ లూనా - 26 ఆర్బిటర్‌ను ప్రయోగించే ప్రాజెక్టు, అలాగే 2023లో చంద్రుని దక్షిణ ధృవంపై దిగాలన్న చైనా ప్రతిపాదిత ప్రాజెక్టులపై రెండు దేశాలు పరస్పరం సహకరించుకుంటాయి.

ట్రంప్ నిర్ణయాన్ని వ్యతిరేకించిన ఐఎంఎఫ్!



జెర్రీ రైస్

వాషింగ్టన్: ఉక్కు, అల్యూమినియంపై దిగుమతి సుంకం పెంచుతూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకున్న నిర్ణయాన్ని అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ (ఐఎంఎఫ్) వ్యతిరేకించింది. దిగుమతి సుంకం భారీగా పెంచడం వల్ల దాని ప్రభావం అమెరికా వెలుపలే కాకుండా అమెరికా ఆర్థిక వ్యవస్థపైనా ప్రభావం చూపుతుందని ఐఎంఎఫ్ హెచ్చరించింది. ఈ నిర్ణయం వల్ల అమెరికాలోని తయారీ, నిర్మాణ రంగాలపై కూడా తీవ్ర ప్రభావం పడుతుందని ఐఎంఎఫ్ అధికార ప్రతినిధి జెర్రీ రైస్ హెచ్చరించారు. ఉక్కుపై 25 శాతం, అల్యూమినియంపై 10శాతం దిగుమతి సుంకం పెంచుతూ ట్రంప్ నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. దీనికి సంబంధించిన ఆదేశాలపై వచ్చే వారం సంతకాలు జరుగుతాయని ఉక్కు, అల్యూమినియం కంపెనీ ప్రతినిధులతో జరిగిన సమావేశం అనంతరం ట్రంప్ వెల్లడించారు. వాణిజ్యంలో అడ్డంకులు తొలగించుకునేందుకు అమెరికా, దాని వాణిజ్య భాగస్వామ్య దేశాలు కలసి నిర్మాణాత్మకంగా పనిచేయాలని కోరుకుంటున్నామన్నారు. ఇలాంటి నిర్ణయాలు లేకుండా వాణిజ్యంలో సమస్యలను పరిష్కరించుకోవాలని జెర్రీ రైస్ వెల్లడించారు. ట్రంప్ తీసుకున్న ఈ నిర్ణయం వల్ల దానితో కీలక భాగస్వాములైన కెనడా, యూరప్, ఆస్ట్రేలియా, మెక్సికో, చైనా దేశాలు ఆగ్రహంగా ఉన్నాయి. ట్రంప్ విధించిన ఈ దిగుమతి సుంకం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని కెనడా, జర్మనీ పేర్కొన్నాయి. అయితే ట్రంప్ మాత్రం తన నిర్ణయాన్ని సమర్థించుకుంటున్నారు. వాణిజ్య యుద్ధాలు మంచివేనని, వాటిని గెలవడమూ సులువేనని అంటున్నారు. ఏదైనా దేశంతో వాణిజ్యం చేయడం వల్ల బిలియన్ల డాలర్ల మేర నష్టం కలుగుతుంటే వాణిజ్య యుద్ధం చేయడం మంచిదేనని పేర్కొన్నారు. అమెరికా తమ దేశాన్ని, తమ కార్మికులను కాపాడుకుంటుందని అన్నారు.

వెస్ట్ బ్యాంక్ , గాజాల్లో ఘర్షణలు

- గాయపడ్డ పలువురు పాలస్తీనియన్లు



గాజా/రమల్లా : వెస్ట్ బ్యాంక్, గాజాల్లో ఇజ్రాయిల్ సైనిక బలగాలతో జరిగిన ఘర్షణల్లో డజన్ల సంఖ్యలో పాలస్తీనియన్లు గాయపడ్డారని వైద్య వర్గాలు, ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. శుక్రవారం ప్రార్ధనలు ముగిసిన తర్వాత ఘర్షణలు చెలరేగాయి. జెరూసలేంను ఇజ్రాయిల్ రాజధానిగా ట్రంప్ ప్రకటించిన నేపథ్యంలో శుక్రవారం నిరసన దినంగా పాటిస్తూ పాలస్తీనీయులు ప్రదర్శన నిర్వహించారు. రమల్లాకు ఉత్తరంగా బెలిన్ గ్రామంలో ప్రదర్శకులు, ఇజ్రాయిలీ సైనికుల మధ్య భీకరంగా ఘర్షణలు జరిగాయని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. నిరసనకారులు రాళ్లు విసరగా, సైనికులు బాష్పవాయు గోళాలను, రబ్బర్‌తూటాలను ప్రయోగించారు.

పొరబాటుగా...మరో రోగికి బ్రెయిన్ సర్జరీ



నైరోబీ: ఆపరేషన్ చేసి కత్తెర కడుపులోనే మర్చిపోవడం.. కుడికాలికి బదులుగా ఎడమకాలికి శస్త్రచికిత్స చేయడం.. ఇలాంటి వార్తలు అప్పుడప్పుడూ వింటుంటాం. వైద్యుల నిర్లక్ష్యం కారణంగా ఇలాంటివి జరుగుతుంటాయి. ఇదంతా ఒక ఎత్తయితే.. ఏకంగా ఒకరికి బదులుగా మరో రోగికి ఆపరేషన్ చేశారు కెన్యాలోని కొందరు వైద్యులు. అది కూడా బ్రెయిన్ సర్జరీ(మెదడు శస్త్రచికిత్స). నాలుగు గంటల పాటు ఆపరేషన్ చేసిన తర్వాత తాము పొరబాటు చేశామని వైద్యులు గుర్తించడం గమనార్హం. గత ఆదివారం జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

కెన్యాలోని అతిపెద్ద ఆసుపత్రి అయిన కెన్యట్ట నేషనల్ హాస్పిటల్‌లో గతవారం ఇద్దరు రోగులు చేరారు. ఒకరు మెదడులో గడ్డతో, మరొకరు తల వాపుతో చికిత్స నిమిత్తం ఆసుపత్రికి వచ్చారు. మెదడులో గడ్డ ఉన్న వ్యక్తికి సర్జరీ చేసి దాన్ని తొలగించాల్సి రావడంతో అక్కడి సిబ్బంది ఆ ఏర్పాట్లు చేశారు. అయితే ఆపరేషన్ గదిలోకి ఆ వ్యక్తిని కాకుండా పొరబాటుగా తల వాపుతో బాధపడుతున్న వ్యక్తిని తీసుకొచ్చారు.

డాక్టర్లు కూడా చూసుకోకుండా రెండో వ్యక్తికే సర్జరీ మొదలుపెట్టారు. నాలుగు గంటల పాటు ఆపరేషన్ చేసి పుర్రెను తెరవగా.. అందులో ఎలాంటి గడ్డ కనబడలేదు. కంగు తిన్న వైద్యులు తాము తప్పు చేశామని గ్రహించి వెంటనే అతడికి తిరిగి కుట్లు వేసి అబ్జర్వేషన్‌లో పెట్టారు. ఇది కాస్తా మీడియాకు తెలియడంతో విషయం వెలుగులోకి వచ్చింది. దీంతో సదరు ఆసుపత్రిపై సోషల్‌మీడియాలో విమర్శలు వెల్లువెత్తాయి. వెంటనే స్పందించిన వైద్యాధికారులు ఒక డాక్టర్, ఇద్దరు నర్సులు, అనస్థీటిస్ట్‌ను సస్పెండ్ చేశారు. ఆసుప్రతి సీఈవోను కూడా విధుల నుంచి తొలగించారు. అయితే ప్రస్తుతం ఆపరేషన్ చేసిన రోగి కోలుకున్నట్లు ఆసుపత్రి ఓ ప్రకటనలో తెలిపింది.

భద్రాచలానికి మావోయిస్టుల మృతదేహాలు

హైకోర్టు ఆదేశాల మేరకు పోస్టుమార్టం పూర్తి

- మళ్లీ కాల్పుల కలకలం...
- టీఆర్ఎస్ నాయకులపై దాడులు చేస్తాం : జగన్ లేఖ

నవతెలంగాణ-భద్రాచలం

ఎన్‌కౌంటర్‌లో మృతిచెందిన వారిలో ముఖ్యనేతలు ఉన్నట్టు సాగిన ప్రచారంతో రెండోరోజు శనివారమూ భద్రాచలంలో ఉత్కంఠ కొనసాగింది. హెలికాప్టర్ ద్వారా మిగిలిన మృతదేహాలను భద్రాచలం ఏరియా ఆస్పత్రికి పోలీసులు తీసుకొచ్చారు. శుక్రవారం తీసుకొచ్చిన రెండు మృతదేహాలు భద్రాచలంలోనే ఉన్నాయి. హైకోర్టు ఆదేశాల మేరకు ఫోరెన్సిక్ నిపుణులు, సీనియర్ డాక్టర్ల సమక్షంలో పోస్టుమార్టం, వీడియో చిత్రీకరణ చేయించారు. బంధువులు వచ్చేవరకు మృతదేహాలను భద్రపరిచేందుకు ఫ్రీజర్లను ఏర్పాటు చేశారు. మాజీ మావోయిస్టుల సహకారంతో మృతుల్లో ఇద్దరిని గుర్తించారు.


మీడియాతో మాట్లాడుతున్న ఎస్పీ అంబర్ కిషోర్ ఝా

అందులో వరంగల్ జిల్లా ఖాజీపేట మండలం రాంపూర్ గ్రామానికి చెందిన దడబోయిన స్వామి అలియాస్ ప్రభాకర్ ఉన్నాడు. బీఏ బీఎడ్ చదువుకున్నాడు. 14 ఏండ్లుగా అజ్ఞాతంలో పనిచేస్తున్నాడు. మిగతా వారు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన వారు.

మళ్లీ కాల్పుల కలకలం...

మళ్లీ ఎదురుకాల్పులు జరుగుతున్నాయన్న వార్తలు కలకలం సృష్టించాయి. పూజారి కాంకేడ్ సమీపంలోని కోడిపుంజుల గుట్ట వద్ద శనివారం పోలీసు బలగాలకు, మావోయిస్టులకు ఎదురుకాల్పులు జరుగుతున్నట్టు వార్తలొచ్చాయి. శుక్రవారం ఎన్‌కౌంటర్ జరిగిన ప్రాంతానికి కొద్దిదూరంలోనే పెద్దపెద్ద గుట్టలున్నాయి. ఎన్‌కౌంటర్ అనంతరం తప్పించుకున్న మావోయిస్టులు ఆ గుట్టల్లోనే ఉంటారనే అనుమానంతో పోలీసు బలగాలు ఆ గుట్టలను చుట్టుముట్టినట్టు వార్తలొచ్చాయి. అయితే ఈ వార్తలను పోలీసులు ధ్రువీకరించలేదు.

ప్రతీకారం తీర్చుకుంటాం.. : లేఖలో జగన్

ఎన్‌కౌంటర్‌పై మావోయిస్టు పార్టీ తెలంగాణ అధికార ప్రతినిధి జగన్ శనివారం స్పందించారు. ఈ మేరకు ఓ లేఖను మీడియాకు విడుదల చేశారు. మావోయిస్టులు ప్రజలతో మాట్లాడుతూ సేద తీరుతున్న సమయంలో ఒక ద్రోహి ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు తమపై ఏకపక్షంగా కాల్పులు జరిపారని పేర్కొన్నారు. పోలీసులు ప్రచారం చేస్తున్నట్టు ఎన్‌కౌంటర్‌లో హరిభూషణ్, బడే చొక్కారావు, కంకణాల రాజిరెడ్డి చనిపోలేదని, చనిపోయిన 10 మందిలో జిల్లా కమిటీ సభ్యులు హన్మకొండ మండలం రాంపూర్ గ్రామానికి చెందిన దడబోయిన స్వామి అలియాస్ ప్రభాకర్, రత్న ఉన్నారన్నారు. మిగిలిన వారు అంతా ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా, దంతెవాడ జిల్లాకు చెందిన వారని లేఖలో పేర్కొన్నారు. కార్పొరేట్ శక్తులకు నీళ్లు, భూమిని ధారాదత్తం చేసేందుకు నియంతలా వ్యవహరిస్తున్న కేసీఆర్ ఈ విధమైన బూటకపు ఎన్‌కౌంటర్లు చేయిస్తున్నారని అన్నారు. ఎన్‌కౌంటర్‌కు ప్రతీకారం తీర్చుకుంటామని, ఇకపై తాము టీఆర్ఎస్ నాయకులపై దాడులను ముమ్మరం చేస్తామని లేఖలో పేర్కొన్నారు. హిందూత్వ నాయకుడు రమణ్‌సింగ్, నియంత కేసీఆర్‌లు కలిసి ఆదివాసీలపైనా, ప్రశ్నించే వారిపైనా దుర్మార్గపూరిత దాడులకు పాల్పడుతున్నారన్నారు. ఎన్‌కౌంటర్ తర్వాత చనిపోయింది ఎవరో తెలిసినప్పటికీ పోలీసులు గందరగోళం సృష్టించడం కోసమే అబద్దాలు ప్రచారం చేశారని పేర్కొన్నారు. ముఖ్యమైన నాయకులు చనిపోయారని ప్రచారం చేసి ప్రజల మనోధైర్యాన్ని దెబ్బతీసే ప్రయత్నం చేశారన్నారు. కార్పొరేట్ శక్తులకు వనరులను దోచిపెట్టడం కోసం తెలంగాణ, ఏపీ, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వాలతోపాటు కేంద్ర ప్రభుత్వం మావోయిస్టు పార్టీ నిర్మూలనే లక్ష్యంగా దాడులు చేయిస్తున్నాయని పేర్కొన్నారు. ప్రజల సహకారంతో ఈ దాడులను తిప్పికొడతామని లేఖలో పేర్కొన్నారు.

ఒక్కరే తెలంగాణవాసి.. : ఎస్పీ

భద్రాచలంలోని ఎఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ అంబర్ కిషోర్ ఝా మృతుల వివరాలు వెల్లడించారు. ఒక్కరు మినహా మిగిలిన 9 మంది ఛత్తీస్‌గఢ్‌కు చెందిన వారున్నారన్నారు. చనిపోయిన వారిలో అగ్రనేతలు లేరని చెప్పారు. మృతుల వివరాలు కింది విధంగా ఉన్నాయి.

1.దడబోయిన స్వామి అలియాస్ ప్రభాకర్, జిల్లా కమిటీ సభ్యులు, వరంగల్	
2.ఐతు, దళసభ్యుడు,	తిప్పాపురం
3.బుద్రి, దళ సభ్యుడు,	సింగం
4.రమె, ఏరియా కమిటీ సభ్యురాలు,	వీరాపురం
5.మల్లేశ్, సీఆర్‌సీ ఎ సెక్షన్ కమాండర్,	ఇంద్రావతి
6.కమల, దళ సభ్యురాలు,	వెస్ట్ బస్తర్
7.కోసి, సీఆర్‌సీ దళ సభ్యురాలు,	రంగాయిగూడెం
8.రత్న, దళ సభ్యురాలు,	బీజాపూర్
9.సుక్కి, దళ సభ్యురాలు,	గంగ్లూర్
10.సోంబి, దళ సభ్యురాలు,	తిప్పాపురం

ఇంటర్ పరీక్షకు 20 వేల మంది గైర్హాజరు

- 10 మందిపై మాల్‌ప్రాక్టీస్ కేసు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఇంటర్మీడియెట్ ఇంగ్లీష్ పేపర్-1 పరీక్షకు 20,516 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా ఇంటర్ ఇంగ్లీష్ పేపర్-1 పరీక్షకు 4,93,996 మంది దరఖాస్తు చేయగా, 4,73,480 మంది విద్యార్థులు హాజరయ్యారని ఇంటర్ బోర్డు కార్యదర్శి ఎ అశోక్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంగ్లీష్ పరీక్షకు హాజరైన విద్యార్థుల్లో 10 మందిపై మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదయ్యాయని పేర్కొన్నారు. నిర్మల్‌లో ఒకరు, భద్రాద్రి కొత్తగూడెంలో ముగ్గురు, మెదక్‌లో ఒకరు, సూర్యాపేటలో ఒకరు, మహబూబ్‌నగర్‌లో నలుగురు చొప్పున మొత్తం 10 మంది విద్యార్థులపై మాల్‌ప్రాక్టీస్ కేసులు పెట్టామని తెలిపారు. శనివారం ఇంటర్ పరీక్ష సజావుగా నిర్వహించేందుకు స్క్వాడ్‌లు, పరిశీలకులు నిరంతరం పర్యవేక్షించారని పేర్కొన్నారు. ఇంటర్ బోర్డు నుంచి పరిశీలకులు మెదక్, మహబూబ్‌నగర్, సూర్యాపేట, నల్లగొండ, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి జిల్లాల్లో పర్యటించారని తెలిపారు. ఇంగ్లీష్ పేపర్-1 ప్రశ్నాపత్రంలో రెండు తప్పులు దొర్లినట్లు తెలిసింది. ఇంగ్లీష్ ఒకేషనల్‌లో I-rels అని ప్రచురితమైంది. వాస్తవానికి L-rels అని అధికారులు మార్చడంతో విద్యార్థులకు ఇబ్బంది తలెత్తలేదు. I-just- (receive) a call అని తప్పుగా ప్రచురితమైంది. I just as- (receive) a call అని అధికారులు సరిదిద్దడంతో విద్యార్థులు సరైన సమాధానం రాసేందుకు వీలైంది.

నాలుగేండ్ల అభివృద్ధి ఫలితమిది : బండారు దత్తాత్రేయ

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ప్రధాని నరేంద్రమోడీ నాలుగేండ్ల అభివృద్ధి ఫలితంగానే ఈశాన్య రాష్ట్రాల్లో విజయం సాధించగలిగామని కేంద్ర మాజీ మంత్రి, పార్లమెంటు సభ్యులు బండారు దత్తాత్రేయ అన్నారు. ఈ విజయం చారిత్రాత్మకమని, త్రిపురలో 23 ఏండ్ల వామపక్ష కంచుకోటను బీజేపీ బద్దలు కొట్టిందని అన్నారు. ఇప్పుడు దేశవ్యాప్తంగా బీజేపీ హవా నడుస్తోందని, కాంగ్రెస్‌ను దేశప్రజలు విశ్వసించట్లేదని ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో సంబురాలు

ఈ శాన్య రాష్ట్రాల్లో బీజేపీ విజయం సాధించడం పట్ల తెలంగాణ బీజేపీ నేతలు సంతోషం వ్యక్తం చేశారు. నాంపల్లిలోని ఆపార్టీ రాష్ట్ర కార్యాలయంలో మిఠాయిలు పంచుకొని, బాణాసంచా కాల్చి సంబురాలు చేసుకున్నారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కె.లక్ష్మణ్, శాసనసభాపక్షనేత జి. కిషన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు రాజాసింగ్, చింతల రాంచంద్రారెడ్డి, ఎన్‌వీఎస్ ఎస్ ప్రభాకర్, ఎమ్మెల్సీ ఎన్ రాంచంద్రరావు తదితరులు ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. ఈశాన్య రాష్ట్రాల్లో వీచిన బీజేపీ పవనాలే రాష్ట్రంలోనూ పునరావృతమౌతాయని చెప్పారు. తెలంగాణలో అధికారం లోకి రావడానికి పార్టీ కేంద్ర నాయకత్వం, ప్రధాని మోడీ తీవ్రంగా శ్రమిస్తున్నారని, ఆదిశగానే రాష్ట్రంలో తమ కార్యక్రమాలు జరుగుతున్నాయని చెప్పారు.

దళిత వ్యతిరేకి సీఎం కేసీఆర్ : బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.లక్ష్మణ్

సీఎం కేసీఆర్ దళిత వ్యతిరేకి అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కె. లక్ష్మణ్ అన్నారు. శనివారం నల్లగొండ జిల్లా నకిరేకల్‌లో ఆపార్టీ అసెంబ్లీ కన్వీనర్ మండల వెంకన్న అధ్యక్షతన దళిత్ అదాలత్ బహిరంగ సభ నిర్వహించారు.

'బిల్డర్‌ను బెదిరించి తక్కువ ధరకే ఫ్లాట్'

నవ తెలంగాణ- ప్రత్యేక ప్రతినిధి

అవినీతికి పాల్పడి కోట్ల రూపాయల అక్రమాస్తులను కూడబెట్టిన హెచ్ఎండీఏ ప్లానింగ్ డైరెక్టర్ కట్టా పురుషోత్తంరెడ్డి, అతని బావమరిది శ్రీనివాస్‌రెడ్డిలపై ఏసీబీ అధికారులు మరో క్రిమినల్ కేసును నమోదు చేశారు. ఏసీబీ డీజీ జె.పూర్ణచంద్రరావు శనివారం తెలిపిన వివరాల ప్రకారం.. కొండాపూర్‌లోని ప్రెస్టేజ్ రియల్‌ఎస్టేట్ కంపెనీకి చెందిన 3031 చదరపు గజాల ఫ్లాట్‌ను రూ. 2 కోట్లకు బదులుగా రూ.1.13 లక్షలకే ఇవ్వాలని కంపెనీ వైస్ ప్రెసిడెంట్‌ను 2015 లో కట్టాతో పాటు శ్రీనివాస్‌రెడ్డిలు బెదిరించారు. ఒక వేళ తాము కోరిన విధంగా చేయక పోతే ప్లానింగ్ సెక్షన్ డైరెక్టర్‌గా ఇక ముందు ఎలాంటి అనుమతులు మీ కంపెనీకి రాకుండా చూస్తానని బెదిరించారు. దీంతో చేసేది లేక బలవంతంగా అగ్రిమెంట్‌కు కంపెనీ వైస్ ప్రెసిడెంట్ ఒప్పుకున్నాడు.

ఎమ్మార్పీఎస్ బంద్ సందర్భంగా

13న ఇంటర్ పరీక్ష వాయిదా వేయండి

- ఉప ముఖ్యమంత్రి కడియంకు విద్యార్థి సంఘాల వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఎస్సీ వర్గీకరణ చేయాలని కోరుతూ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) ఆధ్వర్యంలో ఈనెల 13న జరిగే రాష్ట్రబంద్ సందర్భంగా అదేరోజు నిర్వహించే ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షను వాయిదా వేయాలని తెలంగాణ రాష్ట్ర విద్యార్థి సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు శనివారం హైదరాబాద్‌లో ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరిని విద్యార్థి సంఘాల ఐక్యవేదిక ప్రతినిధి బృందం కలిసి వినతిపత్రం సమర్పించింది. అనంతరం రుద్రవరం లింగస్వామి (ఎంఎస్‌ఎఫ్), ఎం తిరుపతి (ఎస్‌ఎఫ్‌ఐ), ఎం పరుశురాం (పీడీఎస్‌యూ), వేణు (ఏఐఎస్‌ఎఫ్), సమీర్ (టీవీఎస్), జూపాక శ్రీనివాస్ (పీడీఎస్‌యూ), మద్దిలేటి (టీవీవీ), రియాజ్ (పీడీఎస్‌యూ-వి), బద్రి (డీఎస్‌యూ), జె అంజి (బీసీఎస్‌యూ), కృష్ణమాదిగ (టీఎస్‌యూ), దర్శన్ (డీబీఎస్‌ఏ), పల్లెర్ల సుధాకర్, విజయ్, కొమ్ము శేఖర్, గోవిందు నరేష్ (ఎంఎస్‌ఎఫ్) సంయుక్తంగా ఓ ప్రకటన విడుదల చేశారు. ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించడంలో కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిరసనగా ఈనెల 13న ఎమ్మార్పీఎస్ చేపట్టే రాష్ట్రబంద్‌కు ఈ బంద్‌కు రాజకీయ పార్టీలు, విద్యార్థి, కుల, ప్రజాసంఘాలు, ప్రజాస్వామిక వాదులు మద్దతు ప్రకటించారని పేర్కొన్నారు. ఈనెల 13న జరిగే పరీక్షను వాయిదా వేసి బంద్‌కు సహకరించాలని తెలిపారు.

బంద్ సందర్భంగా రవాణా వ్యవస్థ స్తంభించడం వల్ల విద్యార్థులు సకాలంలో పరీక్షకు హాజరుకాలేక ఇబ్బందులు ఎదుర్కొంటారని పేర్కొన్నారు. సానుకూల దృక్పథంతో ఆలోచించి బంద్ రోజు జరిగే ఇంటర్ పరీక్షను వాయిదా వేయాలని కోరారు.



పరీక్ష వాయిదాను పరిశీలిస్తాం : కడియం

ఎమ్మార్పీఎస్ బంద్ సందర్భంగా ఈనెల 13న జరిగే ఇంటర్ పరీక్షను వాయిదా వేయాలన్న అంశాన్ని పరిశీలిస్తామని ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి విద్యార్థి సంఘాల నాయకులకు హామీ ఇచ్చారు. విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని నిర్ణయం తీసుకుం టామని అన్నారు.



'ఛల్ మోహన్ రంగ'లో నితిన్

ఫస్ట్‌లుక్ సోమవారం..మాట కలిపే మంగళవారం..

నితిన్, మేఘా ఆకాష్ జంటగా 'ఛల్ మోహన్ రంగ' చిత్రంలో నటిస్తున్నారు. త్రివిక్రమ్ కథ అందించిన ఈ చిత్రాన్ని కృష్ణ చైతన్య దర్శకత్వంలో నిఖితా రెడ్డి సమర్పణలో పవన్ కళ్యాణ్ క్రియేటివ్ వర్క్స్, త్రివిక్రమ్, శ్రేష్ట్ మూవీస్ పతాకాలపై ఎన్.సుధాకర్‌రెడ్డి నిర్మిస్తున్నారు. ఇటీవల విడుదలైన ఈ సినిమాలోని మొదటి పాట 'గ.. ఘ.. మేఘ..' శ్రోతల మన్ననలు పొందుతోంది. తాజాగా 'ఫస్ట్ లుక్కు సోమవారం.. మాట కలిపే మంగళవారం..' అంటూ సాగే రెండో పాటను శనివారం విడుదల చేశారు. అందుకు తగ్గట్టుగానే ఈ చిత్ర ఫస్ట్‌లుక్‌ను ఫిబ్రవరి 12 సోమవారం రోజున విడుదల చేసిన విషయం విదితమే. 'వారం' పాట విడుదల చేసిన సందర్భంగా చిత్ర దర్శకుడు మాట్లాడుతూ, "గ..ఘ..మేఘ' పాటతో జనాలకి మరోసారి మంచి మెలోడి అందించిన థమన్ ఈసారి మంచి డాన్స్ నెంబర్‌ను అందించారు. ఆయన పాటల్లో ట్యూన్‌కి ఎంత ప్రాధాన్యత ఉంటుందో, ఇన్‌స్ట్రుమెంట్స్‌కి కూడా అంతే ప్రాముఖ్యత ఉంటుంది. అందుకే ఆయన పాటలు ఆడియెన్స్ మదిని దోచుకుంటాయి. అలాంటి సంగీతానికి మంచి సాహిత్యం తోడైతే ఆ పాట జనాల హృదయాల్లో ఎక్కువ రోజులు నిలుస్తుంది. వారంలో ఏడు రోజులుంటే ఒక్కో రోజుకి ఒక్కో ప్రత్యేకత ఉందంటూ తనదైన చమత్కార శైలిలో సాహిత్య అవార్డు గ్రహీత కేధారనాథ్ ఈ పాటను రచించారు. నాకాష్ అజీజ్ తన స్వరంతో పాటను శ్రోతలకి మరింత చేరువ చేశారు. సంగీతం, సాహిత్యం కలబోతగా ఈ చిత్రంలోని పాటలుంటాయి' అని అన్నారు.

'అన్ని వర్గాల ప్రేక్షకులకు కావాల్సిన అన్ని రకాల హంగులున్న ఈ సినిమాను ఏప్రిల్ 5న విడుదల చేయనున్నాం' అని నిర్మాత తెలిపారు. కె.వి.నరేష్, లిజి, రోహిణి హట్టంగడి, రావు రమేష్, సంజయ్ స్వరూప్, ప్రభాస్ శ్రీను, నర్రా శ్రీను, మధునందన్, ప్రగతి, సత్య, పమ్మి సాయి, రాజశ్రీ నాయర్, ఆశురెడ్డి, వెన్నెల రామారావు, కిరీటి, రణధీర్, నీలిమ భవాని, బేబి హాసిని, బేబి కృతిక, మాస్టర్ జాయ్, మాస్టర్ లిఖిత్, మాస్టర్ స్నేహిత్, మాస్టర్ స్కందన్ తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: ఎన్.నటరాజ సుబ్రమణియన్, ఎడిటింగ్: ఎస్.ఆర్.శేఖర్.



'కణం' చిత్రంలో ఒక దృశ్యం

జో లాలి జో..

నాగశౌర్య, సాయిపల్లవి జంటగా 'కణం' చిత్రంలో నటిస్తున్నారు. విజయ్ దర్శకత్వం వహించిన ఈ సినిమా ఎన్.వి.ఆర్. సినిమా సమర్పణలో లైకా ప్రొడక్షన్స్ పతాకంపై తెరకెక్కుతుంది. సినిమాలోని మొదటి పాట ఇటీవల విడుదలైన నేపథ్యంలో తాజాగా రెండో పాటను రిలీజ్ చేశారు. 'జో లాలి జో..' అంటూ సాగే ఈ పాట బాగా ఆకట్టుకుంటోంది. తల్లీకూతుళ్ళ అనుబంధం నేపథ్యంలో రూపొందిన చిత్రమిది. సాయిపల్లవి తల్లిగా, భార్యగా నటించింది. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసి త్వరలోనే సినిమాను విడుదల చేసేందుకు చిత్ర బృందం ప్లాన్ చేస్తుంది. నిరవ్‌షా, శ్యామ్ సి.ఎస్., ఎల్.జయశ్రీ, స్టంట్ సిల్వ, ఆంటోని, విజయ్, సత్య, పట్టణం రషీద్, ఎం.ఆర్.రాజకృష్ణన్, కె.మణివర్మ, రామసుబ్బు, సప్న షా, వినయదేవ్, మోడేపల్లి రమణ, కె.భార్గవి, ప్రత్యూష, ఎస్.ఎం.రాజ్‌కుమార్, ఎస్.శివశరవణన్, షియామ్ తదితరులు ఈ సినిమాకు పనిచేస్తున్న సాంకేతికవర్గం.



విజయ్‌దేవరకొండ, శివాని సింగ్

కొత్త కాన్సెప్ట్‌తో ఏ మంత్రం వేసావె..

విజయ్ దేవరకొండ, శివాని సింగ్ జంటగా సురక్ష్ ఎంటర్‌టైన్‌మెంట్స్ ఇండియా ప్రై.లి మల్కాపురం శివకుమార్ సమర్పణలో గోలిసోడా ఫిల్మ్ ప్రొడక్షన్స్ పతాకంపై శ్రీధర్ మర్రి స్వీయ దర్శకత్వంలో తెరకెక్కించిన చిత్రం 'ఏ మంత్రం వేసావె'. ఈ నెల 9న సినిమాను విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ సందర్భంగా శనివారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో మల్కాపురం శివకుమార్ మాట్లాడుతూ, "ఎవడే సుబ్రమణ్యం', 'పెళ్ళి చూపులు', 'అర్జున్‌రెడ్డి' చిత్రాలతో విజయ్ దేవరకొండ మంచి పేరు తెచ్చుకున్నారు. 'అర్జున్‌రెడ్డి' హిట్ తర్వాత ఆయన్నుంచి వచ్చే సినిమాపై అంచనాలుంటాయి. ఆ అంచనాలను అందుకునేలా తాజా సినిమా ఉంటుంది. ఇది పెద్ద విజయం సాధించి మా బ్యానర్‌లో, శ్రీధర్ కెరీర్‌లో నిలిచిపోయే సినిమా అవుతుంది. థియేటర్ల బంద్ సమస్య పరిష్కారం అయితే ఈ నెల 9న విడుదల చేస్తాం. కాకపోతే మరో తేదీన రిలీజ్‌కు ప్లాన్ చేస్తాం. సినిమాకు సంబంధించి ప్రింట్ పోయి, డిజిటల్ వచ్చింది. క్యూబ్, యుఎఫ్ఓ, పిఎక్స్‌డీ వంటి సంస్థలు థియేటర్ల యాజమానులతో అగ్రిమెంట్ కుదుర్చుకుని తమ ప్రొజెక్టర్లను అమర్చారు. ఐదేండ్లకే ఫీజు పరిమితమని చెప్పి ఇప్పటికీ కూడా తగ్గించడం లేదు. సర్వీస్ రూపంలో వచ్చి దొంగలుగా మారి దోచుకుంటున్నారు. వారు దిగొచ్చేంత వరకు మా పోరాటం సాగుతుంది. థియేటర్ల బంద్‌కు దక్షిణాది చిత్ర పరిశ్రమలన్నీ కలిసి రావడం అభినందనీయం' అని అన్నారు. దర్శక, నిర్మాత శ్రీధర్ మాట్లాడుతూ, 'రెగ్యులర్ తెలుగు చిత్రాలకు భిన్నంగా, కొత్త కాన్సెప్ట్‌తో, కొత్త తరహా మేకింగ్‌తో రూపొందించిన చిత్రమిది. ప్రస్తుతం యువత అంతా ఆల్కాహాల్ కన్నా ఎక్కువగా టెక్నాలజీకి అడిక్ట్ అవుతున్నారు. అలా వీడియో గేమ్స్‌కు అడిక్ట్ అయిన కుర్రాడిని ఆన్‌లైన్‌లో పరిచయమైన ఓ అమ్మాయి ఎలా మార్చింది. రియల్ ప్రపంచంలోకి ఎలా తీసుకొచ్చిందనేది సినిమా. రొమాంటిక్ థ్రిల్లర్‌గా సాగే ఈ చిత్రం ఫ్యామిలీ ఆడియెన్స్ అందరికీ కనెక్ట్ అవుతుంది. మానవ సంబంధాలు తగ్గిపోతున్న ప్రస్తుత రోజుల్లో వాటి ప్రాధాన్యత తెలిపేలా సినిమా ఉంటుంది. సెన్సార్ సభ్యుల ప్రశంసలందుకుని క్లీన్ యు సర్టిఫికెట్ పొందింది. ప్రేక్షకుల అంచనాలను రీచ్ అవుతుందని నమ్ముతున్నాం. సినిమా నచ్చి విడుదల చేస్తున్న మల్కాపురం శివకుమార్‌కు థ్యాంక్స్' అని చెప్పారు.

ఏ నిమిషానికి ఏమి జరుగునో..



నాగ అన్వేష్

నాగ అన్వేష్ హీరోగా శ్రీకృష్ణ గొర్లె దర్శకత్వంలో షో టైం స్టూడియో సమర్పణలో గణేష్ క్రియేషన్స్ పతాకంపై లండన్ గణేష్ నిర్మిస్తున్న నూతన చిత్రం 'ఏ నిమిషానికి ఏమి జరుగునో'. వి.వి.వినాయక్, టీడీపీ నాయకులు రమణ అతిథులుగా ఈ సినిమా పూజా కార్యక్రమం శనివారం హైదరాబాద్‌లోని రామానాయుడు స్టూడియోలో జరిగింది.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో నిర్మాత లండన్ గణేష్ మాట్లాడుతూ, 'టైటిల్‌కు తగ్గట్టుగానే ఏ నిమిషానికి ఏమి జరుగునో అన్నట్టుగా సినిమా ఆద్యంతం మలుపులతో సాగుతుంది. డిఫరెంట్ కాన్సెప్ట్‌తో రూపొందించే ఈచిత్రానికి డైనమిక్ హీరో నాగ అన్వేష్ అయితే యాప్ట్ అని భావించి ఆయన్ని ఎంపిక చేసుకున్నాం. నా స్నేహితుడు నాగేశ్వరరావు సహకారంతో సినిమాను నిర్మిస్తున్నాను. తప్పకుండా ప్రేక్షకాదరణ పొందుతుందని ఆశిస్తున్నా' అని అన్నారు. 'మంచి కథ కావడంతో ఇందులో భాగస్వామినయ్యాను. మూడు పాటలుంటాయి. ఫారిన్, సిటీ, ఫారెస్ట్ ఇలా 3 షెడ్యూల్‌లో చిత్రీకరణ పూర్తి చేయనున్నాం. కొత్త కథ కనుక ఆడియెన్స్‌కు నచ్చి తీరుతుందని ఆశిస్తున్నా' అని మరో నిర్మాత వి.నాగేశ్వరరావు తెలిపారు. హీరో నాగ అన్వేష్ చెబుతూ, 'స్క్రిప్ట్ చాలా ఆసక్తికరంగా ఉంది. టాలీవుడ్‌లో ఇదొక డిఫరెంట్ సబ్జెక్ట్‌గా నిలుస్తుంది. అందరికి నచ్చుతుందని భావిస్తున్నా' అని చెప్పారు. 'సైన్స్ ఫిక్షన్ నేపథ్యంలో ఈ సినిమాను రూపొందించబోతున్నాం. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ వర్క్ జరుగుతోంది. త్వరలోనే రెగ్యులర్ షూటింగ్‌ను ప్రారంభిస్తాం' అని దర్శకుడు తెలిపారు.

అన్నదాత సుఖీభవ దాసరికి అంకితం



ఆర్.నారాయణమూర్తి

ఆర్.నారాయణమూర్తి రూపొందిస్తున్న తాజా చిత్రం 'అన్నదాత సుఖీభవ'. స్నేహా చిత్ర పిక్చర్స్ పతాకంపై తెరకెక్కుతున్న 30వ చిత్రమిది. చిత్రీకరణ పూర్తి చేసుకుని విడుదలకు సిద్ధమవుతున్న ఈ సినిమా గురించి శనివారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆర్.నారాయణమూర్తి మాట్లాడుతూ, 'పొద్దు తనని తాకక ముందే శిలువలా నాగల్ని మోసుకు వెళ్ళే కరుణామయుడు రైతు. అందరూ అన్నదాత సుఖీభవ అంటారు. కానీ ఇప్పుడు రైతు పరిస్థితి అన్నదాత దుఖీభవ అయ్యింది. పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక రైతు విలవిలలాడుతున్నాడు. ప్రస్తుతం సమాజంలో వెనకబడిన వారు ఎవరైనా ఉన్నారంటే అది రైతులే.

ఇటీవల కాలంలో సుమారు మూడు లక్షల 25వేల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. రైతు ఆత్మహత్యలను నివారించడానికి 2007లో స్వామినాథన్ కమిటీని ఏర్పాటు చేశారు. స్వామినాథన్ కొత్త వంగడాలను కనిపెట్టేందుకు కృషి చేశారు. అంతేకాదు రైతు బాగుండాలంటే పెట్టిన పెట్టుబడితో పాటు 50శాతం అధికంగా గిట్టుబాటు ధర కల్పించాలని స్వామినాథన్ కమిటీ సిఫార్సు చేసింది. కానీ ఇప్పటికీ అమలు పర్చడం లేదు. దాన్ని అమలు పర్చాలని తెలిపేదే ఈ చిత్రం. వ్యవసాయం దండగ కాదు, పండగ అని చెప్పేదే ఈ సినిమా ప్రధాన ఇతివృత్తం. ఇప్పటికైనా వెంటనే పార్లమెంట్‌లో ఆ బిల్లును ప్రవేశపెట్టి అమలు చేయాలని కేంద్రప్రభుత్వాన్ని ఈ సినిమా ద్వారా డిమాండ్ చేస్తున్నాం. ఇందులో గద్దర్, వంగపండు, గోరేటి వెంకన్న అద్భుతమైన పాటలు రాశారు. వంగపండు రాసిన 'అన్నదాత.. ' పాటను ఎస్పీ బాలసుబ్రమ్మణ్యం అంతే అద్భుతంగా పాడారు. సినిమా షూటింగ్ పూర్తి చేసుకుని సెన్సార్‌కు రెడీ అవుతోంది. థియేటర్ల బంద్ పూర్తయిన తర్వాత సినిమాను విడుదల చేస్తాం. ఈ చిత్రాన్ని మా గురువుగారు దాసరికి అంకితమిస్తున్నాం.

మనకు బంద్ అనేది బ్రహ్మాస్త్రం లాంటిది. డిజిటల్ ప్రొవైడర్ల దోపిడికి వ్యతిరేకంగా చేపడుతున్న బంద్ విజయవంతం అవుతుండటం ఆనందంగా ఉంది. కార్పొరేట్ వారికి వ్యతిరేకంగా దక్షిణాదిలో అన్ని చిత్ర పరిశ్రమలు కలిసి కట్టుగా, ఒక్కతాటిపై పోరాడాలని కోరుకుంటున్నా. వర్చువల్ ప్రింట్ ఫీజు తగ్గించేంత వరకు ఈ బంద్‌ను కొనసాగించాలి. ప్రభుత్వం జోక్యం చేసుకుని సమస్యను వెంటనే పరిష్కరించాలి' అని అన్నారు.



దీపికా పదుకొనె

ఫస్ట్ ర్యాంక్ సెలబ్రిటీ..!

టైమ్స్ సెలెబెక్స్ మంత్‌లీ రేటింగ్ ఇండెక్స్ 'టీ స్కోర్' టాప్ 50 ర్యాంక్స్‌లోని కథానాయికల విభాగంలో బాలీవుడ్ నటి దీపికా పదుకొనె మొదటి స్థానంలో నిలవడం విశేషం ఓ విషయమైతే హీరోల విభాగంలో రణ్‌వీర్ సింగ్ ప్రథమ స్థానంలో నిలవడం మరో విశేషం. ఈ ఏడాది జనవరి నుంచి పత్రికలు, టీవీ, ఆన్‌లైన్ మీడియా, వారి సినిమాల కలెక్షన్లు, నటన, ప్రకటనలు, పాపులారిటీ ఇలా విభిన్న అంశాలను ప్రధానంగా తీసుకుని నిర్వహించిన సర్వే ఆధారంగా ఈ ర్యాంక్‌లను నిర్ణయించారు. కథానాయికల విభాగంలో దీపికా తర్వాత సోనమ్ కపూర్, అలియా భట్, అనుష్క శర్మ, ప్రియాంక చోప్రా, శ్రద్ధా కపూర్, జాక్వెలిన్, పరిణీతి చోప్రా, సోనాక్షి సిన్హా, బిపాసా బసు తొలి పది ర్యాంకులను దక్కించుకున్నారు. కత్రీనా కైఫ్ 16వ ర్యాంక్, రకుల్ ప్రీత్ సింగ్ 18వ స్థానంలో నిలవగా, ఐశ్వర్యరాయ్ 37వ ప్లేస్‌తో వెనుక పడ్డారు. హీరోల విభాగంలో రణ్‌వీర్ సింగ్ తర్వాత వరుసగా షాహిద్ కపూర్, అక్షయ్ కుమార్, సల్మాన్ ఖాన్, షారూఖ్ ఖాన్, అమితాబ్ బచ్చన్, హృతిక్ రోషన్, రాజ్ కుమార్ రావ్, సిద్ధార్థ్ మల్హోత్రా, వరుణ్ ధావన్ తొలి పది ర్యాంకులను దక్కించుకున్నారు. మిస్టర్ ఫర్‌ఫెక్ట్ అమీర్ ఖాన్ 11వ స్థానానికి పరిమితం కాగా, రజనీకాంత్ 16వ స్థానంలో, రానా 37వ స్థానంలో నిలిచారు. ఇటీవల 'పద్మావత్' చిత్రంతో దీపికా మెప్పించిన విషయం విదితమే.

ఖాకి జోడీ నయా సినిమా షురూ..

గతేడాది 'ఖాకి' చిత్రంతో మంచి విజయాన్ని అందుకుంది రకుల్ ప్రీత్ సింగ్. పోలీస్ ఇన్వెస్టిగేషన్ నేపథ్యంలో రూపొందిన ఈ చిత్రంలో కార్తీ సరసన కథానాయికగా నటించింది. తాజాగా ఈ జోడీ మరోసారి సిల్వర్ స్క్రీన్‌పై మ్యాజిక్ చేయనుంది. వీరిద్దరి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న నూతన తమిళ చిత్ర షూటింగ్ శనివారం ప్రారంభమైంది. యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందుతున్న ఈ చిత్రానికి నూతన దర్శకుడు రజత్ రవిశంకర్ దర్శకత్వం వహిస్తున్నారు. ప్రిన్స్ పిక్చర్స్ పతాకంపై లక్ష్మణ్ నిర్మిస్తున్న ఈ చిత్ర రెగ్యులర్ షూటింగ్ ఈ నెల 8 నుంచి స్టార్ట్ కానుంది. హారీష్ జైరాజ్ సంగీతం సమకూర్చనున్న ఈ సినిమాను హిమాలయ, యూరప్‌లో ఎక్కువగా భాగం చిత్రీకరించనున్నారు. రకుల్ దీంతోపాటు సూర్య సరసన ఓ సినిమాలోను, బాలీవుడ్‌లో అజయ్ దేవగన్‌కి జోడీగా ఓ చిత్రంలోనూ నటిస్తోంది.

సహకరిస్తున్న అందరికీ కృతజ్ఞతలు..



సాయి వెంకట్, ఆర్.కె.గౌడ్

'డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్ల తీరును నిరసిస్తూ శుక్రవారం నుంచి ఐదు రాష్ట్రాల నిర్మాతల మండలి సంయుక్తంగా నిర్వహిస్తున్న థియేటర్ల బంద్ విజయవంతంగా కొనసాగడానికి సహకరిస్తున్న నిర్మాతలకు, ఎగ్జిబిటర్లకు, డిస్ట్రిబ్యూటర్లకు, ప్రేక్షకులకు కృతజ్ఞతలు' అని తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు ప్రతాని రామకృష్ణగౌడ్ అన్నారు. శనివారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడుతూ, 'పదేండ్లుగా డిజిటల్ దోపిడిపై పోరాటం చేస్తున్నాం. దీనిపై నిరహార దీక్ష కూడా చేయడం జరిగింది. ఇప్పుడు నాలుగు భాషల సినీ పరిశ్రమలు ఒకేతాటిపైకొచ్చి జేఏసీగా ఏర్పడి డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్లు ఛార్జీలు తగ్గించేంత వరకు పోరాటం చేయడం శుభ పరిణామం. మేం అన్ని విధాలుగా మద్దతుగా నిలుస్తున్నాం. డిజిటల్ ప్రొవైడర్లు దిగొచ్చేంత వరకు కలిసి కట్టుగా ఉండాలని కోరుకుంటున్నా. థియేటర్ల బంద్ వరకు వచ్చారంటే డిజిటల్ రేట్ల వల్ల నిర్మాతలు ఎంతగా నష్టపోతున్నారో అర్థం చేసుకోవచ్చు. దీని వల్ల ఎన్నో సినిమాలు విడుదలకు నోచుకోవడం లేదు. డిజిటల్ ప్రొవైడర్లలో పిఎక్స్‌డి, యుఎఫ్ఓ బ్యాలెన్స్‌గా ఉన్నారు. క్యూబ్‌లో భాగమైన అల్లు అరవింద్ మాత్రమే ఏమాత్రం తగ్గడం లేదు. ఐదేండ్ల తర్వాత ఫ్రీ సర్వీస్ ఇస్తామని చేసిన అగ్రిమెంట్‌కు కట్టుబడి ఉండాలని, లేకపోతే ఛార్జీలు తగ్గించాలని కోరుకుంటున్నాం. లేదంటే మేం ఇతర కంపెనీలతో తక్కువ రేటుకు ఇచ్చే డిజిటల్ ప్రొవైడర్లతో మాట్లాడి తెలుగు ఫిల్మ్ ఛాంబర్ తరపున రెండు వేలకే కంటెంట్‌ను ఇచ్చేందుకు ప్లాన్ చేస్తాం. ఏదేమైనప్పటికీ మా డిమాండ్స్ తీర్చే వరకు థియేటర్ల బంద్ ఆగదు. అందుకు అందరూ సహకరించాలని కోరుకుంటున్నా' అని అన్నారు. 'డిజిటల్ ప్రొవైడర్లు 13ఏండ్లుగా నిర్మాతల రక్తం తాగుతున్నారు. లక్ష రూపాయలతో ప్రొజెక్టర్‌ను పెట్టి కోట్లు దండుకుంటున్నారు. చిరంజీవిగారు ఇందులో ఇన్‌వాల్వ్ అయి క్యూబ్‌లో భాగమైన అల్లు అరవింద్‌కు ఒక్క ఫోన్ కాల్‌తో చెబితే సమస్య పరిష్కారం అవుతుంది' అని సాయి వెంకట్ అన్నారు.



రకుల్ ప్రీత్ సింగ్

నవచిత్రం

తమిళ నూతన సంవత్సర కానుక



'విశ్వరూపం 2' చిత్రంలో కమల్‌హాసన్

కమల్ హాసన్ నటించిన 'విశ్వరూపం' ఎంతటి ఘన విజయం సాధించిందో తెలిసిందే. ఉగ్రవాదం నేపథ్యంలో స్పై థ్రిల్లర్‌గా రూపొందిన ఆ సినిమా 2013లో విడుదలై మంచి ప్రశంసలందుకుంది. దానికి సీక్వెల్‌గా 'విశ్వరూపం 2'ను తెరకెక్కించారు. అన్ని కార్యక్రమాలను పూర్తి చేసుకుని రిలీజ్‌కు సిద్ధంగా ఉన్న ఈ సినిమాను తమిళ నూతన సంవత్సర సందర్భాన్ని పురస్కరించుకుని రిలీజ్ చేసేందుకు చిత్ర దర్శక, నిర్మాత కమల్ హాసన్ ప్లాన్ చేస్తున్నారట. కమల్ రాజకీయ ఎంట్రీ నేపథ్యంలో బిజీగా ఉండటంతో వాయిదా పడుతూ వచ్చిన ఈచిత్రాన్ని ఏప్రిల్ 13న భారీ స్థాయిలో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారట. ఇందులో కమల్ హాసన్‌తోపాటు పూజా కుమార్, ఆండ్రియా, రాహుల్ బోస్ ప్రధాన పాత్రలు పోషించారు.

కీలక సన్నివేశాల్లో సవ్యసాచి



నాగచైతన్య

'ప్రేమమ్' తర్వాత నాగచైతన్య, చందుమొండేటి కాంబినేషన్‌లో రూపొందుతున్న చిత్రం 'సవ్యసాచి'. నిధి అగర్వాల్ కథానాయికగా నటిస్తున్న ఈ సినిమాలో మాధవన్, భూమిక కీలక పాత్రలు పోషిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై వై.నవీన్, వై.రవిశంకర్, మోహన్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. త్వరలో ఈ చిత్ర ఫస్ట్ లుక్‌ను విడుదల చేయబోతున్నారు. ఆ విశేషాలను నిర్మాతలు తెలియజేస్తూ, 'మాకు ఈ సినిమా చాలా ప్రత్యేకం. ప్రస్తుతం హైదరాబాద్‌లో హీరో నాగచైతన్య, భూమికలపై కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నాం. ఈ షెడ్యూల్ పూర్తవగానే నెక్ట్స్ షెడ్యూల్ కోసం అమెరికా వెళ్ళనున్నాం. చిత్ర ఫస్ట్‌లుక్‌ను ఈ నెల 18న విడుదల చేస్తాం. అలాగే సినిమాను జూన్ 14న రిలీజ్ చేసేందుకు సన్నద్ధమవుతున్నాం. ఆడియెన్స్‌ను ఆశ్చర్య పరిచేలా సినిమా ఉంటుంది. ఆర్.మాధవన్ పాత్ర సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. 'బాహుబలి' తర్వాత కీరవాణి ఈ సినిమాకు సంగీతం సమకూర్చడం స్పెషల్ ఎట్రాక్షన్' అని అన్నారు.

మళ్లీ 'నిమిషం' నిబంధన





నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

పదోతరగతి వార్షిక పరీక్షల్లో మళ్లీ 'నిమిషం' నిబంధనను రాష్ట్ర ప్రభుత్వం విధించింది. గతేడాది నిమిషం నిబంధనను సడలించి, పరీక్ష ప్రారంభమైన ఐదు నిమిషాల వరకూ విద్యార్థులకు గ్రేస్ పీరియేడ్ కల్పించారు. ఈఏడాది ఆ నిబంధనను ఎత్తివేసింది. దీంతో నిర్ణీత సమయం కంటే ఒక్క నిమిషం ఆలస్యంగా వచ్చినా, విద్యార్థులను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించబోమని విద్యాశాఖ అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఈనెల 15నుంచి ప్రారంభమయ్యే పదోతరగతి పరీక్షలకు అధికారులు ఈ నిబంధనను అమలు చేయబోతున్నారు. దీంతో కొంతమంది విద్యార్థులకు నష్టదాయకమే అవుతుందని పలువురు విద్యావేత్తలు చెబుతున్నారు.

రాష్ట్రంలో ఈనెల 15నుంచి ఏప్రిల్ 2వరకూ జరిగే పదో తరగతి వార్షిక పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు తెలంగాణ పాఠశాల విద్యాశాఖ, పరీక్షల విభాగం అన్ని ఏర్పాట్లు చేస్తున్నది. మొదట్లో ఒకేషనల్ పరీక్షలతో ప్రారంభి, తర్వాత ప్రధాన సబ్జెక్టుల పరీక్షలు నిర్వహించాలని విద్యాశాఖ నిర్ణయం తీసుకున్నది. అయితే ఆంధ్రప్రదేశ్‌లో ప్రధాన సబ్జెక్టులతో పరీక్షలు ప్రారంభిస్తుండటంతో, తెలంగాణలోనూ అదే విధంగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ పరీక్షలకు 11,109పాఠశాలలకు చెందిన 5,38,867మంది విద్యార్థులు హాజరుకానున్నారు. వీరిలో రెగ్యులర్ విద్యార్థులు 5,03,117 మంది ఉండగా, వన్‌టైం ఫెయిల్ విద్యార్థులు 35,750మంది, ఒకేషనల్ విద్యార్థులు 20,838మంది ఉన్నారు. వీరికోసం రాష్ట్రవ్యాప్తంగా 2542 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటిలో రెగ్యులర్ విద్యార్థుల కోసం 2375 సెంటర్లు, సప్లిమెంటరీ విద్యార్థుల కోసం 167 కేంద్రాలున్నాయి. అత్యధికంగా హైదరాబాద్ జిల్లాలో 304 కేంద్రాల్లో 79,888 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. అతితక్కువగా సిరిసిల్లా జిల్లాలోని 34 కేంద్రాల్లో 7564 మంది పరీక్షలు రాయనున్నారు. అయితే రాష్ట్రంలో 26సెంటర్లను సమస్యాత్మక పరీక్షా కేంద్రాలుగా గుర్తించారు. అధికారులు వీటిపై ప్రత్యేక నిఘా పెడుతున్నారు.

పరీక్షా పత్రంపై హాల్‌టికెట్ నెంబర్

మాస్‌కాపీయింగ్ నివారణ, ప్రశ్నాపత్రం బయటకు వెళ్లకుండా ఉండేందుకు విద్యాశాఖ అధికారులు పలు చర్యలు తీసుకుంటున్నారు. దీనిలో భాగంగా ఇప్పటికే పరీక్షా కేంద్రంలో సెల్‌ఫోన్ వాడకాన్ని నిషేధించారు. దీనికితోడు పరీక్షా పత్రంలోని అన్ని పేజీలపై విద్యార్థులు వారి హాల్‌టికెట్లు వేయాల్సి ఉంటుంది. దీంతో ఒకవేళ పేపర్ బయటకు పోతే, ఎవరిద్వారా వెళ్లిందో స్పష్టంగా తెలుసుకునే అవకాశం ఉంటుంది. గతేడాది కొన్ని కేంద్రాల్లోనే ఈ నిబంధన అమలు అయింది. ఈసారి మాత్రం అన్ని పరీక్షా కేంద్రాల్లో పకడ్బందీగా అమలు చేసేందుకు అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఈ నిబంధన అమలుతో గతేడాది రెండుచోట్ల పరీక్షా పత్రం బయటకు వెళితే, ఎక్కడి నుంచి పేపర్ బయటికొచ్చిందో అధికారులు గుర్తించి చర్యలు తీసుకున్న విషయం తెలిసిందే.

టెన్త్ పరీక్షల్లో కీలక మార్పులు

- **15 నుంచి వార్షిక పరీక్షలు**
- **హాజరుకానున్న 5,38,867 మంది**
- **431 కేంద్రాల్లో సీసీకెమెరాల ఏర్పాటు**

431 కేంద్రాల్లో సీసీకెమెరాల నిఘా

న్యాయస్థానం ఆదేశాలతో ఈ విద్యాసంవత్సరం జరిగే వార్షిక పరీక్షల్లో రాష్ట్రవ్యాప్తంగా 431పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలతో నిఘా పెడుతున్నారు. 2015-16 విద్యాసంవత్సరంలో ప్రయోగాత్మకంగా 15కేంద్రాల్లో సీసీకెమెరాలను ఏర్పాటు చేయగా, 2016-17 విద్యాసంవత్సరంలో 330కి పైగా కేంద్రాల్లో ఏర్పాటు చేస్తున్నారు. ఈసారి ఈ సంఖ్యను పెంచారు. రానున్న రెండేండ్లలో అన్ని కేంద్రాల్లో సీసీకెమెరాలను ఏర్పాటు చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 144 ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేశారు.

పకడ్బందీగా ఏర్పాట్లు

పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశాం. ప్రధానంగా పరీక్షా కేంద్రాల్లో మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టిసారించాం. మాస్ కాపీయింగ్ నిరోదానికి అన్ని చర్యలు తీసుకుంటున్నాం. ఇంటర్‌తో పాటు వివిధ పరీక్షలకు ఒక నిమిషం నిబంధన అమలవుతోంది. దీంతో టెన్త్ పరీక్షలకూ గతంలో ఉన్న ఐదు నిమిషాల గ్రేస్ పీరియేడ్‌ను రద్దు చేశాం. కాబట్టి విద్యార్థులు ఒకరోజు ముందుగానే పరీక్షా కేంద్రాలను చూసుకోవాలి.



- జి కిషన్,
పాఠశాల విద్యాశాఖ కమిషనర్

కాంగ్రెస్, బీజేపీలకు ప్రత్యామ్నాయం

(మొదటిపేజీ తరువాయి)

పోతున్నారని విమర్శించారు. వరికి మద్దతు ధర మరో రూ.500 పెంచమని కోరినా..పెంచడం లేదన్నారు. రాష్ట్రాలపై పెత్తనం ఒదులుకోవద్దన్న ఉద్దేశంతోనే.. కేంద్ర నిర్ణయాలు ఉంటున్నాయని పేర్కొన్నారు. అందుకే రాజకీయాల్లో మార్పు కోసం కొత్త ప్రయత్నాలు జరుగుతున్నట్టు చెప్పారు. దేశరాజకీయాల్లో గుణాత్మకమైన మార్పు రావాల్సిన అవసరముందని అభిప్రాయపడ్డారు. మార్పు కోసం ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఇందులో భాగంగా తాను వివిధ రాష్ట్రాలకు చెందిన మేధావులు, సీనియర్ జర్నలిస్టులతో మాట్లాడినట్టు వెల్లడించారు. వారు కూడా సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఢిల్లీకి వెళ్లిన సమయంలో తనకు మిత్రుడైన సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరితో కూడా మాట్లాడానని అన్నారు. రాజకీయాల్లో మార్పు కోసం థర్డ్ ఫ్రంటా..? లేక మరో ఫ్రంటా..? ఏర్పాటు కావొచ్చని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. పరిస్థితులు వచ్చినప్పుడు నాయకుడు పుడతాడని, మార్పు విషయంలో నాయకత్వం వహించాల్సి వస్తే ఖచ్చితంగా వహిస్తానని వెల్లడించారు. అవసరమైతే తానే నాయకత్వం వహిస్తానని ఆయన ప్రకటించారు. దేశం కోసం పనిచేసే అవకాశం మాకు లేదా? అని ప్రశ్నించారు. ఈ ఫ్రంట్‌లోకి చంద్రబాబు వస్తే తీసుకుంటారా.? అని ప్రశ్నించగా.. ఎందుకు అహ్వానించం, ఆయనతో పాటు ఎవరొచ్చినా.. ఆహ్వానిస్తామని తెలిపారు. ప్రబల మార్పులకు ఒక నేపథ్యం త్వరలో ప్రారంభమవుతుందన్నారు. దానికి సమయం అదే వస్తుందన్నారు. '60 రోజుల్లో ఏర్పడిన జనతాపార్టీ అధికారంలోకి వచ్చింది తొమ్మిదినెలల కాలంలో ఎన్‌టిఆర్ స్థాపించిన తెలుగుదేశం పార్టీ అధికారంలో వచ్చింది. తెలంగాణలో టీఆర్‌ఎస్‌పార్టీ పుట్టిన వెంటనే పంచాయతీ ఎన్నికల్లో గెలిచింది. ఆ తర్వాత లక్ష్యాన్ని ముద్దాడాం. ఏదీ కాదజాలదు అనుకోవద్దు' అని అన్నారు.

'అవిశ్వాస తీర్మానం' చీప్ పాలిటిక్స్

ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకహోదాపై పెడుతున్న అవిశ్వాస తీర్మానానికి మద్దతిస్తారా.? అన్న ప్రశ్నకు అవన్నీ చీప్ పాలిటిక్స్ అని తోసిపుచ్చారు. అవిశ్వాసం పెడితే దేశ రాజకీయాలను మారుస్తదా.? అని ఎదురు ప్రశ్నించారు. ఏపికి ప్రత్యేక హోదాపై ఆ రాష్ట్రానికి చెందిన అధికార, ప్రతిపక్షాలు స్పష్టంగా లేవన్నారు. కేంద్రానికి కూడ స్పష్టత లేదన్నారు. ప్రత్యేక హోదా ఇస్తానని మోడీ ప్రకటించినప్పుడు ఇచ్చి తీరాలి కానీ ఇలా వాయిదాలు వేయడం సరికాదన్నారు. 'నేను కొట్టినట్టు చేస్తా. నీవు ఏడ్చినట్టు చేయాలి.' అన్నట్టుగా రాజకీయాలు ఉన్నాయని విమర్శించారు.

వామపక్షాలతో కలుస్తాం

దేశ రాజకీయాల్లో మార్పుకోసం వామపక్షాలతో కలుస్తామని సీఎం కేసీఆర్ ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. దేశంలో ఉన్నట్టుగానే రాష్ట్రంలోనూ వ్యవహరిస్తామన్నారు. సీపీఐ(ఎం) జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారం ఏచూరిని కలిసేందుకు ప్రయత్నించానని, త్వరలో కలిసి అన్ని విషయాలు మాట్లాడుకుంటామని అన్నారు.

గెలవడం పెద్ద విషయం కాదు

మూడు రాష్ట్రాల ఎన్నికల్లో బీజేపీ గెలవడంపై సీఎం కేసీఆర్ సీరియస్‌గా తీసుకోలేదు. 'ఎక్కడో చోట గెలవడం ఇష్యూ కాదు. దేశ రాజకీయాల్లోనే మార్పు రావాలని కోరుకుంటున్నా' అని సీఎం కేసీఆర్ తెలిపారు.

సాక్ష్యమివ్వటానికి భయపడొద్దు : హైకోర్టు

హైదరాబాద్: కోర్టుల్లో సాక్ష్యాలు చెప్పేందుకు వచ్చిన బాలబాలికలకు భయం, బెరుకు లేని వాతావరణ ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలుగు రాష్ట్రాలను హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేష్ రంగనాథన్, న్యాయమూర్తి విజయలక్ష్మిలతో కూడిన డివిజన్ బెంచ్ ఆదేశించింది. రాష్ట్రాల్లోని బాలల హక్కుల కమిషన్స్‌లో ఖాళీలను భర్తీ చేయాలని కోరుతూ సుప్రీంకోర్టులో దాఖలైన కేసును తగిన చర్యలు తీసుకోవాలని గత వారం ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు సెక్రెటరీ అన్ని హైకోర్టులకు లేఖలు రాశారు. దీనిని ఉమ్మడి హైకోర్టు బెంచ్ విచారించి.. బాలలపై లైంగిక వేధింపులు., బాల్య వివాహాలు, ఇతర కేసుల్లో బాలల్ని విచారించేప్పుడు కోర్టుకు వచ్చామనే భావన వారికి రానీయకుండా తెలుగు రాష్ట్రాలు చర్యలు తీసుకుని దానిపై పూర్తి సమాచారాన్ని తమకు నివేదించాలని ఆదేశించింది. రెండు రాష్ట్రాలకు శనివారం నోటీసులు జారీ చేసింది.

నేటినుంచి ఎంసెట్ దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఇంజినీరింగ్, ఫార్మసీ, అగ్రికల్చర్, ఫారెస్ట్ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే ఎంసెట్-2018 రాతపరీక్షలు మే 2 నుంచి 7వరకు ఆన్‌లైన్‌లో జరగనున్నాయి. ఎంసెట్ నోటిఫికేషన్ గతనెల 27న విడుదలైన విషయం తెలిసిందే. ఎంసెట్ దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ఆన్‌లైన్‌లో ఆదివారం నుంచి ప్రారంభం కానుంది. దరఖాస్తుల సమర్పణకు తుది గడువు వచ్చేనెల 4 వరకు ఉంది. అభ్యర్థులు అపరాధ రుసుం లేకుండా వచ్చేనెల 4వ తేదీ వరకు దరఖాస్తులను సమర్పించేందుకు అవకాశముంది. అపరాధ రుసుం రూ.500లతో వచ్చేనెల 11 వరకు, రూ. 1000తో వచ్చేనెల 18 వరకు, రూ.5 వేలతో వచ్చేనెల 24 వరకు, రూ.10 వేలతో వచ్చేనెల 28 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తు సమయంలో ఏమైన తప్పులు దొర్లితే వచ్చేనెల 6 నుంచి 9వ తేదీ వరకు సరిచేసుకునే అవకాశముంది. ఎంసెట్‌కు గతంలో ఉన్నట్టుగానే ఈఏడాదీ నిమిషం నిబంధన కొనసాగుతున్నది. ఎంసెట్ రాతపరీక్ష నిర్వహించే రోజు నిమిషం ఆలస్యమైనా అభ్యర్థులను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించరు. గతంతో పోలిస్తే దరఖాస్తు ఫీజులు భారీగా పెరిగాయి. గతేడాది ఎస్సీ,ఎస్టీ అభ్యర్థులకు రూ.250 ఫీజు ఉంటే, ఈ ఏడాది రూ.400లకు పెంచారు. బీసీ, ఓసీ, ఇతర అభ్యర్థులకు గతేడాది రూ.500 ఉన్న ఫీజును ఈసారి రూ.800లకు పెరిగింది. ఇంజినీరింగ్, అగ్రికల్చర్ విభాగాలు రెండు పరీక్షలు రాసే అభ్యర్థుల్లో ఎస్సీ, ఎస్టీలకు రూ.800, ఇతర అభ్యర్థులకు రూ.1,600లుగా నిర్ణయించారు. జీఎస్టీ, ఆన్‌లైన్ పరీక్ష విధానంతోనే ఫీజులు పెంచినట్టు అధికారులు గతంలోనే స్పష్టం చేశారు. ఎంసెట్‌కు దరఖాస్తు చేసే అభ్యర్థులందరికీ తప్పనిసరిగా ఈ-మెయిల్ ఉండాలనే నిబంధన విధించారు. ఒకవేళ విద్యార్థి ఈ-మెయిల్ ఇవ్వకపోయినా, తప్పుడు ఈ-మెయిల్ ఇచ్చినా, విద్యార్థికి సరైన సమాచారం చేరే అవకాశం లేదు. దరఖాస్తు చేసుకున్న వెంటనే ఈ-మెయిల్ అడ్రస్‌కు పీడీఎఫ్ దరఖాస్తు కాపీ వచ్చేలా అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఆన్‌లైన్ పరీక్షల నేపథ్యంలో అభ్యర్థుల పూర్తి సమాచారం మెయిల్ ద్వారా పంపించే అవకాశముంది.

మే 4,5,7 తేదీల్లో ఇంజినీరింగ్

మే 2,3 తేదీల్లో అగ్రికల్చర్, ఫార్మసీ, ఫారెస్ట్ కోర్సుల్లో ప్రవేశాలకు రాతపరీక్ష జరగనుంది. మే 4,5,7 తేదీల్లో ఇంజినీరింగ్ విభాగం రాతపరీక్ష నిర్వహించనున్నారు. ఒక్కో విడతకు 25 వేల మంది చొప్పున ప్రతిరోజూ రెండువిడతల వారీగా ఆన్‌లైన్ రాతపరీక్షలు జరుగుతాయి. ప్రతి రోజూ మొదటి విడత ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు, రెండో విడతకు మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6గంటల వరకు జరుగుతుంది. ఈ ఏడాది నుంచి ఆన్‌లైన్‌లో ఎంసెట్ నిర్వహించనున్న నేపథ్యంలో అభ్యర్థులకు అవగాహన కోసం మాక్ టెస్టులూ నిర్వహిస్తారు. జవాబు పత్రం, కీవంటి సమాచారం అభ్యర్థి ఈ మెయిల్‌కు పంపిస్తారు. వచ్చేనెల 20నుంచి మే1 వరకు అభ్యర్థులు హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

బైక్‌ను ఢీకొట్టి ప్రయాణికులపైకి దూసుకెళ్లిన లారీ

- ఇద్దరు మృతి
- మహిళా సర్పంచ్‌కి తీవ్రగాయాలు
- మృతదేహాలతో గ్రామస్తుల రాస్తారోకో
- తన వాహనంలోనే సర్పంచ్‌ను ఆస్పత్రికి తరలించిన కలెక్టర్

నవతెలంగాణ-పెబ్బేరు

మలుపు వద్ద లారీ బైక్‌ను ఢీకొట్టి ప్రయాణికులపై దూసుకెళ్లడంతో ఇద్దరు మృతిచెందారు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన పెబ్బేరు మండలం గుమ్మడం క్రాస్ రోడ్డు వద్ద శనివారం జరిగింది. కొత్తకోట ఎస్‌ఐ సోంనారాయణసింగ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రం నుంచి యాపర్లకు లారీ రేషన్ బియ్యం లోడ్‌తో పోతున్నది. వీపనగండ్ల మండలం సంపత్‌రావుపల్లి గ్రామానికి చెందిన రేషన్ డీలర్ ఆంజనేయులు(40), అతని భార్య పద్మమ్మ (సర్పంచ్)తో కలిసి మహబూబ్ నగర్‌లో జరుగుతున్న సర్పంచ్‌ల సమ్మేళనానికి బైక్‌పై పోతున్నారు. ఈ క్రమంలో గుమ్మడం క్రాస్ రోడ్డు దాటే క్రమంలో మలుపు వద్ద బైకును లారీ ఢీకొట్టింది. తర్వాత పక్కన బస్టాండ్ వద్దనున్న అదే గ్రామానికి చెందిన సుశీలమ్మ(70)పైకి లారీ దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ఆంజనేయులు, సుశీలమ్మ అక్కడికక్కడే మృతిచెందారు. సర్పంచ్ పద్మమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న కలెక్టర్ శ్వేతామహంతి ఘటనాస్థలానికి చెరుకుని తీవ్రంగా గాయపడిన సర్పంచ్ పద్మమ్మను తన వాహనంలోనే పెబ్బేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తరలించాలని అధికారులను ఆదేశించారు. ప్రమాదంలో ఆంజనేయులు, సుశీలమ్మ లారీ టైర్ల కింద పడిపోయారు. రెండు గంటల పాటు శ్రమించి అధికారులు క్రేన్ సహాయంతో మృతదేహాలను బయటకు తీశారు.

మృతదేహాలతో రాస్తారోకో...

సంపత్‌రావుపల్లి గ్రామస్తులు కొల్లాపూర్ వెళ్లే రోడ్డుపై మృతదేహాలతో రెండుగంటల పాటు రాస్తారోకో చేశారు. మూలమలుపు వద్ద బోర్డులు కానీ, స్పీడ్‌బ్రేకర్లు కానీ ఏర్పాటు చేయకపోవడంతోనే ఈ ప్రమాదం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. సీఐ సర్ది చెప్పడానికి ప్రయత్నించినా గ్రామస్తులు వినకపోవడంతో పంచాయతీరాజ్ శాఖ మంత్రి జూపల్లితో ఫోన్‌లో మాట్లాడారు. ఆంజనేయులు కుటుంబానికి తన సొంతంగా రూ.లక్ష అందిస్తానని, సివిల్ సప్లయ్ అధికారులు, ప్రభుత్వంతో మాట్లాడి పరిహారం అందించేందుకు కృషి చేస్తానని మంత్రి చెప్పడంతో రాస్తారోకో విరమించారు. ఆందోళనలో సర్పంచ్‌లు ఖాదార్‌యాదవ్, బిచ్చన్నయాదవ్, పెద్ద నర్సింహా, మాజీ జెడ్పీటీసీ కృష్ణ ప్రసాద్, టీఆర్ఎస్ నాయకులు సుదర్శన్‌రెడ్డి, బి.వెంకటస్వామి, ఆంజనేయులు ఉన్నారు. కేసు దర్యాప్తులో ఉంది.



మోడీతోనే కేసీఆర్

(మొదటిపేజీ తరువాయి)



ఎద్దేవా చేశారు. శనివారం గాంధీభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలంగాణలో టీఆర్ఎస్‌కు కాంగ్రెస్ ప్రత్యామ్నాయం కాబట్టి జాతీయస్థాయిలో కేసీఆర్ మోడీతోనే పోతారని చెప్పారు. 2019 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. తాను ముఖ్యమంత్రి రేసులో లేనని, మహబూబ్‌నగర్ పార్లమెంటు నుంచి పోటీ చేస్తానని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. తనకు జాతీయ రాజకీయాలపై ఆసక్తి ఎక్కువగా ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ అంతర్గత విషయాలపై జోక్యం చేసుకోబోనన్నారు. ఇతర పార్టీ నాయకుల పట్ల అసభ్యకరంగా, అనాగరికంగా మాట్లాడం కేసీఆర్ నైజమన్నారు. సిద్ధాంతపరంగా బీజేపీ భావజాలానికి కేసీఆర్ భావజాలం చాలా దగ్గరగా ఉంటుందని చెప్పారు. 2009 ఎన్నికల్లో ఎన్డీఏ గెలువక ముందే కేసీఆర్ అత్యుత్సావం ప్రదర్శించి గెలిచిందని చెప్పారని, అయితే యూపీఏ అధికారంలోకి వచ్చిందని గుర్తు చేశారు. 2014 ఎన్నికల సందర్భంగా బీజేపీతో సర్దుబాటుకు కేసీఆర్ ఎంతో ప్రయత్నించారని, ఆ సమయంలో టీఆర్ఎస్‌తో పొత్తును బీజేపీయే తిరస్కరించిందన్నారు. ఈ పరంపర రానున్న ఎన్నికల్లో నిజం కాబోతుందన్నారు. బీజేపీతో పోవడం మినహా కేసీఆర్‌కు మరో గత్యంతరం లేదని చెప్పారు. దేశంలో కూడా బీజేపీ, కాంగ్రెస్ మధ్యే పోటీ ఉంటుందన్నారు. నోట్ల రద్దు, జీఎస్టీ తేవడాన్ని కూడా కేసీఆర్ పొడిగి అభాసుపాలయ్యారన్నారు. ఈశాన్య రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ పునాదిని బీజేపీ మతం పేరుతో విడగొట్టిందని మండిపడ్డారు. ఉత్తరాది రాష్ట్రాల్లో బీజేపీ బాగా బలహీనపడిందని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

యువతి దారుణ హత్య

నవతెలంగాణ-మిరుదొడ్డి

యువతిని దారుణంగా హత్య చేశారు. ఆ తర్వాత కిరోసిన్ పోసి నిప్పంటించి తగులబెట్టారు. ఈ ఘటన సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండలం రుద్రారంలో శనివారం వెలుగులోకొచ్చింది. పోలీసులు, కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. రుద్రారం గ్రామానికి చెందిన చెట్లకాడి లక్ష్మి, సంజీవులు దంపతులకు ఇద్దరు కుమార్తెలు. రెండేండ్ల కింద అనారోగ్యంతో లక్ష్మి చనిపోయింది. పెద్ద అమ్మాయి పెండ్లి అయింది. చిన్నకూతురు సుహాసిని(18) ఇంటర్ తర్వాత తండ్రికి వ్యవసాయ పనుల్లో చేదోడు, వాదోడుగా ఉంటున్నది. ఈ క్రమంలోనే శుక్రవారం ఉదయం 11 గంటల సమయంలో బావి వద్దకెళ్లింది. మధ్యాహ్నం సమయంలో సుహాసిని చిన్నాన్నకు గుండెపోటు వచ్చిందని తండ్రితో సహా, కుటుంబ సభ్యులంతా సిద్దిపేటలోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి వెళ్లారు. అదే రోజు రాత్రి 10 గంటలకు తండ్రి ఇంటికొచ్చాడు. అప్పటికి కూతురు కనిపించలేదు. పక్క గ్రామంలోని బంధువుల ఇంటికి పోయిందనుకున్నాడు. మొక్కజొన్న పంటను అడవి పందుల బెడద నుంచి కాపాడటంలో భాగంగా రాత్రిపూట చేను వద్దకెళ్లాడు. చేను దగ్గర సుహాసిని కాలిపోయి కనిపించింది. ఆందోళనతో వెంటనే గ్రామస్తులకు విషయాన్ని చెప్పాడు. సమాచారం అందుకున్న పోలీసులు శనివారం ఉదయం ఘటనాస్థలికి చేరుకున్నారు. డీసీపీ నర్సింహారెడ్డి, ఏసీపీ రామేశ్వర్, సీఐ నిరంజన్ పరిసర ప్రాంతాన్ని పరిశీలించారు. డాగ్ స్క్వాడ్‌తో విచారణ చేపట్టారు. ఆ కుక్కలు మృతురాలి తండ్రి వద్దకు వెళ్లి ఆగాయి. సుహాసినిని చంపేసి, ఆ తర్వాత గుర్తుపట్టరాకుండా కిరోసిన్ పోసి నిప్పంటించినట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. మృతురాలి అక్క మౌనిక ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతి కింద కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ విజయభాస్కర్ తెలిపారు.



అలా అన్లేదు

(మొదటిపేజీ తరువాయి)

సీఎం మాట్లాడుతూ ప్రధాని గురించి చేసిన వ్యాఖ్యలతో పాటు తనపైనా, కుటుంబంపైనా వస్తున్న విమర్శలపై స్పందించారు. "నేను గత మూడు నాలుగు రోజులుగా టౌన్‌లో లేను. బయట ఉన్న. ఆదిలాబాద్, కరీంనగర్ పర్యటన సందర్భంగా ప్రధాన మంత్రినో లేక మరొకరినో నేను తూలనాడిన అని అన్నరు. వ్యక్తిగతంగా అన్నానని అని అన్నరు. 100 శాతం అది శుద్ధ తప్పు. నేను దాన్ని ఖండిస్తున్నాను. లేని దాన్ని ఉన్నట్లు చిత్రీకరించారు. నేను అలా అన్లేదు. నేను కూడా టేప్ తెప్పించుకొని చూశాను. టంగ్ స్లిప్ ఉందా అని చూశాను. నేను ప్రధాన మంత్రి గారికి, మోడీ గారికి అని అన్నాను. దానికి గాడికి అన్న అని మాట్లాడుతున్నరు. అది వాళ్ల కర్మ. దానికి నేను ఏం చేయలేను. ప్రధాన మంత్రిని మేమే కించపరుచుకుంటమంటే బీజేపీనేతలను నేనేం చేయలేను. ఎందుకంటే అక్కడ నేను మాట్లాడిన సందర్భం వింటే అందరికీ అర్థమయితది. అటువంటి మాట అనవలసిన సందర్భం కూడా లేదు. ఆ అవసరం కూడా లేదు. నేను అనలేదు. అయినా కూడా మేము అలాగే అంటాం అంటే ఇక వాళ్ల ఇష్టం. ఇంకోటి.. లేనిపోని వన్నీ కూడా కల్పించి మరీ మాట్లాడుతున్నరు. కొందరు బీజేపీ నాయకులు అసంబద్ధంగా మాట్లాడుతున్నరు. దాన్ని మాత్రం తీవ్రంగా ఖండిస్తం. హెచ్చరిస్తున్న కూడా. అటువంటి అధికారం మీకు లేదు. బీజేపీ నాయకులు ఒళ్లు దగ్గర పెట్టుకొని మాట్లాడాలి. తమ పరిధిలో మాట్లాడాలి.' అని హెచ్చరించారు. ఒకాయనేమో ప్రధాన మంత్రినే విమర్శిస్తరా అంటరు. ప్రధాన మంత్రిని విమర్శించొద్దని రాజ్యాంగంలో ఎక్కడన్నా ఉన్నదా. ఇది డెమోక్రసీ. అవసరం అని భావించిన సందర్భంలో దేశంలో ఎవ్వరినైనా సరే విమర్శించొచ్చు. ఇది ప్రజాస్వామ్య దేశం. అని అన్నారు. 'కేసీఆర్‌కు జైలుకు పోవాలని ఉందా అని ఓ బీజేపీ ఎమ్మెల్యే అన్నరు. అంటే జైలుకు పంపిస్తరా. దేశంలో మాట్లాడినోళ్లందరినీ జైలుకు పంపిస్తరా మీరు. ఇదేం రాజకీయం నాకర్థం కాదు. ఎవ్వరినైనా సరే మేం ఏమైనా చేయగలం. అనుకుంటే కష్టం. కొన్ని సందర్భాల్లో కొంతమందిని ముట్టుకుంటే భస్మమైతరు. మేం కడుపు కట్టుకొని, నోరు కట్టుకొని అద్భుతమైన పరిపాలన కొనసాగిస్తున్నం. మన ప్రధాన మంత్రి, కేంద్రమంత్రులు కితాబిచ్చారు నాకు. దేశంలో కరెంట్ అందరు ప్రయివేట్ వాళ్లకు ఇస్తే ఈయన బీహెచ్ఈఎల్‌కు ఇచ్చారని చెప్పి పీఎం పొగిడారు.' అని సీఎం అన్నారు. వాడు వీడు అన్నది కాంగ్రెస్, టీడీపీలపై మాత్రమేనన్నారు. అయినా ఉన్నది ఉన్నట్టుగా మాట్లాడితే తప్పేలా అవుతుందన్నారు. తెలంగాణలో అలానే మాట్లాడతారని, తెలంగాణ వ్యవహారక భాషలో మాట్లాడతానన్నారు. ఆస్తులపై మాట్లాడుతూ 'మాకు ఉన్నదేంది. మీం చేసిన కుంభకోణం ఏంటిది. మేం ఏం చేయలేదు. ఎవ్వరు కూడా మమ్మల్ని ఏం చేయలేరు. అంత నిటారుగ ఉన్నం. మాకు ఉన్న ఆస్తులు అన్ని బహిరంగ రహస్యమే. మాకు పెద్దగా ఏం లేవు. మేము మా కుటుంబం కలిసి తీర్మానం కూడా చేసుకున్నం. మాకు ఇంతకంటే ఆస్తులు అవసరం లేదనుకున్నం. ఈ దుర్మార్గమైన, చండాలమైన ఆస్తులు అక్కర్లేదు. సంపాదన అక్కర్లేదు. మాకు ఎంత ఉందో దాన్ని మేము టైం టూ టైమ్ నికరంగా నా జేబుకు ఉండే పెన్నుతో సహ ప్రతి సంవత్సరం ఐటీ లెక్కలు సమర్పిస్తున్నాం. దాని ప్రకారమే ఆక్యురేట్‌గా ఉన్నం. అంతకుమించి మమ్మల్ని ఎవరూ ఏం చేయగలిగింది లేదు.' అన్నారు. దొంగ పని చేసినోళ్లు, కుంభకోణాలకు పాల్పడ్డోళ్లు, అక్రమ సంపాదనకు పాల్పడ్డోళ్లు భయపడతరు కాని తాము భయపడమని అన్నారు. కేసీఆర్ భయపడబోరన్నారు. ఆ అవసరం లేదు కేసీఆర్‌కు లేదని, తనను ముట్టుకోని చూస్తే తెలుస్తుందని అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా రాజకీయాలు ఎట్ల నడుస్తున్నయో.. టీఆర్ఎస్ రాజకీయాలు కూడా అట్లనే నడుస్తయి. అవి ఎలక్షన్ పాలిటిక్స్. ఎన్నికలు వేరు.. పర్సనల్ లైఫ్ వేరు. ఎన్నికలు వచ్చినప్పుడు బీజేపీ పార్టీ ఎట్ల నడుస్తున్నదో మా పార్టీ కూడా అట్లనే నడుస్తున్నదని అన్నారు. అమెరికాలో ట్రంప్ పార్టీ ఎట్ల నడుస్తదో మాది కూడా అలాగే ఉంటదన్నారు. ప్రపంచ వ్యాప్తంగా, భారతదేశంలో ఉన్న పార్టీలు ఎటువంటి విధానాలు అవలంభిస్తున్నయో.. మా పార్టీ కూడా అంతే. మా పార్టీకి 70 లక్షల మంది సభ్యులు ఉన్నరు.." అని సీఎం చెప్పారు.

కాంగ్రెస్‌కు పదిసీట్లు దాటవు

కాంగ్రెస్‌పార్టీ ఎన్ని సర్కస్ ఫీట్లు వేసినా వచ్చే ఎన్నికల్లో పది సీట్లు దాటవు అని సీఎం కేసీఆర్ అన్నారు. బీజేపీ గల్లంతు అవుతుందని జోస్యం చెప్పారు. తెలంగాణపై దృష్టి సారిస్తామని కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ అంటున్నారని, ఎవరు దృష్టి సారించొద్దని చెప్పారని ఎద్దేవా చేశారు. గంటగంటకు దృష్టి సారించండన్నారు. తాము ఏమి చేశామో చేయలేదో ప్రజలు నిర్ణయిస్తారని, ప్రజల తీర్పును శిరసా వహిస్తామని అన్నారు. తాము రెండు సార్లు సర్వే చేశామని, ఆరున్నర లక్షమందిని శాంపిల్‌గా తీసుకుని సర్వే చేశామని, అందులో ఒకసారి 106, మరోసారి 103 సీట్లు టీఆర్ఎస్‌కు వస్తాయని తేలిందన్నారు. గండాలు పెంచుకోవడం, సన్యాసి అవుతానని చెప్పడమేంటని ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని ఉద్దేశించి అన్నారు.

హామీలపై కేంద్రాన్ని నిలదీయండి
ఎంపీలకు సీఎం కేసీఆర్ పిలుపు

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి - హైదరాబాద్

ఈనెల 5 నుంచి పార్లమెంట్‌లో జరిగే బడ్జెట్ సమావేశాల్లో స్టేట్ రీఆర్గనైజేషన్ యాక్ట్‌లో పొందుపర్చిన అనేక అంశాల అమలుపై కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీయాలని సీఎం కేసీఆర్ తమ పార్టీ ఎంపీలకు పిలుపునిచ్చారు. శనిశారం ప్రగతి భవన్‌లో టీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ సమావేశం జరిగింది. కేసీఆర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎంపీలతో పాటు ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి, హెూం మంత్రి నాయిని నర్సింహారెడ్డి, మండలిలో ప్రభుత్వ విప్ రాజేశ్వర్‌రెడ్డి తదితరులు హాజరయ్యారు. అనంతరం సీఎం కేసీఆర్ మీడియాతో మాట్లాడారు. బడ్జెట్ సమావేశాల సందర్భంగా అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించినట్టు చెప్పారు. విభజన యాక్ట్‌లోని అంశాల అమలుపై కేంద్రాన్ని పెద్ద ఎత్తున తమ పార్టీ ఎంపీలు నిలదీస్తారని సీఎం కేసీఆర్ చెప్పారు. హామీల అమలుపై చాలా సందర్భాల్లో కేంద్రానికి దరఖాస్తులు ఇచ్చామని, ఎంపీలు, రాష్ట్ర మంత్రులు కూడా కొన్ని సందర్భాల్లో చెప్పినా ఆశించిన స్థాయిలో కేంద్రం నుంచి రెస్పాన్స్ రాలేదన్నారు. రిజర్వేషన్ల విషయంపై ప్రధానికి తాను స్వయంగా చెప్పాననిన్నారు. 70 సంవత్సరాల స్వాతంత్ర్యం తర్వాత కూడా ఈ రిజర్వేషన్లు కేంద్రం దగ్గర పెట్టుకోవడం కరెక్ట్ కాదని, శాసన సభలో తీర్మానం చేసినప్పుడు కూడా ఈ మాట బలంగా చెప్పి పంపించామన్నారు. ఉద్యోగాలు, విద్యా అవకాశాలు ఇచ్చే రిజర్వేషన్లను తమ రాష్ట్రాల పరిధిలో ఇస్తున్నం కాబట్టి, అది మీదగ్గర పెట్టుకోకండి అని చెప్పినా దాని మీద స్పందన లేదన్నారు. పాత పద్ధతిని కొనసాగిస్తామని కేంద్రం చెప్పడం విడ్డూరంగా ఉందని, దీనిపై పెద్ద ఎత్తున పోరాటం చేస్తామన్నారు. రిజర్వేషన్ల గురించి సుప్రీం కోర్టు చెప్పినట్లుగా రాజ్యాంగ సవరణ చేయొచ్చు. పెద్ద కష్టమేమి కాదన్నారు. దేశ వ్యాప్తంగా ఉన్న డిమాండే కాబట్టే, కేంద్ర ప్రభుత్వం అనుకుంటే ఆర్టికల్ 16ను సవరణ చేయొచ్చని, బిల్లు కూడా పాస్ అవుతుందని అన్నారు. ఈ విషయంలో కేంద్రం తన పెత్తనాన్ని వదులుకోవడానికి సిద్ధంగా లేదన్నారు.

ఇంతవరకు ఇండస్ట్రియల్ ఇన్సెంటివ్స్ ఇవ్వలే..

'ఇండస్ట్రియల్ ఇన్సెంటివ్స్ రెండు రాష్ట్రాలకు కూడా ఇవ్వాలని బిల్లులో చెప్పారు. కాని ఏమీ ఇవ్వలేదు. నిజానికి హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లో వస్తున్న ఇన్సెంటివ్స్ ఇచ్చినట్లయితే కొత్తగా ఏర్పడిన రాష్ట్రాలకు బాగా పెట్టుబడులు వచ్చే ఆస్కారం ఉంటుంది. ఉభయ రాష్ట్రాలు కూడా అభివృద్ధి అయ్యే ఆస్కారం ఉంటుంది. ఆ ఉద్దేశంతోనే అప్పుడు అందరం డిమాండ్ చేస్తే కాంగ్రెస్‌పార్టీ ప్రభుత్వం పెట్టింది. వీళ్లు తీసేశారు. స్టేట్ రీఆర్గనైజేషన్ బిల్లులో ఉన్నదాన్ని ఎక్స్‌టెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ పోరాటం చేస్తామన్నారు.' సీఎం కేసీఆర్ తెలిపారు.

ఎంఎన్ఆర్ఈజీఎస్ ను వ్యవసాయానికి అనుబంధంగా చేయాలి...

ఎంఎన్ఆర్ఈజీఎస్(మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం)ని కూడా వ్యవసాయానికి అనుబంధంగా చేయాలని, దీనిపై కూడా తమ ఎంపీలు పోరాటం చేస్తారని సీఎం తెలిపారు. ఇవి కాకుండా తెలంగాణకు ఇవ్వాల్సిన బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, ఎయిమ్స్, కాజిపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, ఐఐఎమ్.. ఇలా అనేక విషయాల మీద కూడా కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీస్తామన్నారు. అదేవిధంగా టైంను బట్టి నిర్ణయాలు తీసుకుంటామన్నారు.

విభజన చట్టం హామీలు

విభజన చట్టంలో చెప్పింది	ప్రస్తుత పరిస్థితి
గిరిజన యూనివర్సిటీ	రాష్ట్ర ప్రభుత్వం స్థలం సేకరించింది.నిర్మాణం ప్రారంభం కాలేదు
హార్టికల్చర్ యూనివర్సిటీ	300 కోట్లు అవసరం. రూ.200 కోట్లు కేంద్రం మంజూరు చేసింది. ఇప్పటివరకు రూ.135 కోట్లు ఇచ్చింది. నిర్వహణ బాధ్యతను కేంద్రం తీసుకోవాలి
బయ్యారంలో స్టీల్ ఫ్యాక్టరీ	ఇనుప ఖనిజం లభ్యతపై స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా పరిశీలన జరపాలి. కేంద్రం వేసిన కమిటీ ఇప్పటిదాకా నివేదిక ఇవ్వలేదు.
కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేసే అంశం	కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయలేదు. ప్రతిపాదనను కూడా ఉపసంహరించుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం 180 ఎకరాల స్థలం సేకరించి పెట్టినా కేంద్రం వెనక్కిపోయింది.
4 వేల మెగావాట్ల విద్యుత్	ఎన్‌టీపీసీ కేవలం 2 800 యూనిట్లు ప్రారంభించింది
53:47 నిష్పత్తిలో విద్యుత్	ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏకపక్షంగా పీపీఏలు రద్దు చేసుకున్నది. సీలేరు విద్యుత్‌లో తెలంగాణ వాటా తేల్చలేదు. నీరజా మాథుర్ కమిటీ ఇంకా విద్యుత్ విషయంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించలేదు
పారిశ్రామిక రంగంలో ప్రోత్సాహకాలు	ఎలాంటి ప్రోత్సాహకాలు అందలేదు. పన్ను మినహాయింపులు లేవు.

సెన్సెక్స్ ▼ 137	నిఫ్టీ ▼ 39	డాలరుకు రూపాయి విలువ	బంగారం(10.గ్రా)	వెండి (కేజీ)
34,046	10,458	66.16	రూ. 30,192	రూ. 41,600

గురువారం మార్కెట్లు ముగిసే సమయానికి

కోడిగుడ్లు			
హైదరాబాద్	355	విజయవాడ	348
ఒక్కగుడ్డుకు	4.15	చెన్నై	395
వరంగల్	357	ముంబయి	340

అమెరికాలో ఆర్థిక సంక్షోభం!

- సమీప భవిష్యత్తులో తప్పకపోవచ్చు: మైక్రోసాఫ్ట్ అధినేత బిల్‌గేట్స్ సరికొత్త జోస్యం
- ఇన్నోవేషన్ కాపిటలిజమే విరుగుడని సూచన



న్యూయార్క్: అమెరికా మరోసారి ఆర్థిక సంక్షోభంలోకి జారుకొనే అవకాశం ఉందని మైక్రోసాఫ్ట్ అధినేత బిల్‌గేట్స్ అభిప్రాయపడ్డారు. 2008లో ఎదుర్కొన్న సంక్షోభం మాదిరి మాంద్యం పరిస్థితులు మళ్లీ అగ్రరాజ్యంలో తలెత్తే అవకాశాలున్నాయని ఆయన వివరించారు. ఇటీవల అమెరికాలో జరిగిన 'ఆస్క్ మి ఎనీథింగ్' (నన్ను ఏదైనా అడగండి) కార్యక్రమంలో పాల్గొన్న బిల్‌గేట్స్ ఈ విషయాన్ని తెలిపారు. 2008లో వచ్చిన ఆర్థిక సంక్షోభం లాంటిది సమీప భవిష్యత్తులో తలెత్తే అవకాశం ఉన్నదా? అని ఓ యూజర్ అడిగిన ప్రశ్నకు సమాధానంగా బిల్‌గేట్స్.. అవును అని చెప్పడం కష్టమే అయినప్పటికీ అలాంటి సంక్షోభం సమీప భవిష్యత్తులో తలెత్తడం తథ్యమన్న సంకేతాలనిచ్చారు. అయితే ఇన్నోవేషన్, క్యాపిటలిజం మరింత మెరుగైతే దాన్ని నుంచి అమెరికా బయటపడటం సాధ్యమవుతుందని గేట్స్ సలహానిచ్చారు. అమెరికాలోని బ్యాంకులు కుప్పకూలిన నేపథ్యంలో 2008 అగ్రరాజ్యంలో వచ్చిన ఆర్థిక సంక్షోభం వల్ల స్థానిక ఆర్థిక వ్యవస్థ తీవ్ర ఇరకాటంలో కూరుకుపోయింది. అమెరికన్లు దాదాపు 88 లక్షల ఉద్యోగాలుకోల్పోయారు. అమెరికా ప్రజల నికర సంపద కూడా 19 ట్రిలియన్ డాలర్లకు పైగా (19 లక్షల కోట్ల డాలర్లు) హరించుకుపోయిన సంగతి తెలిసింది. ఈ నేపథ్యంలో అమెరికా ఆర్థిక వ్యవస్థపై ఆధారపడిన భారత్ వంటి దేశాలపై కూడా ఈ మాంద్యం ప్రభావం కనిపించింది. మన దేశంలోనూ వేలాది ఉద్యోగాలు పోయాయి.

31,443 కోట్ల వాటాల విక్రయం



న్యూయార్క్: ఫేస్‌బుక్ వ్యవస్థాపకుడు, సీఈవో మార్క్ జుకర్‌బర్గ్ మరోసారి పెద్ద మొత్తంలో షేర్లను విక్రయించారు. తన భార్య ప్రిస్సిల్లా చాన్ ఏర్పాటు చేసిన ఫౌండేషన్ 'చాన్ జుకర్‌బర్గ్ ఇనిషియేటివ్'కు (సీజెడ్ఐ) విరాళం అందించేందుకు గాను ఆయన భారీగా షేర్ల విక్రయం జరిపినట్టుగా సంస్థ మార్కెట్ ఫైలింగ్స్ ద్వారా తెలుస్తోంది. గత (ఫిబ్రవరి) మాసంలో జుకర్‌బర్గ్ ఫేస్‌బుక్‌లోని సుమారు 500 మిలియన్ డాలర్ల విలువైన (రూ.31,443 కోట్లు) 27 లక్షల షేర్లను విక్రయించినట్టుగా సమాచారం. రాయిటర్స్ లెక్కల ప్రకారం జుకర్‌బర్గ్ ఫిబ్రవరి చివరి మూడు రోజుల్లో 125.4 మిలియన్ డాలర్ల విలువైన 685,000 షేర్లను విక్రయించినట్టుగా తెలుస్తోంది. ఈ విక్రయం ద్వారా లభించే నిధులను రాబోయే ఏడాదిన్నర కాలంలో సీజెడ్ఐ ఫౌండేషన్ నిర్వహించే అనేక దాతృత్వం, స్వచ్ఛంద కార్యక్రమాలకు జుకర్‌బర్గ్ వెచ్చించనున్నట్టుగా సీజెడ్ఐ ప్రతినిధి ఒకరు తెలిపారు. రాబోయే 18 నెలలో దాదాపు 35 నుంచి 75 మిలియన్ ఫేస్‌బుక్ షేర్లను విక్రయించనున్నట్టు గత సంవత్సరం సెప్టెంబర్‌లోనే జుకర్‌బర్గ్ ప్రకటించిన సంగతి విదితమే. ఈ ప్రకటన మేరకే ఆయన దశల వారీగా సంస్థలో షేర్లను విక్రయిస్తూ వస్తున్నారు.

తెలుగువారు దుమ్మురేపుతున్నారు..

- యూ టూబ్‌లో మూడో అతిపెద్ద వాడకందార్లు వీరే
- నెలకు సగటున 22.5 కోట్ల మంది వీక్షకులు
- 400% వృద్ధితో విస్తరిస్తున్నాం..
- 'నవతెలంగాణ'తో యూ ట్యూబ్ ఇండియా హెడ్ సత్య రాఘవన్

వీడియోల ప్రపంచంగా విశ్వవ్యాప్తంగా అభిమానులను సంపాదించుకున్న 'యూ ట్యూబ్'ను భారతీయులు విశేషంగా ఆదరిస్తున్నారని ఆ సంస్థ భారత విభాగం హెడ్ సత్య రాఘవన్ అంటున్నారు. భారతీయులు యూట్యూబ్‌లో కేవలం వీడియోలను చూడడమే కాకుండా.. కంటెంట్ క్రియేట్ చేసేందుకు కూడా అమితాసక్తి కనబరుస్తున్నారని.. ఇటీవలి వరకు కేవలం మెట్రోపాలిటన్‌తో పాటు పెద్ద నగరాలు, పట్టణాలకే పరిమితమైన యూ ట్యూబ్ ఇప్పుడు ద్వితీయ శ్రేణి, తృతీయ శ్రేణి నగరాలను దాటుకొంటూ.. పల్లె తలుపులను కూడా తడుతోందని ఆయన అంటున్నారు. ఇకపై భారత్‌లో మరింత విస్తరిస్తామంటున్న సత్య రాఘవన్ భారతీయుల వీడియో అభిరుచులను గురించి 'నవతెలంగాణ' తో పలు అంశాలను ఇలా పంచుకున్నారు...



తెలుగువారు ఎక్కువగా ఏలాంటి వీడియోలు చూస్తున్నారు?

- తెలుగువారితో పాటు భారతీయులు వినోదపూర్వకంగా ఉండే వీడియోలను ఎక్కువగా వీక్షించేందుకు ఇష్టపడుతున్నారు. కామెడీ, మూజిక్, సినిమా క్లిప్‌లతో పాటు వివిధ రకాల వంటకాల తయారీ టెక్నికల్ అంశాలపై అవగాహన కోసం వీరు యూట్యూబ్‌ను ఆశ్రయిస్తుండడం కనిపిస్తోంది. విద్యార్థులు కూడా సబ్జెక్టులకు సంబంధించిన తమ విషయ పరిజ్ఞానాన్ని పెంచుకొనేందుకు యూట్యూబ్ తలుపు తడుతుండడం విశేషం. యూట్యూబ్ విస్తరణలో తెలుగువారు ప్రముఖ పాత్ర పోషిస్తున్నారు. కంటెంట్ క్రియేషన్‌తో పాటు వివిధ అవసరాలకు యూట్యూబ్‌ను వాడుకోనే విషయంలో వీరు దుమ్ము రేపుతున్నారు.

భారత్‌లో విస్తరణ ఎలా సాగుతోంది?

- యూట్యూబ్ ప్రతియేటా 400% వృద్ధి రేటుతో దూసుకుపోతోంది. ప్రతి నెల దాదాపు 22.5 కోట్ల మంది వీక్షకులు వివిధ రకాల వీడియోల కోసం యూ ట్యూబ్‌ను ఆశ్రయిస్తున్నారు. తాజాగా దేశంలో 4జీ విప్లవం.. చౌక ధరలకు స్మార్ట్‌ఫోన్లు అందుబాటులోకి రావడంతో గ్రామీణ ప్రాంతాలకు, సామాన్యులకు కూడా యూ ట్యూబ్ చేరువవుతోంది. ప్రస్తుతం భారత్‌లోని 400 నుంచి 500 చిన్న పెద్ద పట్టణాల నుంచి వీక్షకులు పెరగడం, కంటెంట్ అప్‌లోడింగ్ పెరుగుతుండడమే ఇందుకు నిదర్శనం. ఇక పల్లెపల్లెకు యూ ట్యూబ్ విస్తరణ త్వరలోనే నెరవేరనుంది.

అభ్యంతరకర వీడియోలపై మీ స్పందన?

- ప్రపంచ వ్యాప్తంగా విస్తరించిన యూట్యూబ్ సంస్థ ఆయా దేశాల్లోని సంప్రదాయలు, కట్టుబాట్లు, చట్టాలకు అనుగుణంగా స్థానికంగా 'కమ్యూనిట్ గైడ్‌లైన్స్'ను రూపొందించుకొని పని చేస్తోంది. ఎదైన అసభ్యకర లేదా అభ్యంతరకర వీడియోల గురించి వీక్షకులు ఫిర్యాదు (ప్లాగ్) చేయగానే సదరు వీడియో కమ్యూనిటి గైడ్‌లైన్స్‌ను ఉల్లంఘించిందా లేదా అన్న విషయాన్ని పరిశీలిస్తాం.. ఒకవేళ ఉల్లంఘన నిజమని తేలితే వెంటనే వాటిని యూట్యూబ్ నుంచి తొలిగిస్తున్నాం. ఇందుకోసం దాదాపు 10,000 మంది సిబ్బంది నిరంతరం మా సంస్థలో పనిచేస్తూ ఉన్నారు. దీనికి తోడు కృత్రిమ మేథస్సు, అత్యాధునిక అల్గారిథమ్‌తో అభ్యంతరకర వీడియోలను గుర్తించి తొలగించే యంత్రాంగాన్ని మేము రూపొందించుకొని ముందుకు సాగుతున్నాం.

\- నవతెలంగాణ, వాణిజ్య విభాగం

ఉద్దేశపూర్వకంగా ఇరికిస్తున్నారు

- పీఎన్‌బీ స్కామ్ నిందితుడు మోడీ
- నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ..



న్యూఢిల్లీ: పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లో (పీఎన్‌బీ) దాదాపు రూ.13,000 కోట్ల మోసానికి పాల్పడిన వజ్రాల వ్యాపారి వ్యాపారి నీరవ్ మోడీ ఈడీతో ఈ-మెయిల్ మంతనాలను కొనసాగిస్తున్నాడు. ఈడీ, సీబీఐ తనపై ఉచ్చు బిగిస్తున్న వేళ.. ఆయన దర్యాప్తు సంస్థల తీరుపై మండిపడ్డారు. చట్టంతో నిమిత్తం లేకుండా తన విధిరాతను అధికారులే నిర్ణయించేస్తున్నారంటూ విస్మయం వ్యక్తం చేశారు. ఉద్దేశపూర్వకంగా ముందస్తు వ్యూహం ప్రకారమే అధికారులు తనను కేసుల్లో ఇరికిస్తున్నారని నీరవ్ తన తాజా ఈ-మెయిల్ సందేశంలో పేర్కొన్నారు. వారి వ్యూహంలో భాగంగానే తనపై దాడి జరుగుతోందని నీరవ్ ఆరోపించాడు. మెరుపు వేగంతో కదులుతున్న అధికారులు చర్యలే ఇందుకు నిదర్శనమన్నాడు. ఒకవైపు తన పాస్‌పోర్టును అధికారులు సస్పెండ్ చేశారని.. మరోవైపు తనను విచారణకు హాజరు కావాల్సిందిగా దర్యప్తు సంస్థలు ఆదేశించడం ఎంతవరకు సబబు అని ఆయన ప్రశ్నించారు. అయితే విదేశాల్లోని వ్యాపార లావాదేవీల్లో పూర్తిగా తనమునకలై ఉన్న తాను సాధ్యమైనంత తొందరగా ఈ స్థితినుంచి బయటపడడానికి ప్రయత్నిస్తున్నానని తన మెయిల్‌లో వివరించాడు.

నీరవ్, ఛోక్సీలపై నాన్‌బెయిలెబుల్ వారెంటు

పీఎన్‌బీ కుంభకోణం విషయంలో డైమండ్ వ్యాపారి నీరవ్ మోడీ, గీతాంజలి జెమ్స్ అధిపతి మెహుల్ చోక్సీలపై చర్యలకు సీబీఐ, ఈడీ వేగంగా పావులు కదుపుతున్నాయి. ఈ నేపథ్యంలో శనివారం వీరువురికీ ముంబైలోని సీబీఐ మనీ ల్యాండరింగ్ కేసుల విచారణ స్పెషల్ కోర్టు నాన్‌బెయిలబుల్ అరెస్ట్ వారెంట్ జారీ చేసింది. ప్రపంచంలో ఎక్కడ ఉన్న స్థానిక భారత హైకమిషన్‌ను సంప్రదించాలని సీబీఐ వారిని కోరింది. వారి ప్రయాణానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తామని చెప్పింది.

'ట్రేడ్‌వార్'పై డబ్ల్యూటీవో ఆందోళన



జెనీవా: ఉక్కు, అల్యూమినియం ఉత్పత్తులపై భారీగా దిగుమతి సుంకం విధించనున్నట్టు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటనపై వరల్డ్ ట్రేడ్ ఆర్గనైజేషన్ (డబ్ల్యూటీవో) ఆందోళన వ్యక్తం చేసింది. ఈ విషయంపై డబ్ల్యూటీవో డైరెక్టర్ జనరల్ రాబర్టో అజెవెడో మాట్లాడుతూ తాము ఏ దేశపు వాణిజ్య విధానాల విషయాల్లోనూ జోక్యం చేసుకోవడం చాలా అరుదని.. అయినప్పటికీ ట్రంప్ చేసిన ప్రకటనతో ట్రేడ్ వార్ జరిగే ప్రమాదం ఉందంటూ తమ విశ్లేషణ వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయని ఆయన అన్నారు. ట్రేడ్‌వార్‌ను ఎవరూ కోరుకోవడం లేదని, పరిస్థితిని డబ్ల్యూటీవో సునిశితంగా పరిశీలిస్తుందని చెప్పారు. ఉక్కు దిగుమతులపై 25 శాతం సుంకాలు, అల్యూమినియంపై 10 శాతం దిగుమతి సుంకాన్ని విధించనున్నట్టు ప్రకటించిన కొద్దిసేపటికే ట్రంప్ ట్రేడ్ వార్ చాలా మంచిదని, తేలికగా గెలువవచ్చని పేర్కొనడం అంతర్జాతీయంగా చర్చనీయమైంది. దీంతో ట్రేడ్ వార్ జరిగే ప్రమాదముందని సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతున్నాయి. అమెరికా ట్రేడ్ వార్ సంకేతాలతో ప్రపంచ స్టాక్ మార్కెట్లు అతలాకుతలమవుతున్నాయి.

సెటిలర్స్‌ను బెదిరించిన కేసీఆర్

- కండ్లు నెత్తికెక్కిన కేటీఆర్ :ఉత్తమ్ ఆగ్రహం



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలంగాణ ఉద్యమ సమయంలో ముఖ్యమంత్రి కెచంద్ర శేఖరరావు సెటిలర్లను బెదిరిం చారని, అధికారంలోకి వచ్చాకేమో కేటీఆర్ తెలంగాణ సొమ్ముతిని కండ్లు నెత్తికెక్కి మాట్లాడుతున్నారని టీపీసీసీ అధ్యక్షులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత సెటిలర్లకు అండగా ఉంటుందని, ఎవరూ భయపడాల్సిన అవసరం లేదన్నారు. వచ్చే ఎన్నికల్లో తెలంగాణ నుంచి కేసీఆర్‌ను తరిమి కొట్టాలని ఆయన పిలుపు నిచ్చారు. శనివారం గాంధీ భవన్‌లో వైసీపీ నేత, మాజీ శాప్ చైర్మెన్ రాజీవ్‌ఠాకూర్‌తోపాటు నిజామాబాద్, గ్రేటర్ హైదరాబాద్ జిల్లాలకు చెందిన కొంత మంది ఇతర పార్టీల నేతలు ఉత్తమ్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ బస్సు యాత్రలను చూసి టీఆర్ఎస్ నేతలు ఆందోళన చెందుతున్నారని చెప్పారు. మంత్రి కేటీఆర్ కాంగ్రెస్‌ను ఇష్టమోచ్చినట్టు తిడుతున్నారని, తిరిగి ఆయనను తిట్టడానికి రేవంత్‌రెడ్డి ఒక్కడే సరిపోతాడని చెప్పారు. మండలిలోని ప్రతిపక్ష నేత షబ్బీర్ అలీ మాట్లాడుతూ కేటీఆర్‌కు అధికార అహంకారం పెరిగిందన్నారు. కాంగ్రెస్ నేతలపై కేసులు ఉన్నాయంటున్న కేటీఆర్ వాటిని ఎందుకు బయటపెట్టడం లేదని ప్రశ్నించారు. మాజీ ఎంపీ మధుయాష్కీగౌడ్ మాట్లాడుతూ తెలంగాణలో రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమన్నారు. కేసీఆర్ అవినీతి, అక్రమాలపై తమ వద్ద అన్ని ఆధారాలు ఉన్నాయని, అవసరమైనప్పుడు వాటిని బహిర్గతం చేస్తామన్నారు. ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్‌పై కేటీఆర్ అడ్డగోలుగా మాట్లాడుతున్నారని, ఇప్పటివరకు ఆయనను బచ్చా అనుకున్నామని, కాదు ఆయనో లుచ్చా అన్నారు. కేసీఆర్ మరో కుటుంబ సభ్యుడు సంతోష్‌కు రాజ్యసభ సీటు ఇవ్వాలని ప్రయత్నిస్తున్నారని, ఆ సీటును అమరవీరుల కుటుంబ సభ్యులకు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.

సాగునీటి రంగానికి రూ. 30,000 కోట్లు?

- భారీ బడ్జెట్ దిశగా సీఎం కసరత్తు
- బ్యాంకుల రుణంతో కలిపి కేటాయింపులు
- నీటిపారుదల శాఖ అధికారుల వెల్లడి



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి

కొత్త బడ్జెట్‌లో మళ్ళీ సాగునీటి రంగానికి పెద్దపీట వేయటానికి నిర్ణయించిన సీఎం ఈ దిశగా కసరత్తు చేస్తున్నట్టు అధికార వర్గాల ద్వారా తెలిసింది. 2018-19 ఆర్థిక సంవత్సరంలో సాగునీటి రంగానికి రూ. 30,000 కోట్లకు తగ్గకుండా కేటాయింపులు ఉంటాయని నీటిపారుదల శాఖ భావిస్తున్నది. అయితే గత రెండు బడ్జెట్లలో కేటాయించిన నిధుల్లో ఎంత ఖర్చుపెట్టారనే ప్రాతిపదికపై తాజా కేటాయింపులు ఉంటాయని ఆర్థిక శాఖ అధికారులు చెప్తున్నట్టు తెలిసింది. కాళేశ్వరం ప్రాజెక్టుకు బ్యాంకుల నుంచి అప్పు తీసుకుంటున్నందువల్ల బడ్జెట్‌లో కేటాయింపులు రూ. 25,000 కోట్లకు మించదనే వాదన కూడా వినిపిస్తున్నది. ఎన్నికలకు ముందు ప్రవేశపెట్టబోయే పూర్తిస్థాయి బడ్జెట్ ఇదే కావటంతో భారీ అంచనాలతో నీటిపారుదల శాఖ ఇప్పటికే ప్రతిపాదనలు పంపించింది. 2018-19 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్రంలోని భారీ, మధ్య తరహా ప్రాజెక్టులతో పాటూ మిషన్ కాకతీయకు రూ. 35,000 కోట్లు కావాలని ప్రతిపాదనలు పంపగా వీటిలో మార్పులు చేర్పులు ముఖ్యమంత్రి స్వయంగా చేస్తారని ప్రభుత్వ వర్గాలంటున్నాయి. రాష్ట్రంలోని అతి పెద్ద ప్రాజెక్టుగా భావిస్తున్న కాళేశ్వరం సహా ప్రధాన ప్రాజెక్టుల పనులన్నీ 2019 లోగా పూర్తి చేస్తా మని ప్రభుత్వం గతంలో ప్రకటించింది. ఈ ప్రాజెక్టుల పనులన్నీ పూర్తి చేయటానికి సవరించిన అంచనాల ప్రకారం రూ. 1,40,000 కోట్లు అవసరమని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తున్నది. దీనిని దృష్టిలో పెట్టుకుని గత రెండు బడ్జెట్‌లలో సాగునీటి రంగానికి రూ. 25,000 కోట్లు కేటాయించారు. అయినప్పటికీ ఈ నిధులను ఖర్చు పెట్టలేక పోయారు. 2016-17 బడ్జెట్‌లో రూ. 25,000 కోట్లు కేటాయించగా కేవలం 16,200 కోట్లు మాత్రమే ఖర్చు పెట్టారు. 2017-18 బడ్జెట్‌లో కూడా రూ. 25,000 కోట్లు కేటాయించగా ఫిబ్రవరి నెలఖరు వరకూ కేవలం రూ. 15,000 కోట్లు మాత్రమే ఖర్చు పెట్టారు. దీనిలో బడ్జెట్ కేటాయింపులు కేవలం రూ. 9,000 కోట్లు కాగా రూ. 6,3000 కోట్లు బ్యాంకుల నుంచి తెచ్చిన రుణం కావటం విశేషం. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మరో 27 రోజుల్లో ముగుస్తుండగా ఇప్పటికే చేసిన పనులకు కూడా నిధులు విడుదల చేయక పోవటంతో కాంట్రాక్టర్లు అసం తృప్తి వ్యక్తం చేస్తున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు ప్రస్తుత బడ్జెట్‌లో రూ. 7,105 కోట్లు కేటాయించగా బడ్జెట్‌లో కేవలం 3,500 కోట్లు మాత్రమే ఖర్చుపెట్టారు. అయితే ఈ ప్రాజెక్టుకు బ్యాంకులు అందిస్తున్న రుణంలో 6,300 కోట్లు ఖర్చుపెట్టారు. బ్యాంకులు అందించే రుణంలో కూడా 20 శాతం రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయాల్సి ఉండగా ఇది విడుదల చేయటంలో జరుగుతున్న జాప్యం వల్ల బ్యాంకులు కూడా తమ వాటా మొత్తాన్ని సకాలంలో విడుదల చేయటం లేదు. కొత్త బడ్జెట్‌లో కూడా కాళేశ్వరం ప్రాజెక్టుకు భారీ కేటాయింపులు ఉంటాయని అధికారులు అంటున్నారు. పాలమూరు-రంగారెడ్డి, సీతారామ, ప్రాజెక్టులకు ఈ సారి కేటాయింపులు పెంచుతారని వారు భావిస్తున్నారు. 2019 డిసెంబర్‌లోగా పూర్తి చేయాలనుకుంటున్న పాలమూరు పాత ప్రాజెక్టులకు కూడా కొత్త బడ్జెట్‌లో పూర్తి స్థాయి కేటాయింపులు అంటాయని వారు తెలిపారు. 2019 ఖరీఫ్‌తో పాటూ యాసంగి పంటలకు సాగునీరందించే ప్రాజెక్టులకు కేటాయింపులు పెంచాలని, పెండింగ్ ప్రాజెక్టుల విషయంలో వాస్తవ ఖర్చు ఆధారంగా కేటాయింపులు చేయాలని ప్రభుత్వం భావిస్తున్నది. శ్రీరామ్‌సాగర్ ఆధునీకరణ, వరద కాల్వ నుంచి నీటిని తరలించే ఎత్తి.పోతల పథకంతో పాటూ తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకానికి పూర్తి స్థాయిలో నిదులు కేటాయించటానికి ఇప్పటికే సీఎం అంగీకరించినట్టు తెలిసింది. మిషన్ కాకతీయ నాలుగవ దశ పనులు ప్రారంభిస్తున్నప్పటికీ కొత్త బడ్జెట్‌లో ఈ పథకానికి కేటాయింపులు రూ. 1,200 కోట్లకు మించక పోవచ్చని భావిస్తున్నారు. రాష్ట్రంలోని వరద కాల్వ, దేవాదుల, బీమా ఎత్తిపోతల పథకాలతో పాటు ఎనిమిది మధ్య తరహా ప్రాజెక్టులకు ప్రధాన మంత్రి కృషి సించాయ్ యోజన (పీఎంకేఎస్‌వై) నుంచి నిధులు అందుతాయని భావిస్తున్నందున ఈ ప్రాజెక్టులకు రాష్ట్ర బడ్జెట్‌లో కేటాయింపులు తక్కువగా ఉంటాయని భావిస్తున్నారు. సుదీర్ఘ కాలంగా పనులు కొనసాగుతున్న ఎస్సెల్బీసీ తదితర ప్రాజెక్టులకు పనుల ప్రగతి ఆధారంగా కేటాయింపులు ఉండే అవకాశం ఉన్నది.



తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సాగునీటి రంగంపై పెట్టిన ఖర్చు (రూ. కోట్లలో)

ఆర్థిక సంవత్సరం	బడ్జెట్ కేటాయింపులు	ఖర్చు
2014-15	6,500	5,285
2015-16	8,000	7,776
2016-17	25,000	16,200
2017-18	25,000	15,000

నోట్ : కాళేశ్వరం ప్రాజెక్టుకు బ్యాంకుల నుంచి తీసుకున్న రూ. 6,300 కోట్లతో కలిపి 2017-18 ఖర్చు పరిగణలోకి తీసుకోవాలి.

అందని నీరు.. ఎండుతున్న పైర్లు

- చి'వరి'కి నీరందించని ఎస్సారెస్పీ కాల్వలు
- అడుగంటిన భూగర్భ జలాలు
- 40వేల ఎకరాల్లో వరి పంట ఎండుముఖం
- పశువుల మేతగా వరిచేను

ఓ పక్క భూగర్భజలాలు అడుగంటి బోర్లు సరిగా పోయట్లేదు. మరోపక్క ఎస్సారెస్పీ కాలువల ద్వారా చివరి ఆయకట్టుకు నీరందట్లేదు. వెరసి ఆయకట్టు పరిధిలోని చివరి భూముల్లోని వరిపైరు పొట్టదశలో ఎండిపోతున్నది. ఇలా పెద్దపల్లి జిల్లా వ్యాప్తంగా సుమారు 40వేల ఎకరాల్లో వరి పంట ఎడిపోయింది. రైతులు ఆ పొలాల్లో పశువులను మేపుకుంటున్నారు. 'రబీలో ఒక్క ఎకరం కూడా ఎండిపోనివ్వం' అని సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ క్షేత్రస్థాయిలో బుట్టదాఖలవుతున్నదన్నది దీనిని బట్టే అర్థమవుతున్నది.

నవతెలంగాణ-పెద్దపల్లి ప్రతినిధి

పెద్దపల్లి జిల్లాలో భూగర్భ జలాలు రోజురోజుకీ పడిపోతున్నాయి. గతేడాది డిసెంబర్ నాటికి 9.20 మీటర్ల లోతు వరకు నీరు ఉండగా, ఈఏడాది జనవరిలో 10.55 మీటర్ల లోతుల్లోకి నీరు అడుగంటిపోయింది. 1108 చెరువులు, కుంటలుండగా..ఇప్పటి వరకు 800 చెరువుల్లో నీరు ఇంకిపోయింది. రెండు నెలల కిందనే హుస్సేన్‌మియా వాగు పూర్తిగా ఎండిపోయింది. ఎక్కువ మంది బోరుబావుల కింద సాగు చేయగా..పొలాలకు ఇప్పుడు నీరు అందట్లేదు. దీంతో రైతులు బావులను మరింత లోతుకు తవ్విస్తున్నారు. సైడ్‌బోర్లు వేస్తున్నా నీళ్లు పడట్లేదు. దీంతో పంటలు ఎండిపోతున్నాయి. పెద్దపల్లి జిల్లా వ్యాప్తంగా ఈ రబీలో 1,05,537 ఎకరాల్లో పంటలు సాగవ్వగా అందులో 95,793 వరి పంటనే వేశారు. నీరందక 40 వేల ఎకరాల్లోని వరి పంట ఎండిపోయింది. మరో రెండు, మూడు వేల ఎకరాల్లో మొక్కజొన్న పంట ఎండుముఖం పట్టింది.

ఎస్సారెస్పీకి చెందిన డీ-86, డీ-84 కాలువల కింద 2.26లక్షల ఎకరాల్లో ఆయకట్టుంది. ఈ రబీలో లక్షా 40వేల వరకు సాగునీరందించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఎనిమిది విడతలుగా ఆరు టీఎంసీల నీరు సరఫరా చేయాలని మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు నిర్ణయించారు. ఇప్పటి వరకు ఐదు విడతలుగా కేవలం రెండు టీఎంసీల నీటినే విడుదల చేశారు. దీంతో ఆయకట్టు చివరి పొలాలకు నీరందట్లేదు. కాల్వశ్రీరాంపూర్, ఓదెల, మంథని, ముత్తారం, పాలకుర్తి, అంతర్గాం, కమాన్‌పూర్ మండలాల్లో తీవ్రత ఎక్కువగా ఉంది. కాల్వశ్రీరాంపూర్ మండలంలోని ఉశన్నపల్లి, గంగారం, మేడిపల్లి, అంకంపల్లి, శ్రీరాంపూర్, చిన్నరాతుపల్లి, పెద్దరాతుపల్లి, మొట్లపల్లి, మీర్జంపేట, కిష్టంపేట గ్రామాల్లో పంటలు పూర్తిగా ఎండిపోతున్నాయి. కాల్వశ్రీరాంపూర్ మండలం అంకెపల్లి గ్రామానికి చెందిన ఆకుల రవి ఎకరన్నర కౌలుకు తీసుకొని ఈ రబీలో వరి సాగు చేశాడు. ఇప్పటికీ రూ.15వేల పెట్టుబడి పెట్టాడు. హుస్సేన్‌మియా వాగు నుంచి పొలానికి పైపులైన్ వేసి మోటారు సహాయంతో నీళ్లను పొలానికి పెడుతున్నాడు. ప్రస్తుతం వరి పొట్టదశకొచ్చింది. ఈ దశలో వాగు ఎండిపోయింది. నెలరోజులుగా నీరు సరిగా పెట్టకపోవటంతో పొట్టకొచ్చిన పైరూ ఎండిపోయింది. 'ఏమ్జేస్తాం? మా బతుకులు గింతే. చేసేదేమీ లేక పశువులను మేపుతున్నా' అని రవి ఆవేదనతో చెప్పాడు. అదే ఊరికి చెందిన యువరైతు ఆకుల రమేష్ నెల రోజులుగా ఎకరం పొలాన్ని కాపాడుకోవటం కోసం తంటాలు పడుతున్నా. కండ్ల ముందే పొలం ఎండిపోతున్నది' అని కన్నీరు పెట్టుకున్నాడు. ఇలా ఆ గ్రామంలో 160 మంది రైతులు 500 ఎకరాల వరకు సాగు చేయగా.. 300 ఎకరాల వరిపైరు ఎండిపోయిందని రైతులు వాపోతున్నారు.




మూడు కొలతలు బావి తవ్వించిన నీరొస్తలేదు: కందన ఓదేలు, రైతు, అంకంపల్లి

బావి కింద రెండు ఎకరాల వరి పంట సాగు చేసిన. పొట్టదశకొచ్చిన చేనుకు నీరందక మూడు కొలతల లోతుకు తవ్వించాను. సైడుకు మూడు బోర్లు వేయించారు. రూ.లక్షా50వేల వరకు ఖర్చు అయింది. కాని బావిలో నీరందడం లేదు. పొలం పూర్తిగా ఎండిపోయింది. ఎండిన పొలంలో మా ఎండ్లను మేపుకుంటున్నాను.

వాగెండితే పొలమూ ఎండింది : నాగిరెడ్డి మంజుల, మహిళా రైతు, ఉశన్నపల్లి

హుస్సేన్‌మియా ఆధారంగా రెండెకరాలలో మొక్కజొన్న, వరి పంటలు సాగు చేశాం. వాగు నుంచి పైపులైన్ వేసి నీళ్లను పొలానికి పెట్టినం. వాగెండిపోయింది. పంటలూ ఎండిపోయాయి. పశువుల మేతకు కోస్తున్నం. ఈద శంకర్‌రెడ్డిది మా ఊరే. ఊళ్లోకి వచ్చిన రైతుల గురించి పట్టించుకోడు.

వాగులోనే బావి తవ్వించినా నీరు రాలే : మేడి శ్రీనివాస్, రైతు, గంగారం



వాగు ఒడ్డునే రెండెకరాల్లో వరి సాగు చేశా. వాగులోనే లక్షల రూపాయలు ఖర్చుపెట్టి చాలా లోతు బావి తవ్వించిన. అరగంటనే మోటారు నడుస్తున్నది. నీరందక పొలం ఎండిపోతున్నది.



విద్యార్థులకు పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఎంతో కంగారు. మరెంతో ఆత్రం... ఆపై భయం... ఎన్నో రకాల మానసిన ఒత్తిళ్లకు విద్యార్థులు లోనవుతుంటారు. అందరూ అలానే ఉంటారా.. నో నో... అందరూ ఒకేలా ఉండరు. చదవాల్సిన సబ్జెక్ట్‌ను చూస్తూ భయపడే వారు కొందరైతే, ఎక్జామ్ ఎప్పుడైనా రాసేందుకు ప్రిపేరై ఉండే వారు కొందరుంటారు.

యువత స్వప్నం...గెలుపు నైజం

"ఎక్సామ్ అంటే కష్టపడాలి, నైట్ అవుట్ చేయాలి, కళ్లు బైర్లు కమ్మేంత వరకు పుస్తకాల్లోనే తలపెట్టాలి అంటే నాకు కుదరదు ఏ క్వశ్చన్ వచ్చినా రాసేందుకు ముందే ప్రిపేర్ అయివుండాలి, పాస్ అవుతానన్న కాన్ఫిడెన్స్ ఉండాలి, పాసవ్వాలి" అనుకునే విద్యార్థులూ ఉంటారు. . అందులో టీనేజ్ విద్యార్థులే ఎక్కువ. కదా ! ప్రతి బ్యాచీలో ఇలా ఒకరుంటారు. ఫ్రెండ్స్ అందరూ కలిసి కంబైండ్ స్టడీ చేస్తే అతను మాత్రం సరదాగా సినిమాకెళ్తాడు. అందరూ రేపటి ఎక్సామ్ కోసం నానా తంటాలు పడుతుంటే మీ ఫ్రెండ్ లిస్టులో ఒకడు జాలీగా ఎంజాయ్ చేస్తాడు. వీళ్లతో పాటే పాస్ అవుతాడు. మీ బ్యాచ్‌లో కూడా ఇలాంటి ఫ్రెండ్ ఉండే ఉంటాడు కదా !

పరీక్షలన్నీ ఒకేలా ఉండవు. ఒక్కో సమయంలో ఒక్కో అనుభూతి, కొత్త కొత్త అనుభవాలు. తెలియని భయం. పదో తరగతి విద్యార్థులైతే ఒక రకమైన ఆందోళనకు గురవుతారు. మొదటి సారి వేరే సెంటర్‌కు వచ్చి పరీక్షలు రాయాల్సి ఉంటుంది. అది వాళ్లకు కొత్త అనుభవం. ఎంత బాగా ప్రిపేర్ అయి ఉన్నా భయం వాళ్లను ముందుకు వెళ్లనివ్వదు. కొత్త ప్రదేశం, కొత్త ఇన్విజిలేటర్లు, కొత్త అనుభవం ఈ కాంప్లెక్స్‌ల నడుమ విద్యార్థులు ఒత్తిడికి గురవుతారు. పదో తరగతి అనగానే స్పెషల్ క్లాస్‌లు, ఎక్స్‌ట్రా హోం వర్క్, రివిజన్స్, అసైన్‌మెంట్స్, గ్యాప్ లేకుండా వరుసగా ఎక్సామ్ రాయాలి. ఈ పరస్థితుల్లో విద్యార్థులు సున్నితంగా ఉండాలి. తనను తాను కంట్రోల్ చేసుకుంటే ఎక్జామ్స్ సాదాసీదాగా గడిచిపోతాయి. ఎస్సెస్సీ ఫలితాలపైనే పై చదువుల నిర్ణయాలు ఉంటాయి కాబట్టి ఈ టైమ్‌లో ఎంత సున్నితంగా ఉంటే అంత మంచింది.

మీ బ్యాచ్‌లో ఎవరున్నారు ?

ఇంటర్, డిగ్రీలోకి వచ్చే సరికి పరిస్థితులు మారిపోతాయి. యవ్వనం మీదికి వస్తుంది. కొత్త కాలేజీల్లో చేరగానే మళ్లీ కొత్త వ్యక్తులు, కొత్త పరిచయాలు. పెద్ద వాళ్లం అయిపోయాం అనే ఫీలింగ్‌లో విద్యార్థులుంటారు. టాపర్లు, బ్యాక్ బెంచర్లు అందరూ కలిసి జాలీగా ఉండే టైం ఇక్కడే. ఇక్కడ పరిచయమైన ఫ్రెండ్సే లైఫ్‌లో గుర్తుండిపోతారు. ఇంటర్, డిగ్రీ స్టూడెంట్స్‌కి పరీక్షలయితే వాటికి ప్రిపేర్ అయ్యే స్టైల్‌యే వేరు. ఫ్రెండ్స్ ప్రోత్సాహంతో ఎక్జామ్స్‌లో రాణించేవారు ఎక్కువ ఉంటారు. ఎక్జామ్స్ అంటే భయపడే వారు కూడా ఉత్సాహంగా పరీక్షలు రాస్తారు. ఇక ఎక్జామ్ టైంలో కంబైన్డ్ స్టడీస్, గ్రూప్ డిస్కషన్స్, వన్ డే బ్యాటింగ్, నైట్ అవుట్స్ ఇలా ఎన్నో రకరకాల పద్ధతుల్లో ఎక్జామ్‌కి సిద్ధమవుతుంటారు. ఓ వైపు వీరు ఇలా పుస్తకాలతో కుస్తీ పడుతుంటే మరో వైపు ఆ బ్యాచీ నుంచే ఒకరు ఎక్జామ్ హాల్లో కాపీ కొట్టడానికి కొత్త పద్ధతులను కనుక్కుంటూ ఉంటారు. లేట్ నైట్ పడుకుని, మళ్లీ ఉదయాన్నే లేచి పుస్తకం పట్టే ఫ్రెండ్ ఉంటే ఎక్జామ్ టైంకి అరగంట ముందు లేచి సెంటర్‌కి పరిగెత్తుకెళ్లే ఫ్రెండ్ కూడా మీ బ్యాచ్‌లో ఉండే ఉంటారు కదా. అసలు సెంటర్‌కు వచ్చేంత వరకూ ఏం ఎక్జామో కూడా తెలియకుండా వచ్చే ఫ్రెండ్‌ని మీరు చూసే ఉంటారు కదా. రేపటి పరీక్ష కోసం చదుకుందాం అని కూర్చుంటే క్రికెట్ ఆడటానికి ప్లే గ్రౌండ్‌కి రమ్మని కాల్ చేసే ఫ్రెండ్ మీ బ్యాచ్‌లో ఉన్నాడా? సెంటర్‌కి హాల్ టికెట్ మర్చిపోయి వచ్చిన ఫ్రెండ్‌నీ, కాపీ కొడుతూ ఇన్విజిలేటర్‌కి దొరికిపోతే బ్లాంక్ ఫేస్ పెట్టుకునే ఫ్రెండ్‌నీ, ఏం ప్రిపేర్ అవలేదు మావా అని చెప్పి గంటలు గంటలు ఎక్జామ్ రాసే ఫ్రెండ్‌నీ చూసి ఎన్నో కామెంట్లు, ఎన్నో సెటైర్లు వేసుకునే ఉంటారు కదా ! మరి మీ బ్యాచీలో ఎలాంటి ఫ్రెండ్ ఉన్నాడో ఒక సారి గుర్తు తెచ్చుకుని సరదాగా నవ్వుకోండి.

సపోర్ట్ ఇంటి నుంచే..

కొందరి విద్యార్థులకు ఎక్జామ్ టైంలో ఇంటి నుంచే ఫస్ట్ సపోర్ట్ ఉంటుంది. పేరెంట్స్ ఇచ్చే మోటివేషన్‌తో పరీక్షలకు సిద్ధం అవుతారు. వాళ్లిచే గైడ్‌లైన్స్ ఫాలో అవుతూ ఫస్ట్ క్లాస్‌లో పాసవుతారు. తమ పిల్లలని టైంకి లేపడం, మంచి భోజనం ఇవ్వడం, గైడ్ చేయటం వంటి పనుల్లో కొందరు పేరెంట్స్ మునిగిపోతారు. ఒక్కో సారి పిల్లలపై ఒత్తిడి కూడా చేస్తారు. టీవీలు చూడనీవకపోవటం, బయటకెళ్లనివ్వకపోవటం, ఎవరినీ కలవకుండా స్ట్రిక్ట్‌గా ఉంచడం చేస్తారు. ఇలా చేయటం వల్ల విద్యార్థులు ఇబ్బంది పడే పరిస్థితి ఎదురవుతుంది. వాళ్ల పరిస్థితిని అంచనా వేసి ఎప్పుడు, ఎలాంటి ఫ్రీడమ్ ఇవ్వాలో పేరెంట్స్‌కి తెలిసి ఉండాలి. ఎప్పుడూ చదువుతూనే ఉండే పిల్లోడిని ఇంకా చదువు అని ఒత్తిడి చేస్తే మానసికంగా ఇబ్బంది పడే ప్రమాదం ఉంది. కాబట్టి పిల్లలకు ఇచ్చే సపోర్ట్ విషయంలో పేరెంట్స్ జాగ్రత్త వహిస్తే, పరిస్థితులను అంచనా వేస్తే... సక్సెస్ ఆ విద్యార్థిని చేరువవుతుంది.

మొదట్లో భయం ఉండేంది

ఇంటర్ మొదట్లో కొంచెం భయపడేవాన్ని. తర్వాత అందరూ ఫ్రెండ్స్ అయ్యారు. ఎక్జామ్స్ అప్పుడు సంతోషంగా ఉంటాను. నోటిఫికేషన్ రాగానే రివిజన్ చేసుకుంటాను. డౌట్స్ ఉంటే తెలిసిన వాళ్ల హెల్ప్ తీసుకుంటాను. ఫస్ట్ క్లాస్‌లో పాసైనప్పుడల్లా చాల సంతోషంగా ఉంటాను.



పి. సాయి అన్వేష్, రంగారెడ్డి జిల్లా

కంబైన్డ్ స్టడీ కచ్చితంగా

ఎక్జామ్ నోటిఫికేషన రాగానే ఫ్రెండ్స్ అందరం కంబైన్డ్ స్టడీ చేయటం అలవాటు. ఇన్‌టర్నల్స్ అప్పుడైతే వన్‌డే బ్యాటింగ్ చేస్తాం. కానీ సెమిస్టర్స్ అప్పుడు కచ్చితంగా ప్రిపేర్ అవుతాం. ఎక్జామ్స్ అయ్యాకా సరదాగా బయటకెళ్లడాలు, సినిమాలకెళ్లడాలు కామన్. హాస్టల్‌లో అందరం కలిసి నైట్ అవుట్ చేస్తాం.



కె. వెంకటేశ్, డిగ్రీ విద్యార్థి, నిజాం కాలేజీ

ఒక్కోసారి వన్‌డే బ్యాటింగ్

పరీక్షలప్పుడు ఒక్కో సారి వన్‌డే బ్యాటింగ్ చేస్తాను. ముఖ్యమైన ప్రశ్నలన్నీ బాగా ప్రాక్టీస్ చేస్తాను. ఇంట్లో ఉన్నప్పుడు మమీ, డాడీ హెల్ప్ తీసుకుంటాను. బాగా సహకరిస్తారు.



గుర్రాల శ్రీసాయి, ఇంటర్ మెట్‌పల్లి, జగిత్యాల జిల్లా

పేరెంట్స్ సపోర్ట్ తోనే

చిన్నప్పటి నుంచి పేరెంట్స్ సపోర్ట్ ఉంది. ఎక్జామ్స్ టైంలో గైడ్ చేస్తారు. ఇంటి నుంచి సపోర్ట్‌తోనే మంచి మార్కులు సాధిస్తున్నా. విద్యార్థి మంచి మార్కులు సాధించాలంటే పేరెంట్స్ సపోర్ట్ ఉండాలని అంటాను.



లౌకిక్, బి-ఫార్మసీ, ఖమ్మం జిల్లా

షెడ్యుల్ పెట్టుకుని చదువుతున్న

షెడ్యుల్ పెట్టుకుని చదువుతున్న ఎగ్జామ్ బాగా రాస్తున్నాను. ఉదయం ఐదు గంటల నుంచి ఏడు గంటల వరకు చదువుతున్నాను. పరీక్ష నుంచి రాగానే ఒత్తిడిని తగ్గించుకోవడానికి స్నేహితులతో కలిసి కాసేపు క్రికెట్ ఆడుకుంటాను. సాయంత్రం ఏడు నుంచి రాత్రి పది గంటల వరకు చదువుకుంటున్నాను. చదువు పట్ల మా కుటుంబ సభ్యులు ప్రోత్సాహం బాగుంది.



కళ్యాణ్, ఇంటర్ జోగులాంబ గద్వాల జిల్లా

కమ్యూనికేషన్ అవసరం



రిలేషన్‌షిప్‌లో లేదా ఫ్రెండ్షిప్‌లో కమ్యూనికేషన్ లేకపోవటం కారణంగానే ఎక్కువ మంది దూరవుతుంటారని సైకాలజిస్టులు చెబుతున్నారు. ఇదే ముఖ్యమైన కారణంతో ఎన్నో ఏండ్లుగా కలిసి ఉంటున్న ఇద్దరు వ్యక్తులు విడిపోతున్నారని చెబుతున్నారు. కమ్యూనికేషన్ అనేది ఇద్దరి వ్యక్తులు తమ అభిప్రాయాలను తెలుసుకోవడానికి, ఒకరినొకరు అర్థం చేసుకోవడానికి ఎంతో అవసరం. కమ్యూనికేషన్ లేకపోవటం కారణంగానే బంధాలకు దూరమవుతున్నట్టు ఓ అంచనా. ఇది ప్రధానం టీనేజ్ వారిలో ఎక్కువ కనిపిస్తోంది. కమ్యూనికేషన్ గ్యాప్ రావటం వల్ల తమ మీద ప్రేమ లేదనో, లేక తాము అంటే ఇష్టం లేదనో మీ ఎదుటి వ్యక్తి అభిప్రాయానికి వచ్చే అవకాశం ఉంది. ప్రతి రోజూ కమ్యూనికేషన్‌లో ఉండి ఒక్కసారిగా కట్ చేస్తే మిమ్మల్ని నమ్మిన వ్యక్తి ఆందోళనకు గురయ్యే ప్రమాదం ఉంది. మీతో ఎక్కువ మాట్లాడడానికి ఇష్టపడే వ్యక్తి మీరు మాట్లాడటం మానేస్తే మనస్తాపానికి గురవుతారు. రిలేషన్‌షిప్‌లో కోపాలు, కొట్టుకోవడాలు సహజమే. మీరు బిజీగా ఉన్నంత మాత్రాన మీ రిలేషన్‌ని అవాయిడ్ చేయటం సరికాదు. ఇది అతన్ని లేదా అమెను తీవ్రంగా బాధిస్తుంది. మీరు తప్పు చేస్తే అయిన వారి కోసం క్షమాపణ చెప్పడం తప్పులేదు. మీరు తప్పు చేసినప్పుడు దాన్ని అంగీకరిస్తే ఎటువంటి హానీ ఉండదు. అది రిలేషన్‌షిప్‌లో మరింత నమ్మకాన్ని పెంచుతుంది.

పరిచయం పదిలం : సమాజంలో మనకు ఎన్నో రకాల పరిచయాలు, బంధుత్వాలుంటాయి. రోజుకూ కొత్త కొత్త వ్యక్తులు పరిచయం అవుతుంటారు. కొత్త కొత్త బంధాలు పెరుగుతూ ఉంటాయి. అయితే వాటిలో ఏ బంధాన్ని, ఏ బంధుత్వాన్ని కొనసాగించాలో ఒక అంచనా ఉండాలి. ముఖ్యంగా టీనేజ్‌లో ఏర్పాడే పరిచయాలు, బంధుత్వాలు జీవితంపై ప్రభావాన్ని చూపుతాయి. వారసత్వం నుంచి ఏర్పడే పరిచయాలు, బయట ఏర్పడ్డ పరిచయాలు, మన లైఫ్‌లో గైడ్ చేసే పరిచయాలు ఇలా కొన్ని ఉంటాయి. వీటిలో ఏ పరిచయానికి ఎంత ప్రాధాన్యత ఇవ్వాలో ముందే తెలుసుకోగల్గాలి. ఎవరికి ఎంత ప్రాధాన్యత ఇవ్వాలో అంత ప్రాధాన్యత ఇవ్వాలి. అలాంటి పరిచయాల్లోనే కొన్ని మనల్ని ఆదుకునేవి, అండగా ఉండేవీ, సుఖ, సంతోషాలు పంచుకునేవి, మోటివేట్ చేసేవి ఉంటాయి. వాటిని గుర్తించాలి. లైఫ్‌కి ఉపయోగపడే పరిచయాలను పెంచుకోవాలి, పెద్దవాళ్లను ప్రసన్నం చేసుకోవటం, అనుభవాజ్ఞులతో మాట్లాడటం నిరంతరం జరగాలి. చిన్న చిన్న విషయాలకు ఎమోషనల్ అవడం సరికాదు. ఆసరాగా ఉండే వ్యక్తులతో ఎంత బలంగా ఉంటే భవిష్యత్‌కు అంత మంచిది.

- నవంత్,బాగ్‌లింగంపల్లి

మజాక్

పర్మిషన్ కోసం కాదు

భార్య :ఏవండీ, చిక్కుడు కాయలు 2 కిలోలు తీస్కోనా?
భర్త: ఆ... తీస్కో.
భార్య : 'మీ పర్మిషన్ కోసం కాదు అడిగింది... ఒకే సారి ఒలవగలరా రెండు కిలోలు అని అడుగుతున్నా..

తాగుబోతు కోరిక

ఒక తాగుబోతు లివర్ చెడిపోయి చనిపోబోతున్నాడు అంతలో దేవుడు ప్రత్యేక్షమై ఏదైన వరం కోరుకో నాయనా....అన్నాడు
తాగుబోతు : వచ్చే జన్మ లో అయిన పళ్ళు 2 మాత్రమే ఇచ్చి లివర్లు 32 ఇవ్వండి సామి

అంతకు ముందు ఆ తర్వాత

ఒక పెద్ద పులి పెండ్లికి జంతువులు అన్నీ హాజరై ఒక పక్కకు నిలబడి శుభాకాంక్షలు చెబుతున్నాయి. ఒక పిల్లి మాత్రం స్టేజీ మీదకు వచ్చి డ్యాన్స్ చేస్తూ శుభాకాంక్షలు చెప్పింది.
అప్పుడు కోపం తెచ్చుకున్న పెద్దపులి పిల్లితో : ఎంత ధైర్యం నీకు అన్ని జంతువులూ పక్కనే నిలబడితే నువ్వు మాత్రం ఇక్కడ వరకూ వచ్చావ్ ఏంటి ?
పిల్లి : ఓసోస్... పెండ్లి కాకముందు నేనూ పెద్ద పులినే బాసు.. నీ పరిస్థితి కూడా అంతే



ఇష్టపడితే ఈజీనే

ఇప్పుడు మారుతున్న ట్రెండ్‌కు తగ్గట్టు ఆంగ్ల భాష నేర్చుకోవడం అనివార్య మవుతోంది. ఉద్యోగాల్లో రాణించాలంటే మినిమమ్ ఇంగ్లీష్ స్కిల్స్ అవసరమవుతున్నాయి. ఉపాధి రంగంలో వచ్చిన మార్పులకు అనుగుణంగా యువతకు ఎన్నో ఉద్యోగాలు అందుబాటులోకి వస్తున్నాయి. కానీ సరైన లాంగ్వేజ్ స్కిల్స్ లేకపోవటం వల్ల ఉద్యోగం దక్కనిపరిస్థితులు ఏర్పడుతున్నాయి. దీన్ని అదిగమించడానికి యువత స్పోకెన్ ఇంగ్లీష్ క్లాసుల్లో చేరడానికి సిద్ధమవుతుంటారు.. మరో వైపు విద్యార్థులు సైతం ఆంగ్ల భాషమీద పట్టు సాధించడానికి ఈ తరగతులను ఉపయోగించుకుంటున్నారు. దీంతో పాటు సెల్ఫ్ ప్రాక్టీస్ ఉంటే ఇంగ్లీష్‌పై ఈజీగా పట్టు సాధించవచ్చు.



ఇంగ్లీష్ నేర్చుకోవటం అనేది సుదీర్ఘ ప్రక్రియ. ఒక లెవెల్ నుంచి ఇంకో లెవెల్‌కు రావడానికి ఎక్కువ సమయం పడుతుంది. కానీ ఈ ప్రక్రియ అసలు కష్టమైంది కాదు. ఇంగ్లీష్ మాట్లాడుతామో లేదో అనే ఫీలింగ్ నుంచి బయటకు వస్తే వయస్సు, ప్రాంతం, మీడియం అనే భేదం లేకుండా ఇంగ్లీష్ మాట్లాడవచ్చు.

Practise the 4 core skills: Reading, Writing, speaking, listening ఈ నాలుగు పద్ధతులు మిమ్మల్ని మీరు ఇంప్రూచేసుకోవడానికి ఎంతో ఉపయోగపడుతాయి. మీరు నేర్చుకున్న కొత్త పదాలను రాసుకోవడానికి ఒక నోట్ బుక్ దగ్గర ఉంచుకోండి. వాటిని ఉపయోగిస్తూ వాక్యాలు తయారు చేసుకోండి. మీరు మాట్లాడుతున్నపుడు ఆ పదాలను ఉపయోగించడానికి ప్రయత్నించండి.

Study Schedule

స్పోకెన్ ఇంగ్లీష్ క్లాస్‌కి అటెండ్ అవడమే కాకుండా. రోజూ వారీగా షెడ్యూల్‌ను క్రియేట్ చేసుకోండి. బ్రేక్ ఫాస్ట్ చేసేటపుడు, అన్నం తినేటపుడు, బయట వాక్ చేస్తున్నపుడు ఇంగ్లీష్ వర్డ్స్‌ని గుర్తు చేసుకోండి. ఇలాంటి చిన్న చిన్న ప్రాక్టీస్ పర్ఫెక్ట్ ఇంగ్లీష్ రావడానికి ఉపయోగపడుతుంది. రోజుకు కనీసం ఒక టెస్ట్ అయినా పెట్టుకోండి, లేదా ఒక లెస్సన్‌ను అభ్యసించండి. మీరు మార్నింగ్ పర్సన్ కాకపోతే మధ్యాహ్నం పూట అయినా ఈ ప్రాక్టీస్ చేయండి.

Turn on music

ఇంగ్లీష్ నేర్చుకోవడమే గోల్ పెట్టుకున్నప్పుడు వీలయినంత మట్టుకు మనం చేసే పనులు ఇంగ్లీష్‌తో ముడిపడి ఉండాలి. ఇంగ్లీష్ సాంగ్స్, రైమ్స్ ఇంటే మెదడును అవి ఉత్తేజ పరుస్తాయి. ఆంగ్ల భాషను నేర్చుకోవటంలో ఇంగ్లీష్ సంగీతం, ఇంగ్లీష్ మూవీస్ చూడటం ఒక అమూల్యమైన సాధనం. ఇది ఉచ్చారణ, ఒకాబులరీ, పదజాలంపై పట్టు సాధించడానికి సహాయపడుతుంది. ఇంగ్లీష్ పాటలు, రైమ్స్ నేర్చుకుని పదే పదే పాడండి. అవసరం అయితే రికార్డ్ చేసుకుని వినండి. ఎవరూ ఇష్టపడరు తమ వాయిస్‌ని తామే వినడం, కానీ ధైర్యం చేయండి. ఇంగ్లీష్‌లో పాడుతున్నపుడు, మాట్లాడటం ప్రాక్టీస్ చేస్తున్నపుడు రికార్డ్ చేసుకుని వినండి. అనర్గళంగా మాట్లాడటం నేర్చుకోవడానికి ఇది దోహద పడుతుంది.

Find a Teacher

భాష అనర్గళంగా మాట్లాడడానికీ, సందేహాలను తీర్చడానికి ఒక ఫ్రెండ్, ఒక టీచర్ అవసరం. క్లాస్ రూంలో వచ్చిన డౌట్‌లను తీర్చడానికి ట్రెయినర్ ఉన్నట్టే మనం బయట ప్రాక్టీస్ చేస్తున్నపుడు వచ్చే డౌట్లను తీర్చడానికి ఒక టీచర్ అవసరం. మనం మాట్లాడుతున్నప్పుడు తప్పులను సరిచేసి చెప్పడానికీ, కొత్త పదాలు నేర్చుకోవడానికి టీచర్ కీలకం. టీచర్‌తో ఇంగ్లీష్‌లో మాట్లాడుతున్నపుడు గ్రామర్, ఒకాబులరీ డెవలప్ అవడానికి అవకాశం ఉంది.

Do a Mistake

ఇంగ్లీష్ మాట్లాడేటపుడు మిస్టేక్ అయితే భయపడవద్దు. మీ నుంచి తప్పు దొర్లితేనే మీ ట్యూటర్ లేదా టీచర్ దాన్ని గుర్తించి మీకు సరైన సమాధానం ఇవ్వగల్గుతారు. కొందరు విద్యార్థులు ఇలా భయపడుతూనే ఉంటారు. దాంతో నేర్చుకోగల్గుతామో లేదో అనే కాంప్లెక్స్‌లోకి వెళ్తారు. ఆత్మవిశ్వాసంతో ఉండండి. నేర్చుకోవటంలో తప్పులు చేస్తున్నామంటే మరో సారి అవి జరగకుండా ఎలా ఉండాలో తెలుసుకోవటం కూడా ప్రాక్టీస్‌లో భాగమే.

Review

ప్రాక్టీస్‌లో ఉన్నపుడు రివ్యూ తప్పని సరి. ప్రాక్టీస్ చేసిన ప్రతిదాన్ని రివ్యూ చేసుకోండి. ఎన్ని రోజులకోసారి రివ్యూ చేసుకోవాలో నిర్ధారించు కోండి. రాసుకున్న పదాలు, నేర్చుకున్న గ్రామర్ ఏంటో రివ్యూ ద్వారా అంచనా వేసుకోండి. దీన్ని వల్ల ఎక్కడ వెనుకబడి ఉన్నామో క్లారిటీ వస్తుంది. గందరగోళంగా ఉంటే ప్రాక్టీస్ చేస్తే సెట్ అవుతుంది.

క్లాస్‌లో ఉన్నపుడు పరధ్యానంలో ఉండకండి. దృష్టి మొత్తం క్లాస్‌పైనే పెట్టండి. అందరికంటే ముందుగా క్లాస్‌కు హాజరవడానికి ప్రయత్నించండి. రివ్యూనోట్స్‌ని, అసైన్‌మెంట్స్‌ని కచ్చితంగా క్లియర్‌గా ఉంచుకోండి. ఇది బ్రెయిన్‌ని ఫ్రెష్ గా ఉంచుకోవడానికి ఉపయోగపడుతుంది.

Give yourself a long term goal as well as a temporary goal too.Focus on working towards it. Use English whenever you can. It as simple as that!



పురుషోత్తం నల్ల
SA English,
ZPHS High School
Kotha Dhamrajpally,
Mallapur(mdl)
Jagtial Dist,
cell : 9704551233

వహ్వా..వహ్వా

ప్రేమ మొగ్గలు



నీతో ఏడడుగులు నడవాలనే ఆశతోనే కదా
నేను నీ వెంబడి అడుగులో అడుగులు వేసింది
ప్రేమంటే సప్తస్వరాల సుమధురసంగీతం

నీతో ప్రణయగీతాలను ఆలపించేయాలనే కదా
నేను స్వరరాగ సుస్వరాలను పలికించేది
ప్రేమంటే సుమధుర రాగాల గానామ తం

నీతో జీవితాన్ని పంచుకోవాలనే ఆర్తితోనే కదా
నేను నీతో స్నేహ వారధిని సదా నిర్మించింది
ప్రేమంటే అనుబంధం కోసం చేసే తపస్సు

నీతో ప్రేమ ఊసులను పలికించాలనే కదా
నేను మధురమైన భావాలను పూయించేది
ప్రేమంటే వెన్నెలను వెలిగించే రవికిరణం

నీతో వసంతాలను పూయించాలనే కదా
నేను ఎన్నో శిశిరాలను నేల రాల్చింది
ప్రేమంటే గుండె పలికే మౌనగీతం

- డాక్టర్ భీంపల్లి శ్రీకాంత్
9032844017

✿✿✿✿✿✿✿✿

నీ నేను

ఊరించే
నీ పెదవుల మధ్య
నలిగిపోయే చెమట బిందువును!

కవ్వించే
నీ కంటి రెప్పల మధ్య
చిక్కుకుపోయే చూపుల చిత్రాన్ని!

ఎగసే
నీ ఉచ్ఛ్వాస నిశ్వాసల మధ్య
ఊగిసలాడే ఊపిరుల సవ్వడిని!

కదిలేటి
నీ చేతి వేళ్ళ కొనల మధ్య
చుట్టుకుపోయే మ దుస్పర్శను!

ఎగిరే
నీ కురుల మధ్య
సతమతమయ్యే విరుల పరిమళాన్ని!

నడిచేటి
నీ కాలి అందియల మధ్య
కొట్టుమిట్టాడే మధుర రవళిని!

వగచేటి
వలపుల మధ్య
వేదనపడే ప్రణయ విరహాన్ని!

ప్రతి అణువులో ప్రతి అడుగులో
ప్రతి క్షణములో ప్రతి పదములో
నీకై పరితపించే నీ నేను!

- పుట్టి గిరిధర్
9491493170

నీ కోసమేనేమో



నీ కోసమేనేమో..
నా మనసు హిమగిరిగా మారింది
కనుల మేఘం వానలా జారింది
పుడమి చెక్కిలి తడి దరి చేరింది
జీవన వ క్షం సంధ్యారాగమై సాగింది.

- రవీంద్ర శివమూర్తి, హైదరాబాద్



భారత్‌కు ఎదురుదెబ్బ!

• ఆసియా గేమ్స్‌లోనూ షూటింగ్ ఈవెంట్లకు కత్తెర

జకర్తా (ఇండోనేషియా) : గోల్డ్ కోస్ట్ కామన్‌వెల్త్ గేమ్స్ తర్వాత మరో ప్రతిష్టాత్మక క్రీడోత్సవంలో షూటింగ్ ఈవెంట్లు గణనీయంగా తగ్గించారు. మరోవైపు బర్మింగ్‌హామ్ గేమ్స్‌లోనూ షూటింగ్ ఈవెంట్ల కొనసాగింపుపై అనిశ్చితి కొనసాగుతూనే ఉన్నది. దీంతో కామన్‌వెల్త్‌తో పాటు ఆసియా గేమ్స్‌లో భారీగా పతకాలు ఆశించిన భారత్‌కు ఎదురు దెబ్బ తగిలినట్టు అయ్యింది!. ఈ ఏడాది ఆగష్టులో జరుగనున్న ఆసియా గేమ్స్‌లో షూటింగ్ టీమ్ ఈవెంట్లను తొలగిస్తున్నామని నిర్వాహకులు ప్రకటించారు. ఆసియా సంప్రదాయ షూటింగ్ ఈవెంట్లు 50 మీటర్ల రైఫిల్, 50 మీటర్ల పిస్టల్, 25 మీటర్ల సెంటర్ ఫైర్ పిస్టల్ సహా 25 మీటర్ల స్టాండర్డ్ పిస్టల్ టీమ్ ఈవెంట్లను.. స్త్రీ, పురుష విభాగాల్లో మొత్తంగా 24 షూటింగ్ ఈవెంట్లను తొలగించారు. తొలగించినవి నాన్ ఒలింపిక్ ఈవెంట్లే అయినా, సంప్రదాయ ఆసియా ఈవెంట్లలో భారత్‌కు మంచి రికార్డుంది. ఈవెంట్లను అకారణంగా తొలగించటంపై నేషనల్ రైఫిల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు రణిందర్ సింగ్ ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఆసియా ఒలింపిక్ కౌన్సిల్‌తో, దేశాలతో చర్చించకుండా ఇన్ని ఈవెంట్లు తొలగించటం ఏమిటో అర్థం కావటం లేదన్నాడు.

పూనియా, వినోద్‌లకు కాంస్యాలు

• ఆసియా రెజ్లింగ్ చాంపియన్‌షిప్స్



న్యూఢిల్లీ : గతేడాది ఆసియా రెజ్లింగ్ చాంపియన్‌షిప్స్ స్వర్ణ విజేత భజరంగ్ పూనియా.. తాజా ఈవెంట్లో కాంస్యం గెలిచాడు. మరో భారత రెజ్లర్ వినోద్ ఓంప్రకాశ్ సైతం కాంస్య పోరులో విజయం సాధించాడు. దీంతో మొత్తంగా ఆసియా రెజ్లింగ్ చాంపియన్‌షిప్స్‌లో భారత్ పతకాల సంఖ్య ఎనిమిదికి పెరిగింది. శనివారం జరిగిన 65 కిలోల పురుషుల ఫ్రీ స్టైల్ బౌట్లో పూనియా ఇరాన్ రెజ్లర్ యోనెస్ అలీఅక్బర్‌ను మట్టికరిపించాడు. 0-2తో ఆరంభించిన పూనియా 2-2తో పాయింట్లు సమం అయ్యాక రెచ్చిపోయాడు. బ్రేక్ తర్వాత ప్రత్యర్థి సైతం మరో రెండు పాయింట్లు నెగ్గినా.. పూనియా దాటికి నిలువలేకపోయాడు. మరో రెజ్లర్ వినోద్ 1-3తో తొలుత వెనుకబడినా మరో పది సెకండ్లలో బౌట్ ముగుస్తుందనగా రెండు పాయింట్లు నెగ్గాడు. 3-3తో స్కోరు సమమైనా.. చివరి సమయంలో కీలకపాయింట్లు సాధించటంతో అతనినే న్యాయనిర్ణేతలు విజేతగా ప్రకటించారు.

అందుకే గెలిచాం!

• కోహ్లి దృక్పథంతోనే వాండరర్స్‌లో విజయం
• టీమ్ ఇండియా చీఫ్ కోచ్ రవిశాస్త్రి

నవతెలంగాణ-ముంబయి

దక్షిణాఫ్రికా పర్యటనకు ఎన్నో ఆశలతో వెళ్లిన టీమ్ ఇండియాకు.. రెండు వారాల్లోపే సిరీస్ ఓటమి వెక్కిరించింది. తుది జట్టు ఎంపికలో చేసిన తప్పిదాలు, వ్యూహచతురత లోపించటం అందుకు ప్రధాన కారణంగా కనిపించాయి. దీంతో కెప్టెన్ విరాట్ కోహ్లితో పాటు చీఫ్ కోచ్ రవిశాస్త్రిపైనా క్రికెట్ విశ్లేషకులు విమర్శనాస్త్రాలు ఎక్కుపెట్టారు. 0-2తో టెస్టు సిరీస్ కోల్పోయిన దశలో నామమాత్రపు మూడో టెస్టుపై పెద్దగా ఆసక్తి చూపించలేదు. కానీ టీమ్ ఇండియా దూకుడు ఇక్కడి నుంచే మొదలైంది. ఆ టెస్టులో అజింక్య రహానె, భువనేశ్వర్ కుమార్‌లను తిరిగి తుది జట్టులోకి తీసుకోవటం.. వారిద్దరూ విజయానికి మూల స్థంభాలుగా నిలిచారు. అయి తే, ఈ విజయం వెనుక జట్టు ప్రదర్శనలో ఇంతటి విప్లవాత్మక మార్పునకు, జట్టు గెలుపు పట్టాలు ఎక్కేందుకు కెప్టెన్ విరాట్ కోహ్లి మూల కారణమని శాస్త్రి చెబుతున్నాడు. 5-1తో వన్డే సిరీస్, 2-1తో టీ20 సిరీస్‌ను సొంతం చేసుకుని సఫారీ పర్యటన నుంచి సగర్వంగా స్వదేశానికి చేరుకున్న రవిశాస్త్రి.. ఓ టీవీ చానల్‌తో పలు అంశాలపై మాట్లాడాడు.

విరాట్ నాయకత్వంతోనే..: విరాట్ కోహ్లి ఎప్పుడూ జట్టును ముందుండి నడిపించే నాయకుడు. మానసికంగా కోహ్లి ఎంతో బలమైన ఆటగాడు, అది సహచర ఆటగాళ్లలోనూ మార్పునకు కారణమవుతోంది. తొలి రెండు టెస్టుల్లో ఓడినా... విజయానికి ఎంతో దూరంలో లేమనే విషయం మాకు తెలుసు. బయటివారు ఏమైనా మాట్లాడతారు, ఏమైనా రాస్తారు. కానీ మేం మరింత బిగ్గరగానే బదులిస్తాం. మూడో టెస్టులో దక్షిణాఫ్రికా లక్ష్యం 241 మాత్రమే. వారు 124/1తో ఉన్నప్పుడు వైట్‌వాష్ తప్పదేమో అనే భావన చాలా మందిలో మెదిలింది. కానీ కోహ్లి జట్టును ప్రేరేపించాడు, విజయం వైపు నడిచేలా చేశాడు. మహ్మద్ షమి (5/28) స్పెల్ సఫారీ కుప్పకూలేలా చేసింది. దక్షిణాఫ్రికా ఆఖరి 9 వికెట్లు కేవలం 53 పరుగులకే కోల్పోయింది. భారత్ 63 పరుగుల తేడాతో గెలుపొందింది. సఫారీ 121/1తో ఉన్నప్పుడు సైతం భారత్ గెలుస్తుందని కోహ్లి నమ్మాడు. ఇంతటి ఆత్మవిశ్వాసం, మానసిక దృఢత్వం సహచరుల్లోనూ వ్యాధిలా వ్యాపిస్తాయి!. అంతిమంగా జట్టు విజయానికి కారణమవుతాయని శాస్త్రి తెలిపాడు.

ఇదిలా ఉండగా మార్చి 6 నుంచి కొలంబోలో జరగనున్న ముక్కోణపు టీ20 సిరీస్‌కు భారత జట్టు నేడు బయల్దేరనున్నది. శ్రీలంక, బంగ్లాదేశ్‌లతో భారత్ అక్కడ తలపడనున్నది. తొలి మ్యాచ్‌లో ఆతిథ్య శ్రీలంకతో టీమ్ ఇండియా ఢీకొట్టనున్నది.

అమిత్ మెరిసినా..

• అర్జెంటీనాతో పోరులో 2-3తో పోరాడి ఓడిన భారత్



ఐపో (మలేసియా): సుల్తాన్ అజ్లాన్‌షా హాకీ కప్ ఆరంభ పోరులో భారత్ పోరాడి ఓడింది. సర్దార్ సింగ్ నేతృత్వంలోని జట్టు ప్రపంచ నెంబర్ 2 అర్జెంటీనా చేతిలో 2-3 తేడాతో ఓటమిపాలైంది. వరుణుడు ఆటంకపరచినా.. పోరులో చివరి వరకు భారత్ శ్రమించింది. భారత్ తరపున అమిత్ రోహిదాస్ ఒక్కడే రెండు గోల్స్ సాధించారు. 13,24వ నిమిషాల్లో గొంజాలో చేసిన పెనాల్టీ గోల్స్‌తో అర్జెంటీనా 2-0తో నిలిచింది. 26, 31వ నిమిషాల్లో భారత్‌కు లభించిన పెనాల్టీ అవకాశాల్ని అమిత్ గోల్స్‌గా మార్చి 2-2తో స్కోరు సమం చేశాడు. కానీ 33వ నిమిషంలో మరో గోల్‌తో అర్జెంటీనా 3-2తో ముందంజ వేసింది. మరో 11 నిమిషాల్లో మ్యాచ్ ముగుస్తుందనగా భారీ వర్షం రావడంతో కాసేపు ఆట నిలిపివేశారు. వరుణుడు తెరపి నివ్వడంతో మళ్లీ ఆడారు. అయినప్పటికీ భారత్‌కు చివరి పది నిమిషాల్లో ఎలాంటి అవకాశాలు దక్కలేదు. రెండో పోరులో భారత్ నేడు ఇంగ్లాండ్‌తో తలపడనున్నది.

• కివీస్‌పై ఇంగ్లాండ్ గెలుపు

వెల్లింగ్టన్ : కివీస్‌తో జరిగిన మూడో వన్డేలో ఇంగ్లాండ్ 4 పరుగుల తేడాతో గెలుపొందింది. ఉత్కంట భరితంగా సాగిన మ్యాచ్‌లో బౌలర్లు ఇంగ్లాండ్‌కు విజయాన్నందించారు. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన ఇంగ్లాండ్ అన్ని వికెట్లు కోల్పోయి నిర్ణీత ఓవర్లలో 234 పరుగుల చేసింది. లక్ష్య ఛేదనలో కివీస్ కెప్టెన్ కానె విలియమ్సన్ (112 నాటౌట్) చెలరేగటంతో న్యూజిలాండ్ విజయం ఖాయమనుకున్నా.. ఆఖరు ఓవర్లలో కట్టుదిట్టమైన బౌలింగ్ చేసిన ఇంగ్లాండ్ 230 పరుగులకే కివీస్‌ను పరిమితం చేసింది.

• భారీ ఆధిక్యంలో ఆసీస్

దర్బన్ : దక్షిణాఫ్రికాతో తొలి వన్డేలో ఆస్ట్రేలియా 402 పరుగుల ఆధిక్యంలో కొనసాగుతోంది. వెలుతురు లేమి కారణంగా 71.4 ఓవర్ల ఆటే సాగిన మూడో రోజు.. తొమ్మిది వికెట్ల నష్టానికి రెండో ఇన్నింగ్స్‌లో 213 పరుగులు చేసింది.

• షకీబ్ అవుట్

న్యూఢిల్లీ : ముక్కోణపు సిరీస్ నిదాహస్ ట్రోఫీకు బంగ్లా ఆల్‌రౌండర్ హకీబ్ అల్ హసన్ దూరమవనున్నాడు. ఇటీవలే ఢాకాలో జరిగిన ఓ వన్డే మ్యాచు లో అతను గాయం బారిన పడ్డాడు. ఈ కారణంగా షకీబ్ టోర్నీలో పాల్గొనటం లేదు



తెలంగాణ కీర్తిని ప్రపంచానికి చాటిన జిమ్నాస్టిక్ క్రీడాకారిణి బుద్దా అరుణారెడ్డిని శుక్రవారం తెలంగాణ ప్రభుత్వం ఘనంగా సన్మానించింది. ఎల్‌బీస్టేడియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమెకు రూ.20లక్షల చెక్కును క్రీడల శాఖ మంత్రి పద్మారావు, సాట్స్ ఛైర్మెన్ వెంకటేశ్వర్‌రెడ్డి, ఎండీ దినకర్‌బాబు, ప్రభుత్వ కార్యదర్శి బి వెంకటేశం అందజేశారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State Editor : S.Veeraiah.Tel Tel/2014/59462.